4-1Pg1exHMNWJQE 1 VJA_4-1Pg1exHMNWJQE.qxd 03/Jan/26 11:18 PM Page 1

ఆదివారం వార్త
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ
: fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
4-1-2026 ఆదివారం సంపుటి: 31 సంచిక: 334 పేజీలు: 12 వెల: 8.00

కపిల్ చిట్స్ మీ వెంట ఆనందం మీ ఇంట
KAPIL GROUP
కపిల్ చిట్స్
46 Years
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

## వెనిజులాపై అమెరికా దాడి
### కరాకస్‌పై భీకర దాడులు
యుద్ధ విమానాల గర్జనతో వణికిపోయిన రాజధాని



# మదురో బందీ
## ప్రత్యేక విమానంలో అమెరికాకు తరలింపు
ధ్రువీకరించిన యుఎస్ అధ్యక్షుడు ట్రంప్
డ్రగ్స్‌ను అమెరికాలోకి పంపుతున్నారని ఆరోపణ
ఇక సైనిక దాడులు చేయబోమని స్పష్టీకరణ 9లో
వారి ఆధారాలు ఇవ్వండి: వెనిజులా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్
ఇది సైనిక దురాక్రమణే: రష్యా మండిపాటు


అమెరికా సైనికుల బందీగా వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో

# పెట్టుబడుల ఊపు
కొత్త సంవత్సరానికి బలమైన ఆరంభం
దేశానికి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25.3 శాతం మనదే
అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడుల గమ్యస్థానం ఎపి: సిఎం చంద్రబాబు



**విజయవాడ,జనవరి3,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడుల గమ్యస్థానంగా రాష్ట్రం మారిందని సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'సామాజిక మాధ్యమం వేదిక సీఎం ట్వీట్ చేసారు. ఇదే అంశంపై సీఎంవో కార్యాలయం సమాచారం విడుదల చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటితొమ్మిది నెలల్లో దేశానికి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25.3శాతం వాటా ఏపీ దక్కించుకున్నట్లు బ్యాంక్ ఆఫ్ బరోడా సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ)నివేదికలో వెల్లడించింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల జోరు, కొత్త సంవత్సరానికి బలమైన ఆరంభమని వ్యాఖ్యానించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఫలితాలు సుస్పష్టమని అన్నారు. పాలసీ సంస్కరణలతో పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరిగిందని తెలిపారు. దేశీయ పెట్టుబడుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో నిలవడం ప్రజలకు శుభవార్త అన్న ఆయన, ముందుచూపుతో అమలు చేస్తున్న పాలసీ సంస్కరణల ప్రభావం ఇదని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కార్యక్రమాల ద్వారా పెట్టుబడిదారులకు వేగవంతమైన సేవలు అందుతున్నాయన్నారు. >>2


శనివారం గుంటూరులో ప్రపంచ తెలుగు మహాసభల్లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విశ్వయోగి విశ్వంజీ

# తేట తెలుగు!
భాష కేవలం భావవ్యక్తీకరణకు మాత్రమే కాదు
అది మన జీవన విధానం, సంస్కృతి
శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు
ఒక ప్రపంచాన్ని సృష్టించే బలం భాషలో ఉంది
సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పిజి నరసింహ
గుంటూరులో ప్రపంచ తెలుగు మహాసభలు ఆరంభం
ఆకట్టుకున్న ఎన్టీఆర్ విగ్రహం, ఛాయాచిత్రప్రదర్శన


ప్రసంగిస్తున్న స్పీకర్ అయ్యన్న పాత్రుడు

**విజయవాడ,జనవరి3,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగు అనేది కేవలం మాట్లాడే భాష మాత్రమే కాదని, అది మన జీవన విధానం. సంస్కృతి అని ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు ఉద్ఘాటించారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో గుంటూరులో మూడో ప్రపంచతెలుగు మహాసభలు నేడు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీనివాస కల్యాణ కార్యక్రమంతో తెలుగు మహాసభలకు శ్రీకారం చుట్టారు. సభా ప్రాంగణంలో తెలుగు తల్లి విగ్రహం ఏర్పాటు చేసి, అక్కడ అతిథులు నీరాజనాలు అర్పించారు. నేటి నుంచి ఈనెల 5 వరకు మూడో ప్రపంచ తెలుగు మహాసభల కార్యక్రమాలు జరుగనున్నాయి. ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో గుంటూరు శివారులోని శ్రీసత్యసాయి ఆధ్యాత్మిక కేంద్రంలో ప్రపంచ తెలుగు మహాసభలు జరుగుతున్నాయి. మూడు రోజులపాటు జరగనున్న ఈ వేడుకలకు తెలుగు భాషాభిమానులు, సాహితీప్రియులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అన్నమయ్య కీర్తనల సహస్ర గళార్చన నడుమ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ, విశ్వయోగి విశ్వంజీ, ఏపీ శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, గుంటూరు మేయర్ కోవెలమూడి రవీంద్ర చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ప్రధాన వేదిక ముందు ఏర్పాటు చేసిన రామోజీరావు హస్తకళల ప్రాంగణంలో తెలుగు భాష ప్రాచీనత్వాన్ని ప్రస్ఫుటించేలా పురాతన సాహిత్యం, ప్రాచీన నాణేలు, తెలుగు సంప్రదాయ వంటకాలు సందడి చేశాయి. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి. హెచ్. మానవేంద్రనాథ్ రాయ్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, విశ్వ హిందీ పరిషత్తు సభ్యులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పాల్గొన్నారు. ఆంధ్ర శ్రీపూర్ణకుంభ పురస్కారాల సభకు ముఖ్యఅతిథిగా ఒడిశా గవర్నర్ కంభం పాటి హరిబాబు హాజరు కానున్నారు. మహాసభల ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథి >>2


ట్రయల్ రన్‌కు సిద్ధమైన భోగాపురం ఎయిర్ పోర్టు

# భోగాపురానికి నేడు ఫస్ట్ ఫ్లైట్!
ట్రయల్ రన్ ప్రారంభించనున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
ఢిల్లీ నుంచి నేరుగా భోగాపురానికి విమానంలో రాక
మారనున్న ఉత్తరాంధ్ర రూపు రేఖలు

**విజయనగరం, జనవరి 3 ప్రభాతవార్త ప్రతినిధి :** ఉత్తరాంధ్ర చరిత్రలో కీలక పరిణామం చోటు చేసుకుంటోంది. ఈ పరిణామంతో ఉత్తరాంధ్ర రూపు రేఖలు మారిపోనున్నాయి. జిల్లాలోని భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో గేమ్‌ఛేంజర్‌గా మారబోతోంది. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన భోగాపురం అంతర్జాతీయ >>2

# అంజన్న దయతోనే నాకు పునర్జన్మ


శనివారం కొండగట్టు అంజన్నకు మొక్కులు చెల్లించుకుంటున్న డిసిఎం పవన్

ఆంజనేయ స్వామి మా ఇంటి ఇలవేల్పు
కొండగట్టు గిరిప్రదక్షిణ మార్గానికి కృషి
అవసరమైతే తానే కరసేవకుడిగా మారుతా
రెండు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలి
డిప్యుటీ సిఎం పవన్ కల్యాణ్
కొండగట్టులో వాయుపుత్ర సదన్ ధర్మశాల నిర్మాణానికి శంకుస్థాపన

**జగిత్యాల, జనవరి 3 ప్రభాతవార్త బ్యూరో:** కొండగట్టు ఆంజనేయ స్వామి మా ఇంటి ఇలవేల్పు అని గిరిప్రదక్షిణ మార్గానికి నా వంతు కృషి చేస్తానని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయ స్వా మిని శనివారం ఏపి డిప్యుటీ సిఎం పవన్ కళ్యాణ్ దర్శించుకున్నారు. వీరితోపాటు టిటిడి బోర్డు చైర్మన్ బి.ఆర్.నాయుడుటిటిడి సభ్యులు పాల్గొన్నారు. మొదట హెలికాప్టర్ ద్వారా జేఎన్టీయూకు చేరుకున్న పవన్‌కళ్యాణ్‌కు రాష్ట్ర ఎస్సీ,ఎస్టీన >>2

# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్
## సుక్మా జిల్లాలో 12 మంది మావోలు మృతి
మృతుల్లో కొంటా ఏరియా కమిటీ కార్యదర్శి మంగడు
ఎకె-47, ఇన్సాస్ రైఫిల్స్, ఇతర ఆయుధాలు స్వాధీనం
అటు బీజాపూర్‌లోనూ ఎదురుకాల్పులు
ఇద్దరు మావోయిస్టులు మృతి



**చర్ల, జనవరి 3 ప్రభాతవార్త:** మావోయిస్టు పార్టీకి వరస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఒకపక్క డిజిపి శివధర్ రెడ్డి ఎదుట పిఎల్‌జిఏ కమాండర్ మావోయిస్టు కీలకనేత బాడ్సే సుక్కా అలియాస్ దేవా తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కంకనాల రాజిరెడ్డితో సహా 21మంది మావోయిస్టులు లొంగిపోయిన సమయంలోనే ఛత్తీస్‌గడ్‌లోని సుక్మా, బీజపూర్‌జిల్లాలలో జరిగిన రెండు వేర్వేరు >>2


దేవా

## గెరిల్లా ఆర్మీ చీఫ్ దేవా లొంగుబాటు
తెలంగాణ డిజిపి ఎదుట కంకణాల రాజిరెడ్డి సహా 20 మంది మావోయిస్టులు కూడా.. 2లో


బళ్లారి ఎస్పీ పవన్ నెజ్జూర్(ఫైల్)

## బళ్లారి ఎస్పీ ఆత్మహత్యాయత్నం
మొన్న పోస్టింగ్.. నిన్న సస్పెన్షన్ 2లో

## డ్రగ్స్‌తో పట్టుబడ్డ జమ్మలమడుగు ఎమ్మెల్యే కుమారుడు
హైదరాబాద్ ఓ ఇంటిపై ఈగల్ టీం దాడి
సుధీర్‌రెడ్డిని డీ అడిక్షన్ సెంటర్‌కు తరలింపు



4-1pg2exHMNWJQE 2_4-1pg2exHMNWJQE.qxd 03/Jan/26 11:15 PM Page 1





కొండగట్టు అంజన్న ఆలయంలో డిసిఎం పవన్, టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు

# అంజన్న దయతోనే నాకు పునర్జన్మ

>> వయోవృద్ధులు, వికలాంగులు మరియు ట్రాన్స్ జెండర్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, ఎండోమెంట్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, స్థానిక ప్రజా ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్న పవన్ కళ్యాణ్ టిటిడి సహకారంతో రూ 35.19 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 35.19 కోట్లతో దీక్ష విరమణ మండపం మరియు 96 గదుల వసతి సముదాయానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏపీ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ఆంజనేయ స్వామి తమ ఇంటి ఇలవేల్పు అని ఆయన దయతోనే తనకు పునర్జన్మ లభించిందని జనసేన అధినేత ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. గతంలో ఆలయ అధికారులు తన దృష్టికి తీసుకు వచ్చిన వెంటనే అభివృద్ధి పనులకు మాట ఇచ్చినట్లు తెలిపారు. కొండగట్టు ఆంజనేయ స్వామి దయతో రెండు తెలుగు రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షి ంచారు. తెలంగాణ ప్రభుత్వం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ మాస్టర్ ప్లాన్ అమలుకు శ్రీకారం చుట్టడం హర్షనీయం అన్నారు. కొండగట్టు గిరి ప్రదక్షణకు మార్గం సుగమం చేసేందుకు అవసరమైతే తానే స్వయంగా కర సేవకుడిని అవుతానని మాట ఇచ్చారు. భవిష్యత్తులో సైతం ఆలయ అభివృద్ధికి తాను అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కొండగట్టు ఆంజనేయ స్వామికి నిధులు కేటాయించినందుకు ఏపి ముఖ్య మంత్రి నారా చంద్రబాబుకు మరియు టిటిడికి నా ధన్యవాదాలు అని అన్నారు. కొండగట్టు అంజన్న స్వామి అజ్ఞ వల్లే టిటిడి వారు అమోదం లభించిందని తెలిపారు. కొండగట్టు అభివృద్ధి కి తెలంగాణ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ రూపొందించడం అభినందనియం అని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఘనంగా స్వాగతం తెలిపిన రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మరియు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గిరిప్రదిక్షణ తెలుగు రాష్ట్రాలకి, దేశానికి కూడ రక్ష అని అన్నారు. కొండగట్టు గిరి ప్రదిక్షణ కి అందరం కలిసి కరసేవా చేద్దాం అని తెలిపారు. అలాగే కొండగట్టు ఆలయ అభివృద్ధికి అందరు కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు మరియు తన అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూఉత్తర తెలంగాణ పుణ్యక్షేత్రాల్లో ప్రధానమైన కొండగట్టు ఆంజనేయ స్వామి అలయంకు ఏపి ఉప ముఖ్యమంత్రి వచ్చి 35.19 కోట్లతో దీక్ష విరమణ మండపం మరియు 96 గదుల వసతి సముదాయానికి టిటిడి నిధులు అందివ్వడం కృతజ్ఞతలు తెలిపారు. కొండగట్టు ఆంజనేయ స్వామి అలయం అభివృద్ధి చేయడంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని తెలిపారు. కొండగట్టు ఆంజనేయ స్వామి అలయంకు వచ్చే దీక్ష విరమణ, దర్శనం కొరకు వచ్చే భక్తుల కొరకు గదుల వసతి సముదాయానికి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని భవిష్యత్తులో తెలంగాణ ప్రజా ప్రభుత్వం ద్వారా నిధులు కేటాయించి కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం తిరుమల తిరుపతి దేవస్థానం లాగా అభివృద్ధి చేస్తామని పునరుద్ఘటించారు. 35.19 కోట్లతో దీక్ష విరమణ మండపం మరియు 96 గదుల వసతి సముదాయానికి టిటిడి నిధులు సమకూర్చడానికి తోడ్పడిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం మాట్లాడుతూకొండగట్టు ఆంజనేయ స్వామి అలయంకు ఏపి డిప్యూటీ సిఎం సహకారంతో 35.19 కోట్లతో దీక్ష విరమణ మండపం మరియు 96 గదుల వసతి సముదాయానికి టిటిడి నిధులు అందివ్వడం కృతజ్ఞతలు తెలిపారు. కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం అభివృద్ధిలో పాలు పంచుకున్న ఏపి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కు కొండగట్టు ఆంజనేయ స్వామి ఆశీస్సులు ఉండాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే గా ప్రభుత్వం నుండి నిధులు తెచ్చి మరింత ఆలయం అభివృద్ధి చేయడంలో నా వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ శాసన మండలి విప్ పిడుగు హరిప్రసాద్, టీటీడీ బోర్డు మెంబర్లు బి.ఆనందసాయి, బి.మహేందర్ రెడ్డి, టీటీడీ ఎల్.ఎ.సీ. చైర్మన్ ఎన్ శంకర్ గౌడ్, ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజా గౌడ్ , జిల్లా అధికారులు, ఆలయ ఈ.వో, ఇతర అధికారులు, ఆలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

# గెరిల్లా ఆర్మీ చీఫ్ దేవా లొంగుబాటు

### తెలంగాణ డిజిపికి ఆయుధాలు అప్పగింత, రూ.20 లక్షల నగదు పోలీసులు స్వాధీనం

### బేషరతుగా లొంగిపోండి: నక్సల్స్‌కు తెలంగాణ శివధర్ రెడ్డి పిలుపు

### దేవాపై ఎన్ఐఎ రూ.75 లక్షల రివార్డు

**హైదరాబాద్, జనవరి 3, ప్రభాతవార్త:** మావోయిస్టు పార్టీకి మరోసారి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, ఎపిలలో ఓ వై పు నిర్బంధం, మరోవైపు ఎదురు కాల్పులు, లొంగుబాట్లు జరుగుతుండగా తాజాగా శనివారం నాడు ఆ పార్టీ అగ్రనేత పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆ ర్మీ (పిఎల్‌జిఏ) కమాండర్ బడ్సె సుక్కా అలియాస్ దేవా, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కంకణాల రాజిరెడ్డి సహా 20 మంది నక్సలైట్లు ఆయు ధాలతో డిజిపి శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. వీరిలో ఆరుగురు మహిళలు వున్నారు. వీరి వద్ద నుంచి రెండు ఎల్ఎంజి, అమెరికాలో తయా రైన అధునాతన తుపాకి, ఇజ్రాయిల్‌లో తయారైన మరో తుపాకి. ఎనిమిది ఎకె 47 తుపాకులు, పది ఇన్సాస్ తుపాకులు, ఎనిమిది ఎస్ఎల్ఆర్ తుపాకులు, నాలుగు బిజిఎల్ తుపాకులు, 11 సింగిల్ షాట్స్ తుపాకులు, రెండు గ్రేనేడ్లు, ఒక ఎయిర్ గన్ పెద్ద ఎత్తున తూటాలను స్వాధీనం చే సుకున్నారు. లొంగిపోయిన వారిలో తెలంగాణకు చెందిన రాష్ట్ర కమిటీ సభ్యుడు వుండగా మిగతా వారంతా ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన వారు.

వచ్చే మార్చి నెలాఖరుకు దేశంలో నక్సలైట్ల ఉనికి లేకుండా చేస్తామని ప్రకటించిన కేంద్రం ఆ దిశగా గట్టి చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాలను ఆదేశించిన నేపథ్యంలో తెలంగాణ సహా మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలు ఓవైపు కూంబింగ్ నిర్వహిస్తూనే మరోవైపు లొంగుబాట్లను ప్రోత్సహిస్తోంది. తెలంగాణలో గత ఏడాది 576 మంది నక్సలైట్లు ఆయుధాలతో పాటు లొంగిపోగా ఈ ఏడాదిలో మొదటి లొంగుబాటులో భాగంగా 20 మంది స రెండర్ అయ్యారు. లొంగిపోయిన వారిలో పిఎల్‌జిఎ కమాండర్ ఛత్తీస్‌ఘడ్‌లోని పువర్తికి చెందిన దేవాతో పాటు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కంకణాల రాజిరెడ్డి వున్నారు. ఇందులో దేవాపై 75 లక్షల రూపాయల రివార్డు వుంది. ఇతను మావోయిస్టు అగ్రనేత హిడ్మా స్వగ్రామానికి చెందిన వ్యక్తి. మావోయిస్టు పిఎల్‌జిఎలో దేవాల కీలకంగా వున్నాడు. కాగా దేవాతో పాటు లొంగిపోయిన వారిలో ఛత్తీస్‌ఘడ్‌కు చెందినమ అవులం సోమా (32), కుంజం పొడియా అలియాస్ శ్రీకాంత్ (30). కోవసి పైకు (20), మడకం లక్కె (20), కర్టం జోగ (20), మడవి అందు (31), కుంజం చోట (21), మడకం అండా (23), కుంజం భీమా (27), మడవి కోసి (25), వేముల రాజు (35), పొడియం చైతే (25) పునెం భీమా (25) మడ కం నందయ్య (22), పుల్సం (24)తో పాటు ఎపికి చెందిన కంకణాల రాజిరెడ్డి సతీమణి ఈశ్వరి (45), హనుమకొండకు చెందిన దార సారయ్య (49)లు వున్నారు. వీరంతా దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ సభ్యులుగానూ, పార్టీ క్షేత్రస్థాయి సభ్యులుగానూ వున్నారు.

**అజ్ఞాతంలో వున్న నక్సలైట్లు లొంగిపోవాలి, తెలంగాణ నుంచి 17 మందే మిగిలారు..డిజిపి వెల్లడి**

గత ఏడాది తెలంగాణలో 576 మంది నక్సలైట్లు లొంగిపోయారని, వీరిలో ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు, 11 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ముగ్గురు డివిజనల్ కమిటీ కార్యదర్శులు, 17 మంది డివిజన్ కమిటీ సభ్యులు, 57 మంది ఏరియా కమిటీ సభ్యులు వున్నారని డిజిపి శివధర్ రె డ్డి తెలిపారు. నక్సలైట్లు ఇంత భారీ సంఖ్యలో లొంగి పోవడం వెనుక పోలీసుల సమిష్టి వ్యూహం, ప్రభుత్వ ప్రోత్సాహం వుందని ఆయన తెలిపా రు. ఇది మావోయిస్టులపై పోలీసుల విజయంగా డిజిపి తెలిపారు. గత అక్టోబర్ 21వ తేదీన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నక్సలైట్లను లొంగిపోవాలని సిఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు మావోయిస్టులు లొంగిపోతున్నట్లు డిజిపి తెలిపారు. మావోయిస్టు పా ర్టీలో జాతీయ స్థాయిలో కేవలం అజ్ఞాత కేడర్‌లో వున్న వారు తెలంగాణకు చెందిన వారు కేవలం 17 మంది మాత్రమే వున్నారని ఆయన తెలిపా రు. పిఎల్‌జిఎ పతనం దిశగా సాగుతోందని ఆయన తెలిపారు. అజ్ఞాతంలో వున్న మావోయిస్టులు జనంలోకి రావాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. లొంగిపోయిన వారికి రివార్డులు ఇవ్వడంతో పాటు సాధారణ జీవితం గడిపేందుకు అవకాశం కల్పిస్తామని, వారిపై ఎలాంటి కేసులు వుం డకుండా చూస్తామని ఆయన తెలిపారు. తాజాగా ఛత్తీస్‌ఘడ్ నుంచి తెలంగాణకు వచ్చి ఆయుధాలతో పాటు వారే లొంగిపోయారని డిజిపి తెలిపా రు. వీరిని ఛత్తీస్‌ఘడ్‌కు పంపి అక్కడ పునరావాసం అమలయ్యేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. లొంగిపోయిన వారి పేరిట వున్న కోటీ 81 లక్షల రూపాయల రివార్డును వారికే ఇస్తున్నామని డిజిపి తెలిపారు. నక్సలైట్ల లొంగుబాటులో విశేషంగా కృషి చేస్తున్న ఎస్ఐబి పోలీసులను డిజిపి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్. గ్రే హౌండ్స్ అదనపు డిజి అనిల్ కుమార్, ఇంటెలి జెన్స్ అదనపు డిజి విజయ్ కుమార్, ఎస్ఐబి ఐజి సుమతి తదితరులు సాల్గొన్నారు.

# పెట్టుబడుల ఊపు

>> ప్రోత్సాహకాల పంపిణీలో పారదర్శకత కోసం ఎస్క్రో ఆధారిత వ్యవస్థను ప్రవేశపెట్టామని వెల్లడించారు. రంగాలవారీగా స్పష్టమైన విధానాలు అమల్లోకి తీసుకొచ్చామన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడుల గమ్యస్థానంగా ఎంచుకున్న ఇన్వెస్టర్లకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు. విజన్‌పై నమ్మకం ఉంచినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ బృందం చేసిన కృషిని ప్రశంసనీయమన్నారు. ఇది విజయానికి ముగింపుగా కాకుండా భవిష్యత్ అభివృద్ధికి పునాదిగా అభివర్ణిద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. పెట్టుబడులు, భాగస్వామ్యాలు, స్థిరమైన వృద్ధిపై ప్రభుత్వం మరింత దృష్టి పెట్టిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. ఏపీ తర్వాత స్థానాల్లో ఒడిశా (13.1 శాతం), మహారాష్ట్ర (12.8 శాతం) ఉన్నాయి. గతంలో ముందు వరుసలో ఉన్న మహారాష్ట్ర, ఒడిశాలను దాటి పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ అగ్రస్థానంలో నిలిచింది. తెలంగాణ 9.5 శాతం, గుజరాత్ 7.1 శాతం పెట్టుబడులతో ఆ తర్వాత స్థానాల్లో నిలిచాయి. పెట్టుబడుల సదస్సుకు ముందే జరిగిన ఎంఒయూల ద్వారా భారీ పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయి. పలు కీలక సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. రెన్యూ పవర్, హీరో ఫ్యూచర్ ఎనర్జీస్, యాక్సిస్ ఎనర్జీ ఉన్నాయి. ఓర్వకల్లులో సాలిడ్ స్టేట్ బ్యాటరీ పరిశ్రమ, కుప్పంలో పాదరక్షల తయారీ యూనిట్ కి తైవాన్ సంస్థలు ముందుకు వచ్చాయి. కర్నూలు జిల్లా ఓర్వకల్లు సమీపంలో జాయింట్ వెంచర్ ద్వారా ఎడ్వాన్స్ బ్యాటరీ తయారీ యూనిట్ ఏర్పాటుకు ఈజౌల్ ఇండియా ముందుకు వచ్చింది. 19వేల 500 కోట్ల పెట్టుబడితో 23 గిగావాట్ల సామర్థంతో సాలిడ్ స్టేట్ బ్యాటరీ, క్యాథోడ్ యాక్టివ్ మెటీరియల్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఆర్థిక అభివృద్ధి బోర్డు(ఈడీబీ)తో ఒప్పందం చేసుకుంది. కుప్పంలో 400 కోట్లతో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు అలీజియన్స్ సంస్థ ఒప్పందం చేసుకుంది. పాదరక్షల తయారీ సంస్థ పౌ చెన్ గ్రూప్ ఓ యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఓర్వకల్లులో ఇమేజ్ సెన్సర్ యూనిట్ల ఉత్పత్తికి క్రియేటివ్ సెన్సర్ ఇంక్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. సెమీకండక్టర్ మిషన్ కింద ప్రోత్సాహకాలు అందించాలని కోరింది. విశాఖ వేదికగా జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో రాష్ట్రంతో దేశవిదేశాల పెట్టుబడిదారులు 613 ఒప్పందాలు ద్వారా 13.25 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని గతంలో సంబంధిత అధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే. వీటి ద్వారా 16 లక్షలకు పైగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భాగస్వామ్య సదస్సులో దాదాపు 5,587 మంది పాల్గొని కలసికట్టుగా విజయవంతం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 19 నెలల్లో రూ.20 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు సాధించామన్నారు. విశాఖ వేదికగా జరిగిన 30వ సీఐఐ 2 రోజుల భాగస్వామ్య సదస్సులో 613ఒప్పందాలు ద్వారా 13.25 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామని వెల్లడించారు. వీటి ద్వారా 16 లక్షలకు పైగా ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో 2019-24 రాష్ట్రానికి చీకటి పాలన అని చంద్రబాబు ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు 5ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలు హామీ ఇచ్చామని ఇప్పటి వరకూ చేసుకున్న ఒప్పందాలు ద్వారా 25 లక్షల ఉద్యోగాల హామీ ఇస్తున్నామని తెలిపారు.

# ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

>> ఎన్‌కౌంటర్లలో 14 మంది మావోయిస్టులు మృతిచెందారు. మావోయిస్టు ఉద్యమం చివరి దశకు చేరుకున్నదన్న చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఒకేరోజు కీలక నేతల లొంగుబాటు, ఎన్ కౌంటర్లలో 14 మంది మృతిచెందడం సంచలనంగా మారింది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా విధించిన గడువుకు ఇంకా తొమ్మిది నెలల సమయం ఉండగా ఇప్పటికే అగ్రనేతలు అందరూ లొంగిపొతున్నారు. మరికొందరు ఎన్ కౌంటర్లలో మృతిచెందారు. కాగా మావోయిస్టు చీఫ్ తిప్పరి తిరుపతి ( దేవ్ జీ) గణపతి పాపారావు దామోదర్ తోపాటు మరో ఇద్దరు నాయకులే మావోయిస్టు పార్టీని నడిపిస్తున్నారు. వీరు సైతంలొంగిపొయే ఆస్కారం ఉందని వదంతులు అప్పుడప్పుడు వినిపిస్తున్నాయి. అదే జరిగితే మావోయిస్టు పార్టీ కనుమరుగు అయ్యే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి..కాగాబస్తర్ రేంజ్ పరిదిలోని సుక్మా జిల్లా కిష్టారం అటవీప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్న సమాచారంతో డిఆర్జీ సిఆర్ పి ఎఫ్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో శనివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో భద్రతా బలగాలకు మావోయిస్టులు ఎదురుపడటంతో ఇరు వర్గాల మద్య పలు దఫాలుగా హోరాహోరీగా కాల్పులు చోటుచేసుకోగా 12 మంది మావోయిస్టులు మృతిచెందారు. మరోవైపు బీజపూర్ జిల్లా దక్షణ ప్రాంతంలో చోటు చేసుకున్న మరో ఎన్ కౌంటర్ లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. రెండు ఎన్ కౌంటర్ల నుండి మొత్తం 14 మంది మావోయిస్టుల మృతదేహాలను స్వాదీన పరుచుకున్నారు. వీరిని గుర్తించాల్సి ఉంది. ఎన్ కౌంటర్ ప్రాంతం నుండి ఏకే 47, ఇన్ సాస్ రైఫిల్స్, ఎస్ ఎల్ ఆర్ రైఫిల్స్, భారీ సంఖ్యలో ఆయుదాలు, పేలుడు పదార్థాలు, ఇతర మావోయిస్టు వస్తువులను స్వాదీన పరుచుకున్నారు. ఎన్ కౌంటర్లను బస్తర్ రేంజ్ ఐజి సుందర్ రాజ్, సుక్మా జిల్లా ఎస్ పి గౌరవ్ రాయ్, బీజపూర్ జిల్లా ఎస్ పి డాక్టర్ జితేంద్ర కుమార్ యాదవ్ దృవీకరించారు.

# బళ్లారి ఎస్పీ ఆత్మహత్యాయత్నం

**బళ్లారి,జనవరి 3:** కర్ణాటకలో సంచలనం సృష్టించిన బళ్లారి కాల్పుల ఘటన కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ సస్పెన్షన్‌కు గురైన జిల్లా ఎస్పీ పవన్ నెజ్జూర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం తనను సస్పెండ్ చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన, తుమకూరు జిల్లాలోని తన స్నేహితుడి ఫామ్‌హౌస్‌లో నిద్రమాత్రలు మింగినట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఈనెల ఒకటోతేదీ బళ్లారిలో జరిగిన హింసాత్మక ఘటనకు కేవలం రెండు గంటల ముందే పవన్ నెజ్జూర్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించడం గమనార్హం. 11 ఏళ్ల సర్వీసులో ఆయనకు ఇదే తొలి ఎగ్జిక్యూటివ్ పోస్టింగ్. ఈ ఘటనలో ఓ కాంగ్రెస్ కార్యకర్త మరణించడంతో, ప్రభుత్వం ఆయనపై నిర్లక్ష్యం ఆరోపణలతో వేటు వేసింది. ఈ పరిణామంపై ప్రతిపక్ష బీజేపీ తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ సర్కార్ ఒక హంతక ప్రభుత్వంగా మారిందని ప్రతిపక్ష నేత ఆర్.అశోక ధ్వజమెత్తారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. ఈ ఘటనలో ఎస్పీని బలిపశువును చేశారు. బళ్లారిలో ఎమ్మెల్యే జనార్దన్ రెడ్డిని హత్య చేసేందుకు కాంగ్రెస్ కార్యకర్తలే ప్రయత్నించి, తమ సొంత కార్యకర్తనే కాల్చి చంపుకున్నారు. అధికారులపై ఒత్తిడి పెంచి వారి ఆత్మహత్యలకు ఈ ప్రభుత్వం కారణమవుతోంది. ఇది ఆత్మహత్య గ్యారెంటీ ఇచ్చే ప్రభుత్వమని అశోక తీవ్ర విమర్శలు చేశారు. అయితే, ఎస్పీ సస్పెన్షన్‌ను కర్ణాటక ప్రభుత్వం సమర్థించుకుంది. ఘటనా స్థలానికి వెంటనే వెళ్లడంలో ఎస్పీ విఫలమయ్యారని, అందుకే ఆయనపై చర్యలు తీసుకున్నామని న్యాయశాఖ మంత్రి హెచ్.కె. పాటిల్ తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన 30 నిమిషాలైనా సరే, ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు అధికారి వెంటనే స్పందించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# డ్రగ్స్‌తో పట్టుబడ్డ జమ్మలమడుగు ఎమ్మెల్యే కుమారుడు

**హైదరాబాద్ (నార్సింగి), జనవరి 3 ప్రభాతవార్త :** డ్రగ్స్ కేసులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డి కుమారుడు సుధీర్‌రెడ్డిని నార్సింగి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నానక్‌రాంగూడలో ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో సుధీర్‌రెడ్డి డ్రగ్స్‌తో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఈ సమయంలో ఇంట్లో ముగ్గురు వ్యక్తులు ఉన్నారు. ముగ్గిరిని పోలీసులు అదుపులోకి తీసుకొని పరీక్షలు చేయగా సుధీర్‌రెడ్డికి పాజిటివ్, మిగితా ఇద్దరికి నెగెటివ్ వచ్చినట్లు తెలిసింది. దీంతో సుధీర్‌రెడ్డిని నార్సింగి పోలీసు స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఆతరువాత ఇతడిని బంజారాహిల్స్‌లోని డీ అడిక్షన్ సెంటర్‌కు తరలించారు. ఇతడిపై గతంలో రెండు డ్రగ్స్ కేసులు ఉన్నట్లు తెలిసింది. గత కొంత కాలంగా ఈగల్ టీం ప్రతినిధులు గంజాయి, డ్రగ్స్ విక్రేతలు, వాడకం దారులపై ప్రత్యేక నిఘాను ఉంచి తనిఖీలు చేస్తున్నారు. ఈ తనిఖీలలో భాగంగానే శనివారం సుధీర్‌రెడ్డి పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ కేసులో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ అంశంపై అధికారికంగా పోలీసులు స్పందించడం లేదు. సుధీర్‌రెడ్డి కుటుంబ సమస్యల కారణంగానే మనస్థాపం చెంది డ్రగ్స్‌కు అలవాటుపడ్డట్లు తెలుస్తుంది. ఇతడికి డ్రగ్స్ ఎక్కడి నుంచి వస్తుంది?ఎవరు సరఫరా చేస్తున్నారు? ఇతడితో పాటు ఎవరెవెరూ డ్రగ్స్‌కు బానిసలుగా ఉన్నారు?అన్న అంశాలను విచారణఅనంతరం పోలీసులువెల్లడించే అవకాశం కనిపిస్తుంది.

**డ్రగ్స్ కేసు విషయం నాకేమీ తెలియదు : ఇన్‌స్పెక్టర్:** డ్రగ్స్ కేసులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎమ్మెల్యే కుమారుడు సుధీర్‌రెడ్డిని అరెస్టు చేశారా? అని ప్రభాతవార్త నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డిని వివరణ అడిగితే... డ్రగ్స్ కేసు విషయం నాకేమీ తెలియదని వివరించారు. నేను చాలా ప్రశాంతంగా ఉన్నాను. ఎలాంటి డ్రగ్స్ కేసులు నమోదు చేయలేదు. ఓ ఎమ్మెల్యే కుమారుడిని అదుపులోకి తీసు కుంటే ఇంత ప్రశాంతంగా స్టేషన్‌లో ఎలా కూర్చుంటా అన్నారు. ఎవరు డ్రగ్స్ కేసును నమోదు చేశారో? ఎవరిని అరెస్టు చేశారో? నాకెలాంటి సమాచారం లేదు. నార్సింగి పోలీసు స్టేషన్‌లో అలాంటి కేసులు నమోదు చేయలేదని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపారు.



శనివారం గుంటూరులో తెలుగుతల్లి విగ్రహానికి నీరాజనాలు అర్పిస్తున్న ప్రముఖులు



ప్రపంచ తెలుగు మహాసభలో ఆకట్టుకున్న ఎన్టీఆర్ విగ్రహం, ఛాయాచిత్ర ప్రదర్శన

# తేట తెలుగు!

>> పాల్గొన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. నేటి తరం పిల్లలకు మన ఆచారాలు, సంప్రదాయాలు తెలియకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అమ్మలు చందమామను చూపిస్తూ పిల్లలకు గోరుముద్దలు తినిపించేవారని, కానీ నేడు సెల్ ఫోన్లను చూపిస్తూ అన్నం తినిపించే పరిస్థితి దాపురించిందన్నారు. అమ్మ పాడే లాలిపాటలో, చెప్పే కథల్లో, జరుపుకునే పండుగల్లో తెలుగు మాధుర్యం దాగి ఉందని గుర్తుచేశారు. **పండుగల శోభ మళ్ళీ రావాలి:** గ్రామాల్లో ఒకప్పుడు సంక్రాంతి, దసరా, ఉగాది, శ్రీరామనవమి వంటి పండుగలు వస్తే పండగ వాతావరణం ఉట్టిపడేదని, హరిదాసులు, గంగిరెద్దులతో సందడిగా ఉండేదని ఆయన గుర్తుచేసుకున్నారు. కానీ నేడు గ్రామాల్లో ఆ కళ కనుమరుగవుతోందన్నారు. మన పిల్లలకు మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందని హితవు పలికారు. తెలుగు భాషను, సంస్కృతిని కాపాడుకుంటూ పూర్వ వైభవాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. తెలుగు ఖ్యాతిని దేశవిదేశాలకు చాటిచెప్పిన మహనీయుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు అని స్పీకర్ కొనియాడారు. ఎన్టీఆర్ స్థాపించిన పార్టీ ద్వారానే సామాన్యులైన ఎంతోమంది రాజకీయాల్లోకి రాగలిగారని, 25 ఏళ్ల వయసులో తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించి నేడు సభాపతి స్థానంలో కూర్చునేలా చేసింది ఎన్టీఆరేనని భావోద్వేగంతో పేర్కొన్నారు. ప్రాథమిక విద్యాభ్యాసంలో మాతృభాష ఆవశ్యకతను నొక్కిచెప్పిన స్పీకర్.. ప్రభుత్వం తరఫున తెలుగు భాషాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ మహాసభల్లో మేధావులు చేసే తీర్మానాలను తనకు పంపాలని కోరారు. ఆ తీర్మానాలను రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టి, చర్చించి, ప్రభుత్వం ద్వారా అమలు చేసేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సత్యసాయి బాబా సన్నిధిలో, ఎన్టీఆర్ కళావేదికపై ఈ కార్యక్రమం జరగడం ఆనందదాయకమని పేర్కొన్నారు. మాట ఇచ్చిన ప్రకారం మూడు రోజులూ తాను ఈ సభల్లోనే ఉంటానని స్పష్టం చేశారు.

మహాసభల ప్రారంభోత్సవ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం నరసింహా పాల్గొని ప్రసంగించారు. 'ఇంత పెద్ద తెలుగు సభ జరుగుతుందని నేను కలలో కూడా ఊహించలేదు. మనిషికి పుట్టుకతోనే మాతృబంధం, భాషాబంధం ఏర్పడతాయి. భాష కేవలం భావవ్యక్తీకరణకు మాత్రమే కాదు. ఒక ప్రపంచాన్ని సృష్టించేంత బలం భాషలో ఉంది. మనందరం భాష వల్ల బంధువులం. తెలుగు భాష వల్ల మనకు ఓ గుర్తింపు ఉంది. అధికార వ్యవహారాల్లో తప్పనిసరిగా తెలుగు ఉండాలి. జిల్లాస్థాయి వరకు కోర్టు కార్యకలాపాలు తెలుగులో జరగాలి' అని ఆకాంక్షి ంచారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ మహాసభలకు అధ్యక్షత వహించి మాట్లాడారు. "తెలుగు భాష ప్రభుత్వానికి అధికార భాష, మాకు మాత్రం మమకార భాష. ఐదో తరగతి వరకు మాతృభాషలోనే చదవాలని జాతీయ విద్యా విధానం చెబుతోంది. నాకు తెలుగు బాగా వచ్చు కాబట్టే ఐదు భాషలు నేర్చుకున్నా. ప్రపంచంలో వివిధ రంగాల ప్రముఖులు వారి మాతృభాషలో చదువుకున్నారు. ఇంగ్లీష్ వల్లే ఉద్యోగాలు రావు. విషయ పరిజ్ఞానం ఉంటే వస్తాయి. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు ఈ విషయంపై దృష్టి పెట్టాలి" అని సీబీఐ పూర్వ జేడీ లక్ష్మీ ్మనారాయణ తెలిపారు. పరిషత్తు తరఫున మూడోసారి ప్రపంచ మహాసభలు నిర్వహిస్తున్నారు. రెండు వేల సంవత్సరాల చరిత్ర ఉన్న ప్రాచీన భాష తెలుగు. నన్నయ్య, తిక్కన, ఎర్రన వంటి వారు తెలుగు భాషకు పట్టం కట్టారు. ఎన్టీఆర్, రామోజీరావు తెలుగుకు గుర్తింపు తెచ్చిన వారిలో ప్రముఖులు" అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వాహకులు పలువురు న్యాయమూర్తులు, సాహితీవేత్తలు, భాషాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సభల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ ఛాయచిత్ర ప్రదర్శన ,ఆయన కృష్ణ ఆహార్యంలో విగ్రహం ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇక 4వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న సభలకు మారిషస్ దేశాధ్యక్షుడు ధరమ్‌బీర్ గోకుల్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. శనివారం రాత్రికే ఆయన గుంటూరు చేరుకోనున్నారు. ఉత్తరాఖండ్ జ్యోతిష్మఠ్ జగద్గురు ఆదిశంకరాచార్య పీఠం ఉత్తరాధికారి స్వామి ప్రత్యక్ చైతన్య ముకుందానందగిరి శంకరాచార్య మహరాజ్, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.జయసూర్య, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, శాసనమండలి ఛైర్మన్ పి.మోషేనురాజు, మంత్రులు పాల్గొంటారు. సాయంత్రం జరిగే కార్యక్రమాలకు త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రసేనారెడ్డి హాజరవుతారు. ఈ సందర్భంగా ఆంధ్ర సారస్వత సేవా పురస్కారాల ప్రదానం జరగనుంది.

# భోగాపురానికి నేడు ఫస్ట్ ఫ్లైట్!

>> విమానాశ్రయానికి ట్రైల్ రన్‌గా జనవరి 4న తొలి విమానం దిగబోతోంది. ఢిల్లీ నుంచి బయలుదేరే ఈఎయిర్ ఇండియా విమానం ఉదయం 11గంటలకు కేంద్ర పౌర విమాన యానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతో పాటు విమానయానశాఖ అధికారులతో రానుంది. ఈ చివరి ట్రయల్ రన్ విజయవంతం అయిన తర్వాత, ఈమే నెల నుంచే ఎయిర్‌పోర్ట్ నుంచి రాకపోకలు సాగించేందుకు సిద్ధంగా ఉన్న ఇతర విమానయాన సంస్థలతో మంత్రిత్వ శాఖ చర్చలు జరపనున్నది. భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వస్తే, విశాఖపట్నం దక్షిణ భారతదేశంలోనే ఒక ప్రధాన ఆర్థిక కేంద్రంగా మారే అవకాశం ఉంది. 24 గంటల పాటు విమాన సర్వీసులు, అంతర్జాతీయ కనెక్టివిటీ, వేలాది ఉద్యోగాలతో ఉత్తరాంధ్ర దశ దిశ మారిపోతుంది. మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పేరిట భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం రూపు దిద్దుకుంటోంది. ఇది కేవలం ఒక విమానాశ్రయం మాత్రమే కాదు, ఉత్తరాంధ్ర జిల్లాల ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చే ఒక అద్భుతం. భూ సేకరణ, న్యాయపరమైన చిక్కులు అధిగమించి 2023మే 3వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేసి 2026 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని ఆ రోజే ప్రకటించారు. ప్రస్తుతం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పర్యవేక్షణలో పనులు ఊహించని వేగంతో సాగుతూ అనుకున్న దాని కంటే ముందే సిద్ధం అయ్యింది. మొదటి దశలో ఏటా 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించేలా టెర్మినల్ నిర్మిస్తున్నారు. భవిష్యత్తులో దీనిని 1.8 కోట్ల వరకు పెంచే అవకాశం ఉంది. విమానాశ్రయంలో డిసెంబర్ 2025 నాటికి 91.7 పైగా పనులు పూర్తయ్యాయి. జనవరి 4న విమానాల ట్రయల్‌రన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈప్రాజెక్ట్ వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల మందికి ఉపాధి లభించనుంది. ఎయిర్‌పోర్ట్ నిర్వహణ, గ్రౌండ్ స్టాఫ్, సెక్యూరిటీ, టికెటింగ్,కార్గో హ్యాండ్లింగ్‌లో సుమారు 5,000 నుండి 10,000 మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది. క్యాబ్ సర్వీసులు, హోటల్ పరిశ్రమ, టూరిజం గైడ్‌లు మరియు మెయింటెనెన్స్ సర్వీసుల ద్వారా మరో 20,000 మందికి పైగా ఉపాధి లభిస్తుంది. భోగాపురం అందుబాటులోకి వస్తే రుషికొండ, భీమిలి బీచ్‌లు, అరకు తదితర పర్యాటక ప్రాంతాలకు అంతర్జాతీయ పర్యాటకుల రాక పెరుగుతుంది.

## వారం - వర్జ్యం

04-01-2026, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం,పూర్వాషాఢ కార్తె
కృ.పాడ్యమి మ.12.34
పునర్వసు మ.3.15
వర్జ్యం : ఉ.10.12-12.07
దు.సా.4.15-5.00
శుభసమయం : సా.6.25-7.30
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** ఎదుటివారు చెప్పేది ఆశాంతం వినండి. తొందరపాటు మాటలు, పరుష సంభాషలు తగాదాలు లాభించవు.

**వృషభం:** ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఋణం చేయడం, ఋణం ఇవ్వడం రెండూ కలిసి రావు.

**మిథునం:** సినీ, కళా రంగాలలోని వారు వస్త్ర వ్యాపారస్తులు జాగరూకతతో మెలగవలసి వుంటుంది. ప్రయాణాలు.

**కర్కాటకం:** ఒకటికి రెండు సార్లు ఆలోచించి విదానంగా అడుగులు వేయడం మంచిది. పనులు మందకొడిగా సాగుతాయి.

**సింహం:**పలురంగాల పట్ల మీకున్న అనుభవం ఉపకరిస్తుంది. వెనువెంటనే పూర్తవుతాయి. ఇంటా బయటా అనుకూలం.

**కన్య :** కరవమంటే కప్పకు కోపం విడవమంటే పాముకు కోపం అన్న చందనంగా ఎవరికీ సర్ది చెప్పలేరు.

**తుల :** దైవం మీద భారం వేసి ఒక కీలక నిర్ణయాన్ని అమలు పరుస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**వృశ్చికం:** సాధ్యమైనంత వరకు పెట్టుబడులను వాయిదా వేయడం మంచిది. ప్రయత్నంలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు.

**ధనుస్సు:** బాధ్యతలు అధికమవుతాయి. వృత్తి, వ్యాపారాలలో మార్పులు వుంటాయి. ఉద్యోగులకు బదిలీలువుంటాయి.

**మకరం:**రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి కొంతవరకు అనుకూలంగా వుంటుంది. నూతన ఒప్పందాలలో తొందరపాటు వద్దు.

**కుంభం:**ఉపయుక్తం లేని అంశాలు ఈరోజు కాలహరణానికి కారణం అవుతాయి. కోర్టు తీర్పులు ఆలసటకు గురిచేస్తాయి.

**మీనం :** కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. వ్యవహారాలు నిదానంగా పూర్తి చేస్తారు. స్వల్ప ధనలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

04-01Pg3exHMNWJQEP 3_04-01Pg3exHMNWJQEP.qxd 03/Jan/26 10:49 PM Page 1



# దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చరిత్ర సృష్టించిన సావిత్రిబాయి పూలే

## - సిఎం చంద్రబాబు

**విజయవాడ,జనవరి3,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చరిత్ర సృష్టించిన సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికగా ఘన నివాళి అర్పించారు. మహిళలను విద్యావంతులుగా చేయాలనే లక్ష్యంతో ఆనాడు సమాజ కట్టుబాట్లను ధిక్కరించి ఆమె చేసిన సాహసం నేటి ఆధునిక మహిళా శక్తికి బలమైన పునాదిగా నిలిచిందని పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే చేసిన పోరాటం మహిళల విద్యకే పరిమితం కాకుండా, పురుషులకన్నా మిన్నగా అవకాశాలను సద్వినియోగం చేసుకునే స్థాయికి మహిళలను తీసుకొచ్చిందని చంద్రబాబు తెలిపారు. ఆమె చూపిన దారిలోనే నేటి మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో నిలుస్తున్నారని అభిప్రాయపడ్డారు. సమాజంలో సగభాగమైన మహిళల విద్యాభివృద్ధిలో సావిత్రిబాయి పూలే కీలక పాత్ర పోషించారని సీఎం గుర్తు చేశారు. అందుకే ఆధునిక మహిళలు ఆమెకు సదా కృతజ్ఞతలు తెలపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మహిళా విద్యకు వెలుగులు నింపిన సావిత్రిబాయి పూలేకు మరోసారి ఘన నివాళులు అర్పిస్తున్నట్లు సీఎం చంద్రబాబు ట్వీట్‌లో తెలిపారు.

దేశ మొట్టమొదటి మహిళా టీచర్ సావిత్రిబాయి పూలే .. లోకేశ్ సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె స్మృతికి ఘన నివాళులు అర్పిస్తున్నానని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే మన దేశ మొట్టమొదటి మహిళా టీచర్ అని, స్త్రీ విద్య, హక్కుల సాధన కోసం జీవితాంతం కృషిచేశారని కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తిని సమాజ మార్పునకు శక్తిమంతమైన సాధనంగా భావించారన్నారు. సామాజిక వ్యతిరేకత, అవమానాలు ఎదురైనా బాలికల విద్య కోసం ధైర్యంగా ముందుకు సాగారని, నేటి మహిళా ఉపాధ్యాయులకు ఆమె మార్గదర్శి అనీ అన్నారు. సావిత్రిబాయి పూలే ఆశయ సాధన కోసం కృషి చేయడమే ఆమెకు మనం అర్పించే నిజమైన నివాళి అని లోకేశ్ పేర్కొన్నారు.



పైలాన్‌ను ఆవిష్కరణ

# వైసిపి పాలనలో డ్రగ్స్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్

### అభ్యుదయం సైకిల్‌యాత్రలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

### ఇచ్ఛాపురంలో డ్రగ్స్ వద్దు బ్రో పైలాన్ ఆవిష్కరించిన హోం మంత్రి అనిత

**ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా), జనవరి 3 ప్రభాతవార్త:** గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో డ్రగ్స్ రాకెట్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దారని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అభ్యుదయం సైకిల్ యాత్ర ముగింపు ఇచ్ఛాపురంలో జరిగింది. డ్రగ్స్ వద్దు బ్రో నినాదంతో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నవంబర్ 12న అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో ప్రారంభించిన సైకిల్‌యాత్ర 1300 కిలోమీటర్లు మేర సాగి ఇచ్ఛాపురంలో ముగిసింది. ఇందుకు చిహ్నంగా స్థానిక టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద పైలాన్‌ను ఏర్పాటు చేశారు. ఈ పైలాన్‌ను రాష్ట్ర హోం శాఖామంత్రి వంగలపూడి అనిత ఆవిష్కరించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ గతంలో దేశంలో ఏ మూలన డ్రగ్స్ దొరికినా దాని మూలాలు ఆంధ్రప్రదేశ్‌లోనే ఉండేవని అన్నారు. రాష్ట్ర ఐటి శాఖామంత్రి నారా లోకేష్ అప్పటి పాదయాత్రలో గంజాయి దుస్థితి తెలుసుకుని ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గంజాయిపై ఉక్కుపాదం మోపారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపడమే సంకల్పమని అన్నారు. పంజాబ్‌లో యువత డ్రగ్స్‌కు బానిసై రాష్ట్రం చిన్నాభిన్నమైందని అటువంటి దుస్థితి రాష్ట్రానికి రాకూడదని ఈగల్ టీం ఏర్పాటు చేసి డేగ కళ్లతో పర్యవేక్షిస్తున్నారని అన్నారు. అదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గంజాయి వ్యాపారులతో కూడా కమిషన్‌కు మాట్లాడుకుని ఒరిస్సా నుంచి గంజాయి రవాణాకు ప్రోత్సహించేవారని అన్నారు. డ్రోన్ వ్యవస్థ ద్వారా గంజాయి పంటలను నాశనం చేసి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించామని అన్నారు. హోంమంత్రి అనిత మాట్లాడుతూ గంజాయి పేరెత్తితే మొక్క తేవాలన్నా భయపడే విధంగా వ్యవస్థ పని చేస్తోందని ఇది గంజాయి రవాణాకు గేట్‌వే కాదని నిరూపించాలని అన్నారు. ఇండిగో సంక్షోభం సమయంలో రామ్మోహన్‌నాయుడు విమర్శలను ధీటుగా ఎదుర్కొని వారంలోగా సమన్వయంతో గాడిలో పెట్టి పూర్వ వైభవం తీసుకొచ్చారని అన్నారు. డ్రగ్స్ వద్దు బ్రో అనే వాక్యం లోకేష్ ఆలోచన నుంచే వచ్చిందని అన్నారు. బోర్డర్‌లో చెక్‌పోస్టులు లేకుండా, సీసీ కెమెరాలు లేకుండా గతంలో పాలన సాగిందని, సున్నా నుంచి మొదలు పెట్టి డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేస్తున్నామని అన్నారు. అమ్మాయిలకు కూడా గంజాయి అలవాటు చేశారని అన్నారు. బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుంటే ఉపాధి అవకాశాలు ఉంటాయని కోరారు. ఈ సమావేశంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఈగల్ ఐజీ రవికిషన్, విశాఖ రేంజ్ ఐజీ గోపినాధ్ జెట్టి, ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, ప్రభుత్వ విప్ మరియు ఎమ్మెల్యే బెందాళం అశోక్, పలాస, నరసన్నపేట, ఎచ్చెర్ల ఎమ్మెల్యేలు గౌతు శిరీష, బగ్గు రమణమూర్తి, నడికుడితి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# 'గోవింద'రాజ ఆలయంలో భద్రతా వైఫల్యం!

### - ఏకాంతసేవ ముగిశాక ఆలయం గోడదూకి లోపలికి..

### - ఆలయగోపురంపైకి వెళ్లి కలశాలు చోరీకి తెలంగాణవాసి యత్నం

**తిరుమల,జనవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరస్వామికి అన్నగా పిలువబడే తిరుపతినగరం నడిబొడ్డున కొలువైన శ్రీగోవిందరాజస్వామి ఆలయం గోపురంపైకి ఓ వ్యక్తి రాత్రివేళ ఎక్కి కలశాలు లాగడానికి చేసిన విఫలయత్నం తిరుమల తిరుపతిదేవస్థానం పెద్దలనేగాక తిరుపతివాసులను భయభ్రాంతులకు గురిచేసింది. శుక్రవారం రాత్రి తొమ్మిదిగంటల సమయంలో ఏకాంతసేవ ముగిసిన తరువాత ఆలయ అధికారులు, అర్చకులు భద్రత సిబ్బంది ఆలయ ప్రధాన ద్వారం తలుపులు, మహద్వారం తలుపులు మూసివేశారు. అంతా వారివారి ఇళ్ళకు చేరుకున్నారు.సరిగ్గా అదే సమయంలో భక్తుడి రూపంలో ఓ వ్యక్తి అప్పటికే మద్యంసేవించిన మత్తులో ఆలయం గోడపైకి ఎగబడి లోపలకు వెళ్ళాడు. ఆలయ మహద్వారం దాటుకుని ఏకంగా గోపురంపైకి రాత్రి 11గంటల ప్రాంతంలో చేరుకున్నాడు. అక్కడ బంగారుపూతతో ఉన్న కలశాలను మూడింటిని లాగడానికి ప్రయత్నించాడు. కొంతసేపటి తరువాత చిన్నపాటి శబ్ధాలు రావడంతో స్థానికులు గమనించి భద్రత సిబ్బందికి తెలిపారు. అప్రమత్తమైన భద్రత సిబ్బంది ఆలయంలోపలకు చేరుకుని గోపురంపైన కూర్చున్న వ్యక్తిని గుర్తించారు. వెంటనే తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం, ఈస్ట పోలీసులు, అగ్నిమాపకశాఖసిబ్బంది, టిటిడి విజిలెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకుని గోపురంపై కూర్చున్న వ్యక్తిని క్రిందకు దించేందుకు చేసిన ప్రయత్నాలు, మంచిమాటలు ఫలించలేదు. తనకు 90ఎంఎల్ మద్యంసీసా తీసుకువస్తే క్రిందకు దిగుతానని పోలీసులతో వాదనలకు దిగాడు. తీరా రెండుగంటల తరువాత అగ్నిమాపక సిబ్బంది బలమైన త్రాళ్ళ సాయంతో గోపురంపైకి చేరుకుని అక్కడ ఉన్న వ్యక్తిని క్రిందకు దించారు. తిరుపతి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.అంతా ఊపిరిపీల్చుకున్నారు.





**- సినిమా ఫక్కీలో ఆలయంలోపలకు:** తిరుమలతిరుపతిదేవస్థానంకు అనుబంధంగా ఉన్న తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో భద్రత వైఫల్యం మరోసారి ప్రస్పుటమైంది. నిత్యం ఇరవైవేలమంది నుండి ముప్పైవేలమందివరకు భక్తులు ఆలయాన్ని సందర్శిస్తుంటారు. ఉదయం నుండి రాత్రి 9గంటల వరకు ఆలయంలో భక్తులకు నిరంతరయంగా దర్శనం కల్పిస్తున్నారు. రాత్రి ఏకాంతసేవ తరువాత ఆలయంలోపల భక్తులు ఎవరూ లేరని నిర్ధారించుకున్న తరువాత ఆలయం తలుపులు మూసివేస్తారు. అలాంటిది శుక్రవారం రాత్రి కట్టుదిట్టమైన భద్రత ఉండే గోవిందరాజస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి 11గంటల ప్రాంతంలో భద్రతా వైఫల్యం కొట్టొచ్చినట్లు బయటపడింది. ఆలయం గోడ దూకి గోపురంపైకి చేరుకున్నా భద్రత సిబ్బందిగానీ, సిసికెమెరాలద్వారా టిటిడి కమాండ్ కంట్రోల్ కేంద్రం సిబ్బందిగానీ గుర్తించలేకపోవడం పనితీరు వైఫల్యం తేటతెల్లం చేసింది. పైకి ఎగబడిన వ్యక్తిని తెలంగాణ నిజామాబాద్ జిల్లా కూర్మవాడ పెద్దమల్లారెడ్డి కాలనీకి చెందిన "కుతడి తిరుపతి"(43)గా పోలీసులు తేల్చారు.యాత్రికులతో కలసి ఆలయంలోపల ఉన్న టెంట్‌కొయ్యలమీదుగా గోపురంపైకి ఎక్కినట్లు తెలిపాడు. మతిస్థిమితం లేని వ్యక్తిగా, మద్యం మత్తులో ఉన్నట్లు అతనిని పోలీసులు అదుపులోకితీసుకున్నట్లు టిటిడి వర్గాల ప్రకటన . తిరుపతినగరం నడిబొడ్డున ఉన్న టిటిడి గోవిందరాజస్వామి ఆలయం ఒక పవిత్రమైన క్షేత్రం. ఈ ఆలయానికి ఆనుకుని ముందుభాగంలో దుకాణాలు ఉన్నాయి.అయినా రాజగోపురంపైకి మద్యం మత్తులో ఎలా వెళ్ళాడనేది ఇతి అత్యంత దారుణమైన సంఘటనగా ప్రజలు, దుకాణాదారులు, ప్రజా సంఘాలు, నేతలు తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయంపైన వెళ్ళినా భద్రతా సిబ్బంది ఎందుకు గమనించ లేదనేది సందిగ్ధత.

# తిరుమల సమాచారం

## ముందస్తు ప్రణాళికలతోనే ఆలయాల్లో సమయానికి కైంకర్యాలు, వాహనసేవలు

### - టిటిడి ఇఒ ఎకె సింఘాల్

**తిరుమల,జనవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానం అనుబంధంగా ఉన్న ఆలయాలు,స్థానిక ఆలయాల విశిష్టతను భక్తులకు అందించేందుకు అసవరమైన చర్యలు తీసుకోవాలని టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ అధికారులను ఆదేశించారు.భక్తుల సౌకర్యార్థం అన్ని ఆలయాల్లో క్యూలైన్లు, సిసిటివిలు,సెక్యూరిటీ, రవాణా,ట్రాఫిక్ తదితర అంశాలపై ,సరైన సమయానికి కైంకర్యాలు, వాహనసేవలకు సంబంధించి ,ప్రధాన ఉత్సవాలు నిర్వహణకు ముందస్తు ప్రణాళికలు ఉండాలన్నారు.టిటిడి స్థానిక ఆలయాలు, అనుబంధ ఆలయాల ప్రాశస్త్యం, శిల్ప సౌందర్యం ప్రధాన అంశాలను భక్తులకు చేరవేసేందుకు అవసరమైతే నిజమైన పారదర్శకతకు కృత్రిమ మేధ సాంకేతికతను సాయం తీసుకోవాలన్నారు. శనివారం సాయంత్రం టిటిడి పరిపాలన భవనంలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఎఫ్ఎసిఎఒ బాలాజీ, సిఇ టివి సత్యనారాయణ, డిఎఫ్ఒ ఫణికుమార్‌నాయుడు, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవితో కలసి ఇఒ సింఘాల్ పలు అంశాలపై సమీక్షించారు. భక్తులకు వైద్యసేవలు, శ్రీవారిసేవకుల సేవలు, పుష్కరిణిని శుభ్రంగా ఉంచేలా చర్యలు, బడ్జెట్, వ్యర్థాలనిర్వహణపై ప్రణాళికలతో చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. అన్నప్రసాదాల కోసం ఉన్న అన్ని అకౌంట్లను ఉపయోగించుకోవాలని, ఆలయాల్లో అన్నదానం పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు., టిటిడి ఆలయాల్లో విశిష్టతను భక్తులకు మరింతగా అందించేందుకు అవసరమైతే ఎస్వీబిసి ఆధ్వర్యంలో మరో ఛానెల్ తీసుకువచ్చే అంశంపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఇఒ సింఘాల్ తెలిపారు.



## రిలయన్స్‌సంస్థ టిటిడికి రూ.3కోట్లు విరాళం

**తిరుమల,జనవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం కు రిలయన్స్ సంస్థ పలు పథకాలకు మూడుకోట్ల రూపాయలు విరాళం అందించింది. ఆ సంస్థ సిఇఒ ,ఇడి పిఎంఎస్ ప్రసాద్ శనివారం ఉదయం టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్‌కు డిడిని అందజేశారు. రిలయన్స్‌సంస్థ పలు దఫాలుగా పలు రకాలుగా టిటిడికి ఇతోధిక సేవలందించడమే గాక విరాళాలు అందిస్తోంది.



## ప్రాణదానం ట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళం

**తిరుమల,జనవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఎస్వీప్రాణదానట్రస్ట్‌కు దాత విరాళం అందించాడు. ఒడిశ్శాకు చెందిన శివంకాండీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎస్వీప్రాణదానం ట్రస్ట్‌కు 10లక్షలు రూపాయలు డిడిని ఆ సంస్థ ప్రతినిధి రాఘవేంద్ర టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి అందించారు.



# కూటమి పాలనలో నగదు రహిత వైద్యసేవల్లో భారీ పురోగతి

### మంత్రి సత్యకుమార్ యాదవ్

**సచివాలయం,జనవరి 3,ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణలో ప్రజలకు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచిత వైద్యసేవలు అందించడంలో సానుకూలమైన మార్పు స్పష్టంగా కనిపిస్తుందని వైద్య ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టంచేశారు. డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవల అమలును, 108 మరియు 104సేవలను శనివారం వర్చువల్‌గా సంబంధిత అధికారులతో మంత్రి సమీక్షించారు. ననపెరిగిన లబ్దిదారలు,వ్యయం గత వైసీపీ ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రోసీజర్ల సంఖ్యను 3257కు పెంచి పూర్తిస్థాయిలో అమలు పరిచిన 2022న23 మరియు 2023న24కాలంలో ఫలితాలను,గత 19నెలల కూటమి పాలనలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ కింద మరియు సాధించిన ఫలితాలను మంత్రి తులనాత్మకంగా విశ్లేషించారు. 2022-24 కాలంలో ఆరోగ్యశ్రీ కింద మొత్తం 23,08,930మంది లబ్దిపొందారు.దీని ప్రకారం సగటున నెలకు 96,205మందికి ఆరోగ్యశ్రీ సేవలందాయి.కూటమి ప్రసభుత్వ పాలనలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఈ ఏడాది డిసెంబర్ వరకు మొత్తం 24,49,117లబ్దిదారులకు వైద్యసేవలందాయి.ఈ మేరకు సగటున నెలకు 1,16,624 మందికి నగదు రహిత వైద్య సేవలు అందడంతో లబ్దిదారుల్లో 21శాతం వృద్ది నమోదైందని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు. --104వాహనాల ద్వారా విస్తృత ప్రయోజనాలు సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశం మేరకు 104వాహనాల ద్వారా త్వరలో ప్రతి ఒక్కరికి 41రకాల వైద్యపరీక్షలు చేసే ప్రక్రియను చేపడతామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.ఈమేరకు జరుగుతున్న సన్నాహకాల గురించి మంత్రి వివరాలు తెలుసుకున్నారు.రాష్ట్ర ప్రజల ఆరోగ్య పరిరక్షణలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ,108 మరియు 104 వాహన సేవలు ఎంతో కీలకమైనవని,వీటి అమలు,నిర్వహణ పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉంటూ నాణ్యమైన సేవల్ని అందించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు.

# ప్రణాళికలతో రికార్డుస్థాయిలో వైకుంఠదర్శనాలు

### - శుక్రవారంరోజే 83వేలమంది భక్తుల దర్శనం

**తిరుమల,జనవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు పటిష్టవ్యూహంతో ముందస్తు ప్రణాళికలతో చక్కగా అమలుచేస్తున్న టిటిడి అధికారులు తొలిమూడురోజులు సఫలీకృతులయ్యారు. ఆ తరువాత సామాన్యభక్తులకు సర్వదర్శనాలు అమలుచేయడంతో నాల్గవరోజు శుక్రవారం ఏకధాటిగా 83,032మంది భక్తులకు వైకుంఠద్వార దర్శనం చేయించడం దశాబ్ధకాలంలో టిటిడి రికార్డు సృష్టించింది. శుక్రవారం శ్రీవారికి అభిషేకసేవ జరుగుతుంది. అయినా సర్వదర్శనంలో భక్తులను ఆ సేవ నిర్వహించే సమయంలో కూడా అనుమతించడంతో తమజన్మధన్యమైందని చూసినవాళ్ళు పునీతులయ్యారు. కాగా ఐదవరోజు శనివారం తిరుమలలో సాధారణ సర్వదర్శనంలో భక్తులు ఎటువంటి టోకెన్, టిక్కెట్ లేకున్నా కృష్ణతేజ కూడలి నుండి క్యూలైన్లలోనికి ప్రవేశిస్తున్నారు. రాత్రి 7గంటల వరకు 43వేలమంది భక్తులకు వైకుంఠద్వార దర్శనాలు చేయించడంలో టిటిడి పూర్తిస్థాయిలో విజయవంతమవుతోంది. గత ఏడాది జనవరిలో జరిగిన వైకుంఠద్వార దర్శనాలు కల్పించడంలో పెద్ద పొరబాట్లు, నిర్లక్ష్యంతో ఈ ఏడాది టిటిడిలో బోర్డు సభ్యుల నుండి ఉన్నతాధికారులు, క్రిందిస్థాయి అధికారులు వరకు ప్రతి ఒక్కరి బాధ్యతను, భద్రతను గుర్తుచేసేలా పక్కా వ్యూహంతో సాఫీగా చేస్తున్నారు. తమిళనాడు, కర్నాటక,మహారాష్ట్ర, కేరళ తెలుగురాష్ట్రాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. టిటిడి ఉన్నతాధికారులు ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, ఎక్కడా చిన్నపాటి పొరబాట్లు, తప్పిదాలు జరగకుండా ఎవరికివారే అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు బాధ్యతతో ఆలయ మాఢవీధులు, వెలుపల క్యూలైన్లలో సకల సౌకర్యాలు భక్తులకు కల్పిస్తూ క్యూలైన్లను చక్కగా తోపులాటకు అవకాశం లేకుండా నిర్వహిస్తున్నారు. భక్తులు కూడా సంతోషం వ్యక్తం చేయడం టిటిడి అధికారుల పనితీరుకు నిదర్శనం, భక్తులు ప్రశాంతంగా,సాఫీగా క్యూలైన్లలోనికి చేరుకునేలా,ఆలయంలోపలకు చేరుకునే వరకు తిరుమల పోలీసులు, టిటిడి విజిలెన్స్, ఆక్టోపస్, ఎస్పిఎఫ్ బలగాలు అనుక్షణం అప్రమత్తంగా ఉంటున్నారు. లక్షమందికిపైగా భక్తులు చేరుకున్నా వైకుంఠమ్ 1లోని ఇంటిగ్రేటెడ్‌కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిరంతరాయంగా ఏఐ విధానంలో పర్యవేక్షిస్తూ క్యూలైన్లను కదిలేలా చూస్తున్నారు. భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, కాఫీ,టీ,పాలు అందించేలా అదనపు ఇఒ వెంకయ్యచౌదరి స్వయంగా పరిశీలిస్తున్నారు. పదిరోజుల వైకుంఠ దర్శనాలను మరో ఐదురోజులు కూడా మరింత ప్రశాంతంగా, భక్తులు ఆనందించేలా విజయవంతంగా నిర్వహించేలా అధికారులు నిమగ్నమయ్యారు. వైకుంఠద్వార దర్శనాల్లో తొలిరోజు డిసెంబర్ 30న 67,053మంది భక్తులు, 31న 70,256మంది భక్తులు, జనవరి 1న 65,225మంది భక్తులు, నాల్గవరోజు శుక్రవారం 83,032మంది భక్తులకు దర్శనాలు చేయించడం టిటిడి అధికారుల సమిష్టికృషికి నిదర్శనం,



## సూర్యజయంతికి విస్తృత ఏర్పాట్లు

**తిరుమల,జనవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** మాఘమాసం సప్తమితిధి ఘడియల్లో ఈనెల 25వతేదీ సూర్య జయంతి (రథసప్తమి) వేడుకలు అంగరంగ వైభ వంగా జరిపించేందుకు టిటిడి అధి కారులు సన్నాహాలు చేస్తున్నారు. 25న ఉదయం 5.30గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ఒకేరోజు ఏడు వాహ నాలపై ఏడుకొండలస్వామి ఆలయ మాఢవీధుల్లో ఊరేగనున్నారు. ఆరోజు ఆలయంలో జరిగే అన్ని ఆర్జితసేవలు, ప్రత్యేకదర్శనాలతోబాటు సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు కూడా టిటిడి రద్దు చేసింది. ఈ మినీబ్రహ్మోత్సవం కోసం అన్ని రకాల ఏర్పాట్లు, మాఢవీధుల్లో గ్యాలరీలు, ప్రవేశ నిష్క్రమణ మార్గాలు,జర్మన్ షెడ్డు ఏర్పాట్లు చేస్తున్నారు.

## అందరికీ శుభాలు కలగాలి: ప్రముఖులు

**తిరుమల,జనవరి 3ప్రభాతవార్తప్రతినిధి:** మాఘమాసం సప్తమితిధి ఘడియల్లో ఈనెల 25వతేదీ సూర్య జయంతి (రథసప్తమి) వేడుకలు అంగరంగ వైభ వంగా జరిపించేందుకు టిటిడి అధి కారులు సన్నాహాలు చేస్తున్నారు. 25న ఉదయం 5.30గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ఒకేరోజు ఏడు వాహ నాలపై ఏడుకొండలస్వామి ఆలయ మాఢవీధుల్లో ఊరేగనున్నారు.


**JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY ANANTAPUR**
ANANTHAPURAMU - 515 002 (A.P.) INDIA

**XV CONVOCATION NOTIFICATION**

The XV Convocation of Jawaharlal Nehru Technological University Anantapur, Ananthapuramu is tentatively scheduled in the month of February/March, 2026. All UG, PG and Ph.D. Candidates who are qualified for the award of degree during the Academic year 2024-25 are hereby informed to submit the applications through Online only (https://jntuaebranchpayment.in / originaldegree) on or before **15.02.2026.** Only Ph.D. Awardees and Gold Medalists will receive the degrees on the dais and others will receive their degrees through registered Post/Courier. Further details can be seen in the web site: www.jntua.ac.in under Examinations section.

Date: 04.01.2026 **Sd/- REGISTRAR**



**AMARAVATI GROWTH AND INFRASTRUCTURE CORPORATION LTD.**
Project Office, Rayapudi, Amaravati, AP - 522 237

**CORRIGENDUM**

**Employment Notification No.3/2025, Dt. 03.01.2026**

In continuation of the recruitment notification Issued earlier for various **contract/ deputation posts** in **Amaravati Growth and infrastructure Corporation Limited (AGICL)**, it is hereby informed that the **salary and allowance details for the following posts stand revised** as indicated below:

| Sl. No. | Name of the Post | Details as Published | Revised Details |
|---|---|---|---|
| 1 | Receptionist | Salary: Rs.50,000/-p.m.<br>Health Insurance Allowance: Rs. 10,000/- p.m. | Salary: Rs. 25,000/-p.m.<br>Fixed travel Allowance + Health Insurance Allowance: Rs. 5,000/- p.m. |
| 2 | Data Entry Operator (DEO) | As per earlier notification | Salary: Rs. 25,000/-p.m.<br>Fixed travel Allowance + Health Insurance Allowance: Rs. 5,000/- p.m. |
| 3 | ITSupport/IT Executive | As per earlier notification | Salary: Rs. 40,000/-p.m.<br>Fixed travel Allowance + Health Insurance Allowance: Rs. 5,000/- p.m. |
| 4 | Assistant Engineer(AE) | As per earlier notification | Salary: Rs. 55,000/-p.m.<br>Fixed travel Allowance + Health Insurance Allowance: Rs. 10,000/- p.m. |
| 5 | Administrative Officer(AO) | As per earlier notification | Salary: Rs. 40,000/-p.m.<br>Fixed travel Allowance + Health Insurance Allowance: Rs. 5,000/- p.m. |

All other **terms and conditions**, including **nature of engagement, eligibility, selection process, and contract conditions,remain unchanged.**
This corrigendum shall form an **integral part of the original recruitment notification** and shall be read in conjunction with the same. **Sd/- Managing Director, AGICL, Amaravati.**


# సంక్రాంతి పండుగ దృష్ట్యా - విజయవాడ వెస్ట్ బైపాస్‌లో కాజ నుంచి గొల్లపూడి వరకు ఒకవైపే వాహనాలకు అనుమతి



**విజయవాడ,జనవరి3,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్రాంతి పండుగ దృష్ట్యా ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. విజయవాడ వెస్ట్ బైపాస్‌లో కాజ నుంచి గొల్లపూడి వరకు ఒకవైపు వాహనాలకు అనుమతినిచ్చింది. తొలుత కార్లు, ద్విచక్ర వాహనాలను ఈ మార్గంలో వెళ్లేందుకు అవకాశం కల్పిస్తారు. దీంతో గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలు ఈ బైపాస్ మీదుగా నేరుగా గొల్లపూడి, అక్కడి నుంచి చిన్నఅవుటపల్లి మీదుగా ఏలూరు వైపు వెళ్లవచ్చు. ఈ మేరకు ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పాక్షికంగా ఒక వైపు వాహనాలు వెళ్లేందుకు అనుమతినిచ్చే దిశలో ఆలోచన చేస్తున్నారు. వెస్ట్ బైపాస్‌లో భాగంగా కాజ- గొల్లపూడి మధ్య 17.88 కి.మీ, గొల్లపూడి- చిన్నఅవుటపల్లి మధ్య 30 కి.మీ. ఆరు వరుసల హైవే నిర్మాణం చేపట్టారు. గొల్లపూడి- చిన్నఅవుటపల్లి మధ్య నిర్మాణం పూర్తికాగా నవంబరు నుంచి ఇందులో అన్ని వాహనాల రాకపోకలకు అనుమతిస్తున్నారు. ఇప్పుడు కాజ- గొల్లపూడి మధ్య కూడా ఒకవైపు వాహనాలను అనుమతించనున్నారు. కాజ నుంచి గొల్లపూడి వైపు (ఒకవైపు) మార్గాన్ని సంక్రాంతికి సిద్ధం చేస్తున్నారు. చెన్నై- కోల్‌కతా హైవేకు ఈ వెస్ట్ బైపాస్‌లోకి అనుసంధానం అయ్యే పనుల్లో ఒకవైపు పూర్తయ్యాయి. దీంతో చెన్నై, ఒంగోలు, గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలను కాజ సమీపంలో వెస్ట్ బైపాస్‌లోకి వెళ్లి గొల్లపూడి చేరుకొని, అక్కడ విజయవాడ- హైదారాబాద్ హైవేలో కలవవచ్చు. ఏలూరు వైపు వెళ్లే వాహనాలు గొల్లపూడి వద్ద దిగకుండా నేరుగా చిన్నఅవుటపల్లి మీదుగా ఏలూరు రోడ్డుపైకి చేరుకోవచ్చు. దీనివల్ల గుంటూరు వైపు నుంచి వచ్చే కార్లు విజయవాడ నగరంలోకి రావాల్సి అవసరం లేకుండానే బైపాస్‌లో ఒకవైపు ప్రయాణించి హైదరాబాద్ వైపుగాని, ఏలూరువైపు వెళ్లవచ్చు. ఇందుకు వీలుగా సంక్రాంతి నాటికి అధికారులు పనులు పూర్తి చేయనున్నారు. వెస్ట్ బైపాస్‌లో అటు ఏలూరు, గొల్లపూడి వైపు నుంచి వచ్చే కార్లు, బైకులు తదితర వాహనాలను ప్రస్తుతం రాష్ట్ర సచివాలయం, హైకోర్టులకు వెళ్లేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఈ వాహనాలు కృష్ణా నది వంతెన, సీడ్ యాక్సెస్ రోడ్డు దాటిన తర్వాత వచ్చే టోల్‌ప్లాజా సమీపంలో మంగళగిరి మండడం రోడ్డులోకి చేరుకొని, అక్కడి నుంచి సచివాలయం వైపు వెళ్తున్నాయి. ఇలా గొల్లపూడి వైపు నుంచి వాహనాలను ఈ నెలాఖరుకు హాయ్‌ల్యాండ్ రోడ్డు వరకు అనుమతించేలా బైపాస్‌లో రెండో వైపు కూడా పనులు పూర్తి చేయనున్నారు. వెస్ట్ బైపాస్ నుంచి హాయ్‌ల్యాండ్ రోడ్‌లో దిగే వాహనాలు చెన్నైకోల్‌కతా హైవే సర్వీస్ రోడ్డులోకి వెళ్తాయి.మార్చి నెలాఖరులోపు వెస్ట్ బైపాస్‌లో పెండింగ్ పనులన్నీ పూర్తి చేయనున్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి చెన్నై- కోల్‌కతా హైవేపై వెళ్లే అన్ని వాహనాలను వెస్ట్ బైపాస్ మీదుగా ఇరు వైపులా పూర్తిస్థాయిలో రాకపోకలు సాగించేలా అనుమతిస్తారు. అధికారికంగా ఆనాటి నుంచే వెస్ట్ బైపాస్ పూర్తిగా తెరిచినట్లు అవుతుందని, అప్పటి వరకు చిన్న వాహనాలను ప్రయోగాత్మకంగానే వదులుతామని అధికారులు చెబుతున్నారు.

జిల్లాల మార్పులు అధికారికంగా అమల్లోకి గత నెలాఖరు నుంచే వచ్చాయి. జిల్లాల పునర్విభజన, రెండు కొత్త జిల్లాల ఏర్పాటుతో ప్రభుత్వ సేవలు ప్రజలకుమరింత వేగంగా, పారదర్శకంగా అందుతాయని సీఎం చంద్రబాబు కేబినెట్ భేటీలో స్పష్టం చేసినట్లు సమాచారం. కొత్తగా ఏర్పడిన జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు స్థానిక అభివృద్ధి, పాలనా సమన్వయానికి కీలకంగా మారనున్నాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్ర పరిపాలనా వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేయడం, అభివృద్ధి వికేంద్రీకరణ, పాలనా వేగం పెంచడం లక్ష్యంగా ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. గూడురులోని మూడు మండలాలను నెల్లూరు జిల్లాలోకి తీసుకువచ్చినట్లు వివరించారు. రంపచోడవరం ప్రాంతంలో గిరిజనుల అభివృద్ధికి కుంటుపడకుండా ఉండేందుకు, ఒకే పార్లమెంట్ పరిధిలో మూడు జిల్లాలు ఉన్నా కూడా ఈ జిల్లా ఏర్పాటు చేశామని వివరించారు. సామర్లకోట మండలాన్ని పెద్దాపురం నియోజకవర్గానికి మార్చినట్లు తెలిపారు. అలాగే పెనుగొండ గ్రామానికి వాసవి పెనుగొండగా పేరు మార్చినట్లు వెల్లడించారు. అద్దంకి నియోజకవర్గాన్ని బాపట్ల జిల్లా నుంచి ప్రకాశం జిల్లాకు మార్చినట్లు వివరించారు. మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, ఎర్రగొండ పాలెం నియోజకవర్గాలను కలిపి మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రైల్వే కోడూరును తిరుపతి జిల్లాలో చేర్చామని తెలిపారు. రాజంపేటను ఎప్పటి నుంచో జిల్లా కేంద్రంగా చేయాలనే డిమాండ్ ఉన్నప్పటికీ, ప్రజల అభిప్రాయం మేరకు కడప జిల్లాలో కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు. మదనపల్లిని జిల్లాగా చేయాలనే ప్రతిపాదన ఉన్నప్పటికీ అది సాధ్యం కాలేదని, అందు వల్ల రాయచోటి నుంచి మదనపల్లికి హెడ్ క్వార్టర్ మార్చి అన్నమయ్య జిల్లాగా మార్పు చేశామని వివరించారు.

# సంస్కరణల బాటలో రెవెన్యూ వ్యవస్థ

**ఘంటా విజయకుమార్**

ఏపీలో రెవెన్యూ వ్యవస్థలో వినూత్న సంస్కరణలతో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం సంచలనాలు సృష్టిస్తోంది. గత ఏడాది రాష్ట్రంలో పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లా పునర్విభజన జరిపింది. ఈ అంశంలో సీఎం చంద్రబాబు ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. గత ప్రభుత్వంలో పార్లమెంటు నియోజకవర్గం పరిధి హద్దుగా 26 జిల్లాలను ఏర్పాటు చేసారు. అయితే ఈజిల్లాల ఏర్పాటుపై తీవ్ర గందరగోళ పరిస్థితి నెలకుంది. జిల్లా కేంద్రాలకు దగ్గర ఉండే మండలాలను మరో జిల్లా చేర్చిన పరిస్థితి. వీటన్నింటిని గమనించి రాష్ట్రంలో కొత్తగా అయిదు రెవెన్యూ డివిజన్లు, కొత్తగా పోలవరం, మార్కాపురం జిల్లాలు ఏర్పడ్డాయి. దీంతో జిల్లాల సంఖ్య 28కి పెరిగింది. అత్యంతరంగా పలకడానికి కష్టంగా కొన్ని గ్రామాలు, మండలాల పేర్లును మార్చారు. రవాణా సదుపాయాలు, మౌలిక వసతులను దృష్టిలో ఉంచుకొని మొత్తం 17 జిల్లాల్లో మార్పులు చేసింది. జిల్లా కేంద్రాన్ని మార్చింది. రైతాంగం గత ప్రభుత్వంలో భూముల సమగ్ర సర్వే విధానం, పాస్‌పుస్తకాలపై నాటి సీఎం చిత్రం, సరిహద్దు రాళ్లపై నాటి సీఎం బొమ్మలు వివాదానికి గురయ్యాయి. ఈ క్రమంలో ప్రభుత్వం పట్టదారు పుస్తకాలను వెనుక తీసుకుంది. రాజముద్రతో దగ్గర,దగ్గరగా 22లక్షల మందికిపైగా రైతులకు పట్టాదారు పాస్‌లు అందజేస్తుంది. ఇందుకుగాను గ్రామ సభలు నిర్వహిస్తుంది.ఈ సందర్భంలోనే రాష్ట్రంలో 22ఎ జాబితాలో ఉన్న ఐదురకాల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించామని రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన దస్త్రంపై ఏపీ రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ కీలక ప్రకటన చేసారు. నూతన సంవత్సరం కానుకగా రైతులకు, భూయాజమానులకు ఉపశమనం కల్గించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశంతో ఐదు రకాల భూములను 22ఎ జాబితా నుంచి తొలగించామని చెప్పారు. మాజీ, ప్రస్తుత సైనిక ఉద్యోగులు, స్వాతంత్ర్య సమర యోధులు, రాజకీయ బాధితులకు కేటాయించిన భూములు, 1954 జూన్ 18కు ముందు అసైన్ చేసిన భూములు, ప్రైవేట్ పట్టా భూములను 22ఎ నుంచి తొలగించినట్లు చెప్పారు. భూ కేటాయింపులు కోసం జిల్లా సైనిక సంక్షేమ అధికారి చేసిన సిఫార్సుల రిజిస్టర్ గానీ 10(1) రిజిస్టర్, అడంగల్, ఎస్ఎఫ్ఎ వంటి పాత రెవెన్యూ రికార్డులు, ఎస్టేట్‌మెంట్ రిజిస్టర్లు లేదా డీఆర్ డికెటి పట్టాల్లో ఏదైనా ఒకటి ఉన్నా 22ఎ నుంచి తొలగింపజాని అధికారులకు ఆదేశాలిచ్చామని చెప్పారు. అధిక పత్రాలు కావాలంటూ భూ



యజమానులను తిప్పుకోవద్దన్నారు. కొంత భూమి కోసం ఆ సర్వే నెంబర్‌లో ఉన్న మొత్తం భూమిని నిషేధిత జాబితాలో ఉంటే ఆటువంటి భూమిని సబ్ డివిజన్ చేసి నిషేధిత జాబితాలో ఉంచుతామని తెలిపారు.షరతులు గల పట్టా భూములు, సర్వీస్ ఇనామ్ భూములు, గతంలో నిషేధిత జాబితా నుంచి తొలగించినప్పటికీ సర్వే సమయంలో మరలా 22ఎ చేర్చిన మక్కల భూములు, రాజముద్రతో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ నూతన సంవత్సర కానుక అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం అసంబద్ధంగా తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో ప్రజలకు అభద్రతను దూరం చేశామని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల్లోని అదనపు సిబ్బందిని ఈ శాఖలోకి తీసుకునేందుకు ఒక కమిటీ నియమించినట్లు తెలిపారు. రెవెన్యూ వ్యవస్థ పూర్తిస్థాయిలో ప్రజలకు అనుకూలంగా మార్చేందుకు ఇప్పటికే అనేక చర్యలు తీసుకున్నామన్నారు. నకిలీ రిజిస్ట్రేషన్లను ఏమాత్రం ఉపేక్షించబోమని, వీటిని రద్దు చేసే అధికారం జిల్లాల కలెక్టర్లకు ఇస్తున్నామని వివరించారు. గ్రామసభలు నిర్వహించి పాస్ పుస్తకాలను అందజేస్తామని ఆయన తెలిపారు. వెబ్‌ల్యాండ్‌లో ఉన్న వివరాల ప్రకారమే, ఎలాంటి తప్పులు లేకుండా పాస్‌పుస్తకాల పంపిణీ జరుగుతుందని స్పష్టం చేశారు.అయితే పాస్‌పుస్తకాలు ఇచ్చేటప్పుడు రైతుల వద్ద నుంచి తప్పకుండా వేలిముద్ర తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.ఆ పాసు పుస్తకాల్లో తప్పులు ఉంటే రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అధికారులే స్వయంగా రైతుల ఇళ్లకు వచ్చి తప్పులు సరి చేస్తారని మంత్రి వెల్లడించారు. అన్ని జిల్లాల్లో రెవెన్యూ క్లినిక్‌లను విస్తరించి భూసమస్యలను త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. ప్రభుత్వ చర్యలవల్ల ఈసంవత్సరం భూమి నామ సంవత్సరంగా ఉంటుందని ఆయన అన్నారు. రంపచోడవరం డివిజన్‌లో రంపచోడవరం, దేవీపట్నం, వై రామవరం,గుర్తేడు, అడ్డతీగల,గంగవరం,మారేడుమిల్లి, రాజవొమ్మంగి, మండలాలున్నాయి.చింతూరు రెవెన్యూ డివిజన్‌లోఎటపాక, చింతూరు, కూనవరం, వర రామచంద్రాపురం మండలాలు ఉన్నాయి. మార్కాపురం కేంద్రంగా మార్కాపురం జిల్లా మార్కాపురం కేంద్రంగా నూతనంగా ఏర్పాటైన జిల్లాలో 21 మండలాలు ఉన్నాయి. మార్కాపురం, కనిగిరి రెవెన్యూ డివిజన్లున్నాయి. మార్కాపురం డివిజన్ పరిధిలో గిద్దలూరు, బేస్త వారిపేట, రాచర్ల, కొమరోలు,కంభం, అర్ధవీడు, మార్కాపురం, తర్లుపాడు, యర్రగొండపాలెం, పుల్లల చెరువు, త్రిపురాంతకం, దోర్నాల,పెద్దారవీడు, పొదిలి, కొనకనమిట్ల మండలాలు, కనిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలో హనుమంతుని పాడు, వెలిగండ్ల, కనిగిరి, పెదచెర్లోపల్లి, చంద్రశేఖరపురం, పామూరు మండలాలు ఉన్నాయి. కొత్త రెవెన్యూ డివిజనలలో అద్దరోడ్డు జంక్షన్ (7 మండలాలు)లో యలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం, నక్కపల్లి, పాయకరావుపేట, కోటవురట్ల, ఎస్ రాయవరం. అద్దంకి (10మండలాలు)లో అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, జె.పంగులూరు, కొరిశపాడు, ముండ్ల మూరు, తాళ్లూరు, దర్శి,దొనకొండ, కురిచేడు పీలేరు, అన్న మయ్య జిల్లా (8 మండలాలు)లో సదుం, సోమల, పీలేరు, గుర్రం కొండ, కలకడ,కంభంవారిపల్లి, కలికిరి, వాల్మీకీపురం మడకశిర, సత్యసాయిజిల్లా (5మండలాలు)లో మడకశిర, గుడిబండ, రోళ్ల, అమరాపురం,అగలి బనగానపల్లి,నంద్యాల జిల్లా (5 మండలాలు)లో బనగానపల్లి, అవుకు, కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల కొత్త మండలం ఆదోని మండలం రెండుగా విభజన ఆదోని1 (29 గ్రామాలు), ఆదోని2 (17 గ్రామాలు) అన్నమయ్య జిల్లా సర్దుబాటుల్లో రైల్వే కోడూరు నియోజకవర్గం తిరుపతి జిల్లాలోకి చేరింది. కందుకూరు డివిజన్‌లోని వరికుంటపాడు, కొండాపురం మండలాలను కావలి డివిజన్‌లో కలిపారు. అద్దంకి నియోజకవర్గంలోని 5మండలాలను బాపట్ల జిల్లా నుంచి ప్రకాశం జిల్లాలోకి మార్చారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురం రెవెన్యూ డివిజన్‌లోని మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కలిపారు. తిరుపతి జిల్లాలోని గూడూరు రెవెన్యూడివిజన్‌లో మార్పులు, చేర్పులు చేశారు. గూడూరు,చిల్లకూరు, కోట మండలాలతో కూడిన గూడూరు రెవెన్యూడివిజన్‌ను నెల్లూరు జిల్లాలో కలిపారు. ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌లోకి కలువాయి మండలాన్ని కలిపారు.నెల్లూరు డివిజన్‌లో రాపూరు,సైదాపురం మండలాలు కొనసాగనున్నాయి.సిద్దవటం,ఒంటిమిట్ట మండలాలు కడప జిల్లాలోనే ఉండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అలాగే ఆదోనిలో పరిపాలనా సౌలభ్యం కోసం మండలాల సంఖ్యను పెంచి ఆదోని-1,ఆదోని-2గా విభజించినట్లు ప్రకటించారు. రాయచోటి జిల్లాకేంద్రం అంశంపైప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు.రాయచోటి నియోజకవర్గాన్ని జిల్లాస్థాయి అభివృద్ధికి కేంద్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి హామీఇచ్చారు.ముఖ్యంగా జిల్లాలపునర్విభజన, పరిపాలనా మార్పులు,రెవెన్యూ, పోలీస్‌వ్యవస్థల సరిపోలిక, అలాగే కొన్ని ప్రాంతాల అభివృద్ధి అంశాలు ఈ సమావేశంలో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చాయి. సీఎం చంద్రబాబు ఈ సమావేశంలో మంత్రులకు,ఉన్నతాధికారులకు కీలక సూచనలు చేశారు.రాష్ట్రపరిపాలన మరింత సమర్థవంతంగా ఉండాలంటే భౌగోళిక,జనాభా,పరిపాలనా అవసరాలకు అనుగుణంగా జిల్లాలనిర్మాణం ఉండాలని సీఎం అభిప్రాయపడ్డారు. ●

మహారాష్ట్ర

# మరో మలుపు!

**ఎ.వి.వి ప్రసాద్**

పోరు నష్టం, పొందు లాభం.. అన్నారు. ఎన్నికల విజయమే పరమావధి అయినప్పుడు ఎలాంటి సైద్ధాంతిక అవరోధాలు ఉండవనడానికి ఇద్దరు పవార్‌ల తాజా ఎత్తుగడే ఉదాహరణ. కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపు కోసం థాకరే సోదరులిద్దరూ చేతులు కలుపుతున్నపుడు తామెందుకు దూరంగా ఉండడం అనుకున్నారో ఏమో! శరద్ పవార్, అజిత్ పవార్ కూడా ఒక్క పీటపైకి వచ్చేశారు. మహారాష్ట్ర రాజకీయాల్లో గతవారం ఇది కీలక పరిణామం. విడిపోయిన రాజకీయ కుటుంబాలు తిరిగి కలవడంలో తప్పులేకపోయినా ఎన్నికలే లక్ష్యంగా సాగడమే ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇప్పుడందరి దృష్టి ముంబయి కార్పొరేషన్ పైనే పడింది. అక్కడ పట్టు దొరికితే రాష్ట్ర రాజకీయాలను శాసించవచ్చని నాయకులు భావిస్తుండడంతో ప్రత్యర్థులు కూడా చేతులు కలిపి తమ సత్తా నిరూపించుకొనే ప్రయత్నం చేస్తున్నారు. శివసేన ఒకవర్గం అధినేత ఉద్ధవ్ థాకరే,మహారాష్ట్ర నవ నిర్మాణ సేన అధినేత రాజ్ థాకరే రెండు వారాల క్రితం కార్పొరేషన్ ఎన్నికలకు పొత్తు కుదుర్చుకొనడంతో మిగిలిన పక్షాల్లో కూడా ఆలోచన మొదలయింది. 'కయ్యమెందుకు, కలిసి సాగుదాం' అనుకొంటూ ఒకరితో ఒకరు పొత్తులు కుదుర్చుకొంటున్నారు. అదే బాటలో ఎన్సీపి వర్గాల అధినేతలు అజిత్ పవార్, ఆయన బాబాయ్ శరద్ పవార్ జతకట్టడం తాజా విశేషం.కుటుంబ మంతా ఒక్కచోటకు చేరిందని అజిత్ పవార్ ప్రకటించడంతో ఇతర పార్టీల అధినేతలలోకూడా 'పునరేకీకరణ' ఆలోచనలు మొదలయ్యాయి.తమ గుర్తు గడియారం, శరద్‌పవార్ గుర్తు బాకా కలిసి పోయాయని అజిత్ అనడం భవిష్యత్ రాజకీయ పరిణామాలకు సూచిక అని చెప్పవచ్చు. పింప్రి చించ్వాడ్ కార్పొరేషన్ విషయంలో సీట్ల సర్దుబాటు జరిగిందనీ, పుణే, ముంబయి కార్పొరేషన్‌లకు సంబంధించి కూడా వారిద్దరి మధ్య లోపాయికారీగా ఒక అవగాహన కుదిరిందనీ తెలుస్తోంది. రాష్ట్రంలోని 29 కార్పొరేషన్లలో మెజారిటీ సంఖ్య దక్కించుకొనడానికి అటు అధికార మహా యుతితో పాటు ఇటు విపక్షాలు కూడా ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి. అయితే అధికార కూటమిలోనే ఉన్న అజిత్ ఎన్సీపి విపక్ష ఎన్సీపీతో చేతులు కలపడంతో కార్పొరేషన్ ఎన్నికలు చాలా ఆసక్తికరంగా మారాయి. 1999లో శరద్ పవార్ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీని స్థాపించినప్పటినుంచి రాష్ట్ర రాజకీయాలలో కీలక పాత్రనే పోషిస్తోంది. అంతకు ముందు కాంగ్రెస్‌లో చక్రం తిప్పినశరద్ పవార్ సొంత పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత కూడా జాతీయ రాజకీయాల్లో సైతం కీలక పాత్రనే పోషిస్తూ వచ్చారు. తర్వాత కాంగ్రెస్, బిజెపి కూడా ఆయనతో జతకట్టే ప్రయత్నాలు చేశాయి. అదే ఎన్సీపి చరిత్రను అనేక మలుపులు తిప్పింది.శరద్ సోదరుని కుమారుడైన అజిత్ పవార్ పార్టీలో సీనియర్ నాయకుడే గాక పలుమార్లు డిప్యూటీసీఎం కూడా కావడంతో ఆయన శరద్‌కు దీటుగా ఎదిగారు. 2023 జులైలో ఎన్సీపికి చెందిన పలువురు ఎమ్మె ల్యేలు, ఎమ్మెల్సీలు అజిత్ నాయకత్వంలో ఎన్డీయేతో చేతులు కలపడంతో ఇద్దరు పవార్‌ల మధ్య విభేదాలు తారస్థాయికి చేరి పార్టీలో చీలికకు దారితీశాయి. శరద్ పవార్ అంతకు ముందు బిజెపితో పొత్తుకు యత్నించినప్పుడు తీవ్రంగా వ్యతిరేకించిన అజిత్ తర్వాత అదే బాటపట్టడం అప్పట్లో తీవ్ర విమర్శలకు గురైంది. డిప్యూటీ సీఎం పదవి కోసమే ఆయన అలా ప్లేటు ఫిరాయించారని కూడా అప్పట్లో వినిపించింది. ఆయనకు అప్పటి లక్ష్యం (ఇప్పటికీ) ముఖ్యమంత్రి పదవి. కాంగ్రెస్, శివసేనతో పొత్తుల కారణంగా అజిత్ ఆ పదవిని సాధించలేకపోయారు. చివరికి బిజెపితో చేతులు కలిపినా మళ్లీ డిప్యూటీ సీఎం దగ్గరే ఆగిపోయారు. శరద్ కుమార్తె సుప్రియా సులే పార్టీలో కీలకం కావడాన్ని భరించలేకపోయిన అజిత్ పార్టీలో చీలిక తెచ్చినా, ఎన్డీయేలో చేరినా ఆశించిన ఫలితం దక్కకపోవడంతో ఇప్పుడు మళ్లీ శరద్‌తో చేతులు కలిపే ప్రయత్నాలు చేస్తున్నారు. కుమారునిపై గల వివిధ భూ కుంభకోణ ఆరోపణలు కూడా అజిత్‌ను ఆలోచింపజేస్తున్నాయని పరిశీలకులు భావిస్తున్నారు. కూటమిలోని షిండే శివసేన ఎన్నికలు జరిగినప్పటి నుంచీ అంటీ ముట్టనట్లుగానే ఉంటోంది.దానికి కారణం షిండేకు మళ్లీ సిఎం పదవి లభించకపోవడం.కూటమి నుంచి ఆయన బయటకు వెళ్లిపోవచ్చని అప్పుడే అంతా అనుకున్నారు కానీ ఎదురుదెబ్బలు తప్పవని గ్రహించి అలాగే కొనసాగుతున్నారు.అయితే తాజా స్థానిక ఎన్నికల్లో ఆయన వర్గానికి తక్కువ సీట్లు కేటాయించడంతో పొరుగు పార్టీల వైపు దృష్టి సారించడం ఆరంభించారు. ఇప్పుడుకార్పొరేషన్ ఎన్నికల కోసం శరద్ అజిత్ వర్గంతో చేతులు కలపడానికి షిండే నిర్ణయించడం మరో ఆసక్తికర పరిణామం. నామినేషన్ల దాఖలుకు గడువు ముగిసినా ఆయా పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందాలు జరుగుతున్నట్లు సమాచారం. మునిసిపల్ కౌన్సిల్, పంచాయతీ ఎన్నికల్లో అధికార కూటమి ఘనవిజయం సాధించడంతో కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి బిజెపి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నదనే విమర్శలు వచ్చాయి. దానివల్లే షిండే, అజిత్ వర్గాలు బిజెపికి దూరమవుతున్నట్లుగా కనిపిస్తోంది.అజిత్ కుమారునిపై గల భూకుంభకోణం ఆరోపణలపై దర్యాప్తునకు ఫడ్నవీస్ ప్రభుత్వం సిద్ధం కావడం కూడా తాజా పరిణామాలకు కారణం కావచ్చు. సమీకరణాలు ఇలాగే మారితే మళ్లీ అసెంబ్లీ ఎన్నికల నాటికి చాలా రాజకీయ పరిణామాలే సంభవించవచ్చు. శివసేన వర్గాలు,ఎన్సీపి వర్గాలు, కాంగ్రెస్ తిరిగి ఏకమైతే అసెంబ్లీ ఫలితాలు కూడా తారుమారు కావొచ్చు. అయితే బిజెపి అలాంటి పరిణామాలను సాగనివ్వకపోచ్చని కూడా అంటున్నారు. ఏదిఏమైనా కార్పొరేషన్ ఎన్నికలతో మహారాష్ట్ర రాజకీయాలు కొత్త మలుపు తిరుగుతాయనే చెప్పాలి. ●



అజిత్, శరద్

ఇరాన్

# 'జెన్‌జెడ్' వణుకు

**గన్ని మోహన్**

జెన్‌జడ్ ఉద్యమం ఇప్పుడు మరో దేశానికి పాకింది. మొదట శ్రీలంక,ఆ తర్వాత నేపాల్ తాజాగా బంగ్లాదేశ్ ఇప్పుడు పశ్చిమాసియా పర్షియన్‌దేశం ఇరాన్‌కు ఎగబాకింది. ఇరాన్ దేశ ప్రజలు ప్రత్యేకించి యువత ఆదేశ సుప్రీం అధినేత అయ్‌తొల్లా ఖమైనీ పేరుచెపితే చాలు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. దేశంలోని ప్రధాన నగరాల్లోకి ఎగబాకిన ఈఉద్యమం ఎటువైపు వెళుతుందోనన్న ఆందోళన పెరుగుతోంది.ఓపక్క అధికార పెద్దలు అయితే ఇదంతా అమెరికా ఎగదోస్తున్న కుట్రలని చెపుతున్నా దేశంలోని టీనేజిలోకం మొత్తం జెన్‌జడ్ ఉద్యమంవైపు పరుగులు తీసారు. అయొతొల్లాఖమైనీ శకం ముగిసిపోవాలని దేశం అభివృద్ధిలోకి రావాలని యువత కోరుతోంది. దేశంలో చమురు, సహజవాయునిల్వలు అపారంగా ఉన్నప్పటికీ అమెరికా ఆంక్షలు, యాజమాన్యలోపం, పెచ్చుమీరిన అవినీతి కారణంగా ఇప్పటికీ అల్పాదాయ దేశంగానే కొనసాగుతోంది. ద్రవ్యోల్బణం ముందెన్నడూ లేని విధంగా 42శాతానికి పెరిగింది. అంటే ఇక నిత్యావసర వస్తువులేవీ కూడా సామాన్య, మధ్య తరగతికి అందుబాటులో లేనట్లే. ఉపాధికొరవడి పేదరికం పెరిగిపోతోంది.అత్యధిక ఉన్నత విద్యావంతులున్నప్పటికీ ఆర్థికంగా ఎదిగేస్థాయి ఉన్నప్పటికీ అగ్రరాజ్యాల ఆంక్షలు ఇరాన్‌ను ఎదగనీయడంలేదన్న దుగ్ధ ఆదేశ యువతలో పేరుకుపోయింది. ఇందుకు ప్రధాన కారణం దేశంలో ఉన్న ఛాందసవాద ప్రభుత్వం మారాలనే కోరుకుంటున్నది. దేశంలోని లార్గెడాన్, కుహ్‌దష్ట్, ఇస్ఫాహన్‌లో హింస ప్రజ్వరిల్లింది. నిరసనకారులకు భద్రతా సిబ్బందికి తీవ్రస్థాయిలో జరిగిన ఘర్షణల కారణంగా పదిమందికిపైగా ఈ ఆందోళనలకు బలైపోయారు. షియామతాధికారులున్న కోమ్‌కు సైతం ఈ నిరసనలు చేరాయి. టెహ్రాన్, మషద్, ఇస్ఫహాన్, లోరెస్తాన్, ఖుజెస్తాన్ వంటి నగరాల్లో ఈ ఆందోళనలు మరింతగాపెరిగాయి. దేశంలో ఉన్న పదికిపైగా యూనివర్సిటీల విద్యార్థులు ఈ ఆందోళనల్లో పాల్గొంటున్నారు. దేశంలో నియంతలకు మరణశిక్ష విధించాలంటూపెద్ద పెట్టున నినాదాలతో వీధుల్లో ర్యాలీకి సైతం తెగబడ్డారు. ద్రవ్యోల్బణం పెరిగిపోవడం, అమెరికా డాలర్‌తో ఇరాన్ రియాల్ విలువలు భారీగా పడిపోయాయి. ఒక డాలరు విలువ ఏకంగా 1.38 మిలియన్ రియాల్స్‌గా మారింది.మూడేళ్ల క్రితం సెంట్రల్ బ్యాంకు గవర్నర్ మహ్మద్ రెజా ఫర్జీన్ బాధ్యతలు చేపట్టినపుడు కరెన్సీ విలువ డాలరుకు 4.30లక్షల రియాల్స్‌గా ఉండేది. మూడేళ్లలోనే విలువలు మిలియన్ దాటిపోయాయి. సగటు ఉద్యోగి నెలకు 100 డాలర్లు అంటే 9 వేలు సంపాదించగలుగుతున్నారు. కేవలం నిత్యావసర సరుకుల కొనుగోలుకే సరిపోతున్నాయి. చమురు ఉత్పత్తి, విక్రయాలపై అమెరికా ఆంక్షలతో ఇప్పుడు ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్లాడుతోంది. సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ రాజీనామా కూడా చేసారు. ఆహారం, మందులు కొనలేనిపరిస్థితి. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు వంటి వాటితోప్రజలు విసిగిపోయారు. ముఖ్యంగా 1997 నుంచి 2010 మధ్య జన్మించిన జెనరేషన్ జూమర్స్‌లో ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. ఫలితంగానే కొత్తసంవత్సరం ముందు నుంచే ఆందోళనలు మిన్నంటాయి. దీనికితోడు గత ఏడాదిఇరాన్ ఇజ్రాయెల్ మధ్య జరిగిన యుద్ధం కూడా ఇరాన్‌కు షాక్ తగిలింది. ఇరాన్ రక్షణ వ్యవస్థ, అణుకేంద్రాలు ధ్వంసం అయ్యాయి. ఖమేనీ ఇక ఉనికిలో ఉండకూడదన్న ఇజ్రాయెల్ వ్యాఖ్యలతో ఇరాన్‌మనుగడకు సైతం గండిపడే పరిస్థితి దాపురించింది. ప్రస్తుత సుప్రీం లీడర్ ఖమేనీకి 86 ఏళ్లు. ఖమేనీ వారసుడుగా ఎవరు వస్తారన్న అంశంపైనా దేశంలో అంతర్గతపోరు సాగుతోంది. నిరసనలు తీవ్రం అయితే ఖమైనీ అధికారం నుంచి అనివార్యంగా తప్పుకుంటారని వినిపిస్తోంది. అయితే అదేమీ అంత సులువేమీ కాదని, భద్రతా సంస్థలు, మతపరమైనసంస్థల్లో ఆయనకు మంచి పట్టుఉందని అందువల్లనే ఇప్పట్లోవారసుడు అనేప్రశ్న ఉత్పన్నం కాదన్నవాదన వస్తోంది.ప్రస్తుతం దేశంలో ఉన్నపరిస్థితుల దృష్ట్యా తలసరి ఆదాయం 4300 డాలర్లుగా ఉంది. పేదరికం36శాతానికి పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో మరింతగా పెరిగింది. కేవలం కొద్ది మంది చేతుల్లోనే సంపద కేంద్రీకృతమైంది. సుపరిపాలన కొరవడి,అవినీతి పెచ్చుమీరడం, వనరులు బదలాయింపు పెరిగిపోవడం వల్లనేఇరాన్ పతనం అంచున ఉన్నట్లు తెలుస్తోంది. చమురు రాబడులు సంక్షేమం కంటే ఎక్కువగా మిలిటరీ, ప్రాంతీయ కార్యకలాపాలకే కేటాయింపులు జరుగుతుండటంతో యువతలో ఆక్రోశం పెరిగిపోయింది. విద్యుత్,మంచినీటి కొరత కూడా మరోపక్క ప్రజలనుపీడిస్తోంది. మూడేళ్లక్రితంమెహసా అమ్నిఅనే యువతి బురఖా సరిగ్గా వేసుకోలేదని మొరాలిటీ పోలీసులు కస్టడీలోకి తీసుకున్న తర్వాత ఆమె కస్టడీలోనే మరణించింది. ఆనాడే పెద్దఎత్తున నిరసనలు పెరిగాయి.ఈపరిస్థితిలోనే అమెరికా జోక్యం తప్పదంటూ అధ్యక్షుడు ట్రంప్ చేసిన హెచ్చరికలు మరింత అగ్గిరాజేస్తున్నాయి. ప్రజలను కాల్చిచంపుతుంటే ఉపేక్షించేదిలేదని అమెరికా జోక్యం అనివార్యమంటూ ట్రంప్‌చేసిన హెచ్చరికలు ఇరాన్ పాలకుల్లో ఆగ్రహం రప్పించాయి. దేనికైనా రెడీయేనని ప్రస్తుతం జరుగుతున్న ఆందోళనలన్నీ కూడా ఈ పాశ్చాత్య కుట్రలేనని ప్రత్యారోపణలు చేసారు. కేవలం 9.28 కోట్లమందికి మించిన జనాభాలేని ఇరాన్‌లో 90 శాతం షియాముస్లింలే ఉన్నారు.సున్నీముస్లింలు మైనార్టీలు, స్వల్పమోతాదులో క్రైస్తవులు, జ్యూష్ తెగలు, జోరాస్ట్రియన్లు, బహైయిన్ ఉన్నారు. అధికారం మొత్తం షియాల అధీనంలోనే ఉంది. దీనివల్లనే ఇప్పుడు గల్ఫ్‌దేశాలు కూడా ఇరాన్‌కు మద్దతిచ్చే అంశం కూడా అంటీముట్టనట్లుగా ఉన్నాయి. ఏదిఏలా ఉన్నా ఇప్పుడు ఇరాన్‌లో వెల్లువెత్తిన ఈ జెన్‌జడ్ నిరసనలు ప్రభుత్వ పతనంవైపు దారితీస్తున్నాయి.ఆ దిశగానే ఇప్పుడు పాలకుల్లోకూడా ఆందోళనలు పెరిగాయనడంలో ఎలాంటి సందేహంలేదు. ●



ఖమైనీ

# ఆరావళి ఆర్తనాదం ప్రమాదంలో పర్యావరణం



**సుంకవల్లి సత్తిరాజు**

మన దేశంలో ఆరావళి పర్వత పంక్తులు, పశ్చిమ కనుమలు, హిమాలయాలు పర్యావరణ, జీవవైవిధ్య పరిరక్షణలో విశేష భూమిక పోషిస్తున్నాయి. ఆరావళి పర్వత శ్రేణి సుమారు 2లేదా 3 బిలియన్ల సంవత్సరాల క్రితం ఏర్పడిన అత్యంత ప్రాచీనమైన భారతీయ సహజ సంపదగా పేర్కొంటారు. అయితే ఆరావళి పర్వత శ్రేణుల్లో ఖనిజ నిక్షేపాల కోసం తవ్వకాలు జరపడంవలన పర్యావరణం దెబ్బతింటుందనే ఆందోళన ప్రారంభమైనది. ఆరావళి పర్వత శ్రేణుల నిర్వచనాన్ని మార్చి, చట్టబద్ధత కల్పించి మైనింగ్ జరపడానికి ప్రయత్నాలు చేయడం సహించరాని విషయం.ఆరావళి పర్వత శ్రేణుల్లో ఎలాంటి తవ్వకాలు జరపకుండా, పాత తవ్వకాలతో పాటు, ఇక ముందు జరపబోయే కొత్త తవ్వకాలపై కూడా పూర్తిగా నిషేధం విధించాలి. పర్యావరణాన్ని పణంగాపెట్టి, ప్రజలకు ప్రాణసంకటంగా మారిన మైనింగ్‌కు స్వస్తిచెప్పాలి. ఈ సందర్భంగా మనం భారత దేశంలోని పర్వత శ్రేణులను, వాటి ఉపయోగాలను, పర్యావరణానికి, జీవ వ్యవస్థల రక్షణకు వాటివలన కలిగే లాభాలను కూలంకషంగా అధ్యయనం చేయాలి. భూగ్రహంపై ఏర్పడిన సహజసిద్ధమైన భౌగోళిక వ్యవస్థలు మానవ మనుగడకు, ఇతర ప్రాణుల రక్షణకు ఎంతగానో తోడ్పడుతున్నాయి. ప్రకృతిలో ఏర్పడిన భౌగోళిక వ్యవస్థలను నాశనం చేయడం వలన అనేక విపత్కర పరిణామాలు సంభవిస్తాయి. యునెస్కో వారసత్వ సంపదగా ప్రకటించబడిన పశ్చిమ కనుమలు సుమారు లక్షా అరవై వేల చదరపు కిలోమీటర్ల మేర పలు రాష్ట్రాల గుండా విస్తరించి వాతావరణాన్ని,రుతువులను నిర్ణయించడంలో కీలక పాత్ర నిర్వహిస్తున్నాయి. పశ్చిమ కనుమలు గల కేరళలో అభివృద్ధి పేరిట జరిగిన విధ్వంసం వలన పర్యావరణం దెబ్బతిని వయనాడ్ జిల్లాఆకస్మిక వాతావరణ మార్పులతో,భారీ వర్షాలతో అతలాకుతలమైన సంగతి మన స్మృతి పథం నుండి ఇంకాచెరిగిపోలేదు.పశ్చిమ కనుమలకు సంబంధించి, పర్యావరణ పరిరక్షణకు చేపట్టవలసిన చర్యల గురించి గాడ్గిల్‌కమిటీ సిఫార్సులను పట్టించుకోకుండా, ఎకనామిక్ జోన్ల ఏర్పాటుకు, ఇసుక తవ్వకాలకు అనుమతులిచ్చిన కారణంగానే ప్రకృతి ప్రకోపించి విలయ తాండవం చేసిన వాస్తవాన్ని గమనించాలి. అలాగే హిమాలయాల్లో కూడా మానవ కార్యకలాపాల వలన, పర్యాటక ప్రాంతం పేరుతో జరుగుతున్న అటవీ నిర్మూలన, రహదారుల నిర్మాణంవలన అనేక పర్యావరణ సమస్యలు ఏర్పడుతున్నాయి. హిమాలయాలు ఎన్నో మిలియన్ల సంవత్సరాల క్రిందట సంభవించిన భౌగోళిక మార్పుల వలన ఏర్పడ్డాయి. ఇవి భారత దేశానికి శత్రుదుర్భేద్యమైన పెట్టని గోడగా "ఎబోడ్ ఆఫ్ స్నో"గా పిలవబడుతున్నాయి. వాతావరణ పరిస్థితులను నియంత్రించడంలోను, అపారమైన జల రాశులను అందించడంలోను హిమాలయాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. గంగ, సింధు, బ్రహ్మపుత్ర వంటి నదుల ఉద్భవం హిమాలయాల్లోనే జరిగింది. గంగా నదికి ఉపనదియైన యమునా నదితోపాటు, సింధునదికి ఉపనదులుగా పంచనదులుగా పిలవబడే జీలం, చీనాబ్, రావి, బియాస్, సట్లెజ్‌లు కూడా హిమాలయాల్లోనే ఉద్భవించాయి. హిమాలయాల వలన బయోడైవర్సిటీ, పర్యావరణం పరిరక్షించబడుతున్నాయి. ఇప్పుడు ఆరావళి పర్వత శ్రేణులు వార్తా పత్రికల్లో పతాక శీర్షికలకెక్కడం గమనార్హం. 670 కి.మీ పొడవునా విస్తరించిన ఆరావళి పర్వత శ్రేణులు హస్తినలో ఆరంభమై, హర్యానా రాజస్థాన్ ల మీదుగా గుజరాత్ వరకు విస్తరించి అహ్మదాబాద్‌లో పరిసమాప్తమౌతాయి. రాజస్థాన్‌లోని ఆరావళి పర్వత శ్రేణుల్లోని పలు కోటలు విశేష ప్రాధాన్యత సంతరించుకున్నాయి. యునెస్కో గుర్తింపు పొందిన రాజస్థాన్ హిల్ ఫోర్ట్స్ వారసత్వ సంపదగా విరాజిల్లుతున్నాయి. భారత దేశంలో రుతుపవనాలకు, వర్షాలకు అనుకూలత గల పర్వత శ్రేణులున్నాయి.ఇవి విభిన్నమైన భౌగోళిక స్వరూపాలతో సహజసిద్ధంగా ఏర్పడ్డాయి. ఎన్నో పర్వత శ్రేణులు భౌగోళిక, సాం



స్కృతిక, జీవవైవిధ్య ప్రాధాన్యతను కలిగి అంతర్జాతీయ వారసత్వ గుర్తింపును పొందాయి. ఆరావళి పర్వత శ్రేణులు, హిమాలయాలు, పశ్చిమ కనుమలు మొదలైనవి జీవవైవిధ్యాన్ని కాపాడుతున్నాయి.ప్రపంచంలో పురాతన పర్వత శ్రేణులుగా ప్రసిద్ధిగాంచిన ఆరావళి పర్వత పంక్తులు జీవవైవిధ్య రక్షణకు అనుకూలంగా ఉన్నాయి. గాలిలో నాణ్యత లోపించి, నరకప్రాయంగా మారిన ఢిల్లీ వాసులకు ఆరావళి పర్వత శ్రేణి వరప్రదాయినిగా పని చేస్తూ, పర్యావరణ పరిరక్షణకు దోహదం చేస్తున్న విషయం విదితమే. ఆరావళి 'గ్రీన్ షీల్డ్ ఆఫ్ నార్త్ ఇండియా' గాను,'గ్రీన్ బ్యాక్ బోన్' గాను పేరొందింది. రాజస్థాన్‌లోని ఎడారి నుండి వచ్చే ఇసుక మేఘాలు ఢిల్లీని కమ్మేయడం వలన అనేక అవస్థలు పడుతున్న నేపథ్యంలో ఆరావళి మైనింగ్ జరిగితేజరగనున్న నష్టాలను అంచనా వేయలేము. థార్ ఎడారి లోని ఇసుక తూర్పు వైపు పయనించకుండా అడ్డుకుంటూ, నగరాలను, వ్యవసాయ భూములను ఎడారులు కాకుండా ఆరావళి పర్వతశ్రేణులు కాపాడుతున్నాయి. ఆరావళి తవ్వకాల వలన పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటుందనే నిపుణుల వాదన వాస్తవం. పర్యావరణానికి పెట్టని గోడలా,మానవాళికి రక్షణ కవచంగా ఉన్న ప్రాచీనకాలం నాటిఆరావళి పర్వత శ్రేణుల్లో మైనింగ్ కోసం జరుగుతున్న చర్యలను సుప్రీంకోర్టు తాత్కాలికంగా నిలుపుదల చేయడం, ఇంతకు ముందు తానిచ్చిన ఉత్తర్వులను, మార్గదర్శకాలను నిలుపుదల చేయడం పర్యావరణ ప్రేమికులకు దక్కిన తాత్కాలిక ఉపశమనంగా భావించాలి. ఆరావళి పర్వత శ్రేణులపై మైనింగ్‌కు అనుకూలంగా ప్రయత్నాలు చేస్తూ ప్రాచీన ఆరావళి పర్వత శ్రేణుల నిర్వచనం మార్చడం, 100 మీటర్ల కంటే ఎత్తులో ఉన్న వాటినే ఆరావళి పర్వత శ్రేణులుగా నిర్వచిస్తూ, అంతకంటే తక్కువ ఎత్తులో ఉన్న పర్వతాలను మైనింగ్ రూపంలో విధ్వంసం చేసే చర్యలకు పూనుకోవడం పర్యావరణానికి పెను విఘాతం. సుప్రీం కోర్టు ఇందుకు తొలుత అంగీకరించినా, తిరిగి తన ఉత్తర్వులను రద్దు చేసి పునర్విచారణ చేపట్టాలని నిర్ణయించడం సమంజసం. పూర్తి స్థాయిలో ఆరావళిపై సుప్రీం తీర్పు వచ్చేవరకు పర్యావరణ ప్రేమికులు అప్రమత్తంగా ఉండాలి. అడవులను నరికివేయడం చూస్తున్నాం. దీని పరిణామాలను అనుభవిస్తున్నాం. ఇప్పుడు పర్వత శ్రేణులపై దాడికి ఉపక్రమించడం అనుచితం. వర్తమాన ప్రపంచంలో అనునిత్యం భూమిపై దాడి కొనసాగుతున్నది.పర్యావరణ సమస్యల వలన వేలాది జంతువులు,వృక్ష జాతులు అంతరిస్తున్న జాబితాలో ఉన్నాయి. ఎన్నో రకాల కీటకాలు, పక్షులు, వృక్షజాతులు అధికశాతం అంతరించిపోయే దశలో ఉన్నాయి. జీవులన్నీ ప్రకృతిలో మనతోపాటు జీవించే అవకాశాన్ని మనమే లేకుండా చేస్తున్నాం. జీవవైవిధ్యం మానవాళి మనుగడకు అవసరం.జీవ సమతుల్యత లోపిస్తే జరగబోయే పరిణామాలు మానవ వినాశనానికి దోహదం చేస్తాయి. 'ప్రకృతి' ఈ సమస్త సృష్టికి నిండైన అందాన్ని సమకూర్చిపెట్టింది.ఇలాంటి ప్రకృతిలో మానవులతోపాటు జంతుజాలం, వృక్షజాలం, క్రిమికీటకాలు, భౌతిక, రసాయనిక పదార్థాలు నిండి ఉన్నాయి. అరణ్యాలు, నదీనదాలు, పర్వతాలు, లోయలు, ఇతర అనేకమైన ఏర్పాట్లు సహజ సిద్ధంగా నెలకొని ఉన్నాయి. భూవాతావరణాన్ని నాశనం చేసి, కోట్లాది జీవరాశులను ప్రాణ సంకటంలోకి నెట్టడంలో గల ఔచిత్యమేమిటో అర్థంకావడం లేదు. జీవవైవిధ్యం దెబ్బతినడంతో ప్రకృతిలో అనేకఅవాంఛనీయ మార్పులు సంభవిస్తున్నాయి. మానవాళికి పలురకాలుగా ఉపయోగపడే జీవసంపద మానవ స్వార్థచింతన వలన నశించిపోయింది.ఒకవైపు ప్రకృతి విధ్వంసం వలన భూవాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. కాలుష్యకారకాలు పెరిగిపోయాయి. పర్యావరణం దెబ్బతిన్నది. మనతో కలిసి జీవిస్తున్న జీవరాశులెన్నో ప్రకృతిలో చోటు చేసుకుంటున్న విపరీతమైన పోకడలకు నిలవలేక ఇప్పటికే అదృశ్యమైపోయాయి.ప్రస్తుత పర్యావరణ సమస్యలకు మూలకారణాన్ని అన్వేషించి, కాలుష్యభరిత వాతావరణంనుండి మానవాళిని కాపాడాలి. ప్రపంచ వ్యాప్తంగా భీతావహ వాతావరణాన్ని సృష్టిస్తున్న వైరస్‌లు మున్ముందు మరింత విజృంభించవచ్చు.సకలజీవరాశుల ఉనికిని భూమండలంపై సుస్థిరం చేయడానికి ప్రయత్నాలు జరగాలి.ఈఅంశాలను పరిగణనలోకి తీసుకుని పర్వత పంక్తులను కాపాడాలి.భవిష్యత్తులో ఆరావళి పర్వత శ్రేణిలో మైనింగ్‌జరపకుండా పటిష్టమైనచట్టాలు తీసుకురావాలి. ●

## మానసిక వికాస కేంద్రం పిల్లలతో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్న సిపి

**విజయవాడ కార్పొరేషన్,జనవరి 3,ప్రభాతవార్త:** మానసిక వికాస కేంద్రం పిల్లలతో సిపి రాజశేఖరబాబు శనివారం న్యూ ఇయర్ వేడుకలు జరుపున్నారు. కమీషనర్ కార్యాలయంలో నూతన సంవత్సరం-2026 సందర్భంగా నగరంలోని మానసిక వికాస కేంద్రం పిల్లలతో కలిసి సిపి రాజశేఖరబాబు కేక్ కట్ చేసి వారితో కాసేపు సరదాగా మాట్లాడారు. అనంతరం వారికి చాక్లెట్లను పంపిణీ చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు.



# విజయవాడ వార్త



# సాంకేతిక సమస్యలతో నిలిచిన స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు

విజయవాడ తూర్పు, జనవరి 3(ప్రభాతవార్త ) : స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్ సైట్ లో శనివారం తీవ్ర సాంకేతిక లోపం ఏర్పడింది. సాంకేతిక లోపం కారణంగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో కక్షిదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గతంలో ఉన్న మాన్యువల్ విధానంలో కక్షిదారులు నేరుగా తమ దస్తావేజులను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో యిచ్చి భూములను రిజిస్ట్రేషన్లు చేయించుకునే వారు. కాగా, ప్రభుత్వం కార్డ్ విధానం ద్వారా ఆన్ లైన్ విధానాన్ని రూపొందించింది. కక్షిదారులు తమ దస్తావేజుల వివరాలను రిజిస్ట్రేషన్ శాఖ వెబ్ సైట్ లో ఉంచి వివరాలను నమోదు చేయించుకుని, ఫీజులను ఆన్ లైన్ లో చెల్లించి ఆన్ లైన్ స్లాట్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. కాగా, రిజిస్ట్రేషన్ ఫీజులను ఆన్ లైన్ లో ప్రభుత్వ ఆర్థికశాఖ వెబ్ సైట్ (సిఎఫ్ఎంఎస్) చలానా ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంది. అయితే, నిర్వహణ కారణంగా ఈ వెబ్ సైట్ ను శుక్రవారం నుండే నిలిపివేశారు. ఈ విషయం తెలియని ప్రజలు శనివారంనాడు రిజిస్ట్రేన్ల కోసం ఈ (సిఎఫ్ఎంఎస్) వెబ్ సైట్ పని చేయడం లేదని తెలిసి నిరాశపద్దారు. ఇదెలా ఉంటే శనివారం మధ్యాహ్నం (సిఎఫ్ఎంఎస్) వెబ్ సైట్ కొంత సేపు మళ్ళీ అందుబాటులోకి వచ్చినప్పటికీ రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్ సైట్ లో లోపం కారణంగా ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్ లు జరగక నిలిచిపోయాయి. కాగా, ప్రభుత్వ (సిఎఫ్ఎంఎస్) వెబ్ సైట్ లో కట్టిన యూజర్ ఛార్జీలను రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్ సైట్ ఆమోదించకపోవడంతో రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్ లు నిలిచిపోయాయి. స్లాట్ బుకింగ్ లేనిదే రిజిస్ట్రేషన్లు చేయలేమని సబ్ రిజిస్ట్రార్లు చేతులెత్తేయడంతో చేసేది లేక ప్రజలు వెనుతిరిగారు. రిజిస్ట్రేషన్ల కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు పద్దారు. అయితే, ప్రభుత్వ (సిఎఫ్ఎంఎస్) వెబ్ సైట్ లో కట్టిన చలానాలు రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్ సైట్ ఆమోదించకపోవడం, అదే సమయంలో ప్రైవేటు స్టాక్ హోల్డింగ్ ద్వారా కట్టిన చలానాలను రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్ సైట్ ఆమోదించడం కొంత అనుమానాలకు తావిచ్చేదిగా ఉంది. ప్రభుత్వ వెబ్ సైట్ ను కాదని ప్రైవేటు వెబ్ సైట్ ద్వారా కట్టిన చలానాల ద్వారా స్లాట్ బుకింగ్ జరగడంపై ప్రైవేటు వైపు ప్రజలను మళ్ళించడానికే అన్నట్లుగా ఉంది. నూతనంగా తీసుకువచ్చిన ఆన్ లైన్ విధానం కొంత వెసులుబాటు ఉన్నప్పటికీ మధ్యలో ఏర్పడుతున్న సాంకేతిక సమస్యల కారణంగా ప్రజలు ఈ విధానంపై పెదవి విరుస్తున్నారు. ప్రభుత్వం ఈ వెబ్ సైట్ లో సాంకేతిక ఇబ్బందులను పరిష్కరించి అందరికీ అందుబాటులోకి తీసుకురావాలని ప్రజానీకం కోరుతున్నారు.

## భవన యజమానులు నిర్ణీత గడువు లోపు భవనాలను క్రమబద్ధీకరించుకోవాలి : కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్,జనవరి 3,ప్రభాతవార్త:** అర్హులైన అన్ని భవన యజమానులు నిర్ణీత గడువు లోపు ధరఖాస్తు చేసుకొని తమ భవనాలను క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. గడువు ముగిసిన తర్వాత ధరఖాస్తు చేయని వారు లేదా చట్ట విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగించేవారిపై ప్రస్తుత చట్టాల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందున దానికి అనుకూలంగా చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.లే ఔట్ రెగ్యులరైజేషన్,బిల్డింగ్ పీనలైజేషన్‌కు ఇదొక మంచి అవకాశమని,ఈ సీ్కంను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఓఎంఎస్ నెం.134,ఎంఎ అండ్ యుడి,26.7. 2025,జిఓఎంఎస్ నెం.1173 ఎం మరియు యుడి డిపార్ట్‌మెంట్,27.10.2025 ద్వారా లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీం నందు ఇప్పటి వరకు 1,338 ధరఖాస్తులను స్వీకరించి పరిష్కరించారని తద్వారా ఇప్పటి వరకు రూ.11 కోట్ల 37 లక్షల 12వేల 665లు ఆదాయం వచ్చిందన్నారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఓఎంఎస్ 225,ఎంఎ మరియు యుడి డిపార్ట్‌మెంట్-12.11.2025 ద్వారా బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం నందు ఇప్పటి వరకు 1089 ధరఖాస్తులు స్వీకరించారని, తద్వారా రూ.1 కోటి 57లక్షల 5వేలు ఆదాయం వచ్చిందని తెలిపారు. భవన క్రమబద్ధీకరణ కింద 1985 జనవరి 1వ తేదీ తర్వాత నుండి 2025 ఆగస్టు 31వ తేదీ వరకు నిర్మించిన అనధికార భవనాలు లేదా ఆమోదిత నిర్మాణ అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన అదనపు విస్తరణల క్రమబద్దీ కరణకు అర్హులని, అర్హులైన భవన యజమానులు పథకం 11.3.2026 లోపు ధరకాసుత్లను



సమర్పించాల్సి ఉంటుందని, ధరఖాస్తులు ఆన్‌లైన్ పోర్టల్ డబ్ల్యు.డబ్ల్యు. బిపిఎస్.ఎపి.జిఎవి.ఇన్ ద్వారా మాత్రమే సమర్పించాలని,ధరఖాస్తులను అర్హత కల్గిన లైసెన్స్ టెక్నికల్ పర్సనల్ ద్వారా తయారు చేసి అవసరమైన పత్రాలతో కలిపి ఆన్‌లైన్ మాడ్యూల్‌లో అప్‌లోడ్ చేయాలని, ఈ పథకం కింద 31.12.1997కు ముందు నిర్మించి భవనాలకు ప్రభుత్వం క్రమబద్ధీకరణ రుసుంపై 25% రాయితీ మంజూరుచేసిందని,దీని కోసం 31.12.1997 లోపు చెల్లించిన ప్రాపర్టీ టాక్స్ రశీదు జతపర్చాలని అన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఆర్థిక భరోసా

**పెనమలూరు జనవరి3,ప్రభాతవార్త :**

పేదవారికి ఆర్థికంగా తోడ్పాటు కల్పించేందుకే ముఖ్యమంత్రి సహాయనిధిని అందిస్తున్నామని పెనమలూరు ఎమ్మెల్యే బోడేప్రసాద్ అన్నారు.శనివారం పోరంకి పార్టీకార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 73మందికి సుమారు 34లక్షల 98వేల658 రూపాయల చెక్కులను ఎమ్మెల్యే చేతులమీదుగా పంపిణీ చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సియంఆర్ఎఫ్ ద్వారా ఆర్థికసహాయం చేయడంద్వారా ఆయా వర్గాల ప్రజలకు ఆర్థికభరోసా కల్పిస్తున్నామన్నారు.గడచిన 18నెలల కాలంలో 1249మందికి 11కోట్ల 33లక్షల రూపాయల మేర పేదవారికి సియంఆర్ఎఫ్ ద్వారా చెక్కులను పంపిణీ చేసామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## యల్‌బిఆర్‌సిఇ 19వ సాంకేతిక మరియు సాంస్కృతిక ఉత్సవం లక్ష్య 2కె26

**మైలవరం, జనవరి 3, ప్రభాతవార్త :** సాంకేతిక విభాగంలో, మేధ, సృజన, ప్రజ్ఞ, ఉద్భావన, ఓజాస్ మరియు సాంస్కృతిక విభాగంలో డాన్స్, మూకాభినయం, పాటల పోటీలు మొదలగు ప్రత్యేక విభాగాలలో పోటీలతో కలిపి మొత్తం 62 విభాగాలలో జరిగిన పోటీల్లో లక్ష్య 2కె26 కన్వీనర్లు ఏఐ అండ్ డిఎస్ విభాగాధిపతి డా.పి.భగత్ మెకానికల్ విభాగాధిపతి డా.ఎమ్.బి.ఎస్. శ్రీకర్ రెడ్డి ఆహుతులను స్వాగతించి ఈ కార్యక్రమ ముఖ్యాంశాలను వివరించారు. 62 విభాగాలలో మొత్తం 4500




మంది వివిధ విశ్వ విద్యాలయాల నుండి విద్యార్థిని విద్యార్థులు రెజిస్ట్రేషన్స్ చేసుకున్నారు. కార్యక్రమానికి గౌరవ అతిధులుగా రవివర్మ దాట్ల డైరెక్టర్, కన్సల్టింగ్ పెన్నట్ టెక్నాలజీస్, ప్రైవేట్ లిమిటెడ్,హైదరాబాద్, ముఖ్య అతిధులుగా లకిరెడ్డి జయప్రకాష్ రెడ్డి కోఫౌండర్ హానరరీ ఛైర్మన్ లకిరెడ్డి ప్రసాద రెడ్డి ఛైర్మన్, డా.లకిరెడ్డి హనిమి రెడ్డి, మేనేజ్‌మెంట్ ట్రస్టీ, ప్రెసిడెంట్ జి.శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డా.బి.రమేష్ రెడ్డి పాల్గొన్నారు. లకిరెడ్డి జయప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఉద్యోగ అవకాశాలకు అనుగుణంగా కావల్సిన శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవాలని అలాగే లీడర్ షిప్ క్వాలిటీస్‌ను అభివృద్ధి చేసుకుంటూ అన్ని అంశాల యందు నైపుణ్యతను మెరుగుపర్చుకోవాలని కోరారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని విద్యా సంస్థల నుండి వచ్చిన 1500 మంది పైగా విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు ప్రసంగిస్తూ ప్రతి ఒక్కరు సృజనాత్మక శక్తిని పెంపొందించుకొని ఎంచుకున్న రంగాలలో నిష్ణాతులు కాగలరని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగ అవకాశాల కోసం శ్రమించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మరియు సాంస్కృతిక విభాగంలో ఆయా అంశాలలో నిర్వహించిన పోటీలలో 140మంది విద్యార్థులు బహుమతులను గెలుచుకున్నారని తెలిపారు. అనంతరం వివిధ పోటీల విజేతలకు 3.5 లక్షల రూపాయల నగదు పురస్కారాలను, మెరిట్ సర్టిఫికెట్స్‌ని అందచేసారు. కార్యక్రమంలో లకిరెడ్డి జయప్రకాష్ రెడ్డి హానరరీ ఛైర్మన్, ప్రెసిడెంట్ జి.శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డా.బి.రమేష్ రెడ్డి, ఏఐ అండ్ డిఎస్ విభాగాధిపతి డా.పి. భగత్ గారు, మరియు మెకానికల్ విభాగాధిపతి డా.ఎమ్.బి.ఎస్. శ్రీకర్ రెడ్డి వివిధ కళాశాల నుండి విచ్చేసిన విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఎంతగానో అలరించాయి. ఈ సాంస్కృతిక కార్యక్రమాలకు విద్యార్థుల నుండి అనూహ్య స్పందన లభించింది.

## నిరుపేదలకు బియ్యం బస్తాలను అందచేసిన ఎన్నారై బొప్పన మహినాథ్ చౌదరి

**ఎ కొండూరు, జనవరి 3, ప్రభాతవార్త :** విజయవాడకు చెందిన ప్రవాసాంధ్రుడు బొప్పన మహీనాథ్ చౌదరి (లండన్) ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం చీమలపాడు హరిజనవాడ మాలపల్లె ప్రాంతాల్లో నిరుపేదలకు ఉచితంగా



బియ్యం టిక్కీలు అందచేశారు. ఈ సందర్భంగా ఎన్నారై మహినాథ్ చౌదరి మాట్లాడుతూ గ్రామంలో నిరుపేదలైన ఎస్సీ బిసి మైనార్టీ వర్గ ప్రజల్లో పూట గడవని పరిస్తితుల్లో ఉన్న అన్నార్తులకు ఆకలి తీర్చాలనే సంకల్పంతో స్థానిక టిడిపి శ్రేణుల నాయకుల సూచనల మేరకు ఆయా వర్గాల్లో ఉన్న నిరుపేదలకు ఈ బియ్యం టిక్కీలు అందచేసినట్లు ఎన్నారై మహినాద్ చౌదరి శనివారం తెలిపారు. అనంతరం చీమలపాడు గ్రామంలో అలుపెరుగని అన్నదాత నఖీబుల్ ఔలియా హజరత్ ముహమ్మద్ అతావుల్లా షరీఫ్ షాతాజ్ ఖాదరీ బాబా బొగ్దాది బాబా దర్గా దర్బార్‌ను సందర్శించి బాబా వారి వేడుకోలు జరిపారు. బాబా నిర్వహకులు తనయులు వాస్తుశిల్పి జాఫర్ సాదిఖ్ తాజ్ ఖాదర్ బాబు బొగ్దాది పాల్గొని దర్గా అండ్ దర్బార్ సాంప్రదాయ ప్రకారం సన్మానించారు. ఇంకా ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మోర్ల తిరుపతిరావు, నరేంద్ర (నాని) ఎన్‌టిఆర్ జిల్లా సురక్ష కన్వీనర్ కెవి నర్సయ్య గ్రామ కమిటీ అధ్యక్షులు కె.సుబ్బారావు, ఆంజనేయులు (అంజి) గౌడ్, హైస్కూల్ విద్యా కమిటీ ఛైర్మన్ ఎస్‌కె నాగుల్‌మీరా బడుగు శ్రీనివాసరావు, తాతారావు, షౌకత్, పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.

## ట్యాంపరింగ్ కు తావులేని... పట్టాదారు పాస్ పుస్తకాలు

### తిరువూరు ఆర్డీవో మాధురి

**గంపలగూడెం జనవరి3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఏ రైతు సమస్యలతో సతమత అవ్వకూడదన్న ఉద్దేశంతో సీఎం చంద్రబాబు కొత్త పాస్ పుస్తకాలను ప్రభుత్వం ముద్రించిందన్నారు. ట్యాంపరింగ్ కు తావులేకుండా క్యూఆర్ కోడ్ తో అత్యంత



అత్యంత ప్రతిష్టాత్మకంగా టాంపరింగ్ కు తావులేని క్యూఆర్ కోడ్ తో పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తున్నట్లు తిరువూరు రెవిన్యూ డివిజనల్ అధికారిణి కే మాధురి అన్నారు. గంపలగూడెం మండల వినగడప గ్రామంలో ఇటీవల ప్రభుత్వం సిఫార్సు చేసిన నూతన పాస్ పుస్తకాలను రైతులకు అందజేసే కార్యక్రమం తహసిల్దార్ వద్దేశ్వరపు రాజకుమారి ఆధ్వర్యంలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో మాధురి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలను సరిదిద్దుతూ పకడ్బందీగా ప్రభుత్వ రాజముద్రతో పాస్ పుస్తకాల ముద్రణ జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంపలగూడెం మండల మాజీ ఎంపీపీ కోటగిరి శ్రీనివాసరావు, ఏఎంసీ ఛైర్మన్ రేగళ్ల లక్ష్మీ అనిత లు రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. కనుమూరు గ్రామంలో 1,407, అనుములంక 573, వినగడప 1,306, గంపలగూడెం 1,040, రాజవరం 514, చెన్నవరంలో 410 తో కలిసి మొత్తం 5,250 పాస్ పుస్తకాలను అందజేసినట్లు తహసీల్దార్ రాకుమారి తెలిపారు.

## విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయాలి

### ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

**తిరువూరు, జనవరి 3, ప్రభాతవార్త :** తిరువూరు విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయడానికి బాలోత్సవం కార్యక్రమాలు తిరువూరులో బాలోత్సవం నిర్వహిస్తున్న జేవీవీ నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. విద్యార్థుల్లో వినోదం విజ్ఞానం సృజనాత్మకత




దోహదపడతాయని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అన్నారు. శనివారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తిరువూరు వాహినీ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహించిన బాలోత్సవం కార్యక్రమం ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుంచే విద్యార్థుల అభిరుచులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గమనించి వారికి తగిన శిక్షణ, ప్రోత్సాహం ఇస్తే మంచి కళాకారులవుతారని సూచించారు. ప్రస్తుత సమాజంలో కళాకారులు తగ్గిపోతున్నారని, భావితరాలకు మంచి కళాకారుల్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గత నాలుగేళ్లుగా ప్రశ్నించే గుణం పెంపొందించేందుకే బాలోత్సవం నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం హరికృష్ణ తెలిపారు. ఆది, అంతం పండుగ వాతావరణాన్ని తలపిస్తున్న బాలోత్సవ కార్యక్రమంలో 24 అంశాల్లో 61 పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థిని, విద్యార్థులు రెట్టింపు ఉత్సాహంతో తమ ప్రతిభను కనబరిచారు. తిరువూరు రెవిన్యూ డివిజనల్ అధికారిణి కే మాధురి, జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షులు వల్లభనేని రవీంద్ర, ప్రతినిధులు ఎల్ గంగాధర్, కే పాపారావు, రామ్మోహన్ రావు, సిపిఎం సీనియర్ నాయకులు గొల్లపల్లి వెంకటరత్నం, ఎస్ నాగేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మిట్టగుట్టకు శోభాయాత్ర

**గంపలగూడెం,జనవరి3,ప్రభాతవార్త:** గంపలగూడెం మండలం ఊటుకూరు నుంచి మార్గశిర పౌర్ణమి సందర్భంగా పెనుగొలను శివారు మిట్టగుట్ట శేషాచల వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి కోదండ రామాలయ భక్తబృంద సభ్యులు శనివారం శోభాయాత్ర నిర్వహించారు. 42 మంది భక్తులు ఊటుకూరు నుంచి మిట్టగుట్ట వరకు కాలినడకన వెళ్ళి గిరిప్రదక్షిణ చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.



## 5 నుంచి రిలే నిరాహారదీక్షలు

**గంపలగూడెం, జనవరి 3, ప్రభాతవార్త:** తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించనందున ఈ నెల 5 నుంచి 9 వరకు అన్ని జిల్లాల్లో రిలే నిరాహారదీక్షలు నిర్వహిస్తున్నట్లు ఏపీ సహకార సంఘ ఉద్యోగుల యూనియన్ల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బొల్లినేని రఘురాం తెలిపారు. 5న ఉమ్మడి కృష్ణాజిల్లాలో, 6న తూర్పు, పశ్చిమగోదావరి, 7న కర్నూలు, ప్రకాశం, చిత్తూరు, నెల్లూరు, 8న శ్రీకాకుళం, విజయనగరం, 9న గుంటూరు, కడప జిల్లాల వారీగా విజయవాడ ధర్నాచౌక్ లో రిలే దీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సహకార సంఘ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం కొనసాగుతుందని రఘురాం తెలిపారు.



## ఉత్తమ ఉపాధ్యాయునులకు బహుమతి ప్రధానం

**విజయవాడ, జనవరి 3, ప్రభాతవార్త :** విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన గురు చైతన్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సౌత్ ఇండియా సావిత్రిబాయి పూలే బెస్ట్ టీచర్ అవార్డ్స్ వేడుకలో ఆంధ్రప్రదేశ్




తెలంగాణ కర్ణాటక మూడు రాష్ట్రాలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయునులకి బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి గురు చైతన్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు పాలేలా రామాంజనేయులు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా భారత చైతన్య యోజన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్, తెలంగాణకు చెందిన శ్రీకాంత్ కాల్ కర్ణాటక నుంచి ప్రొఫెసర్ శైలజ పాల్గొన్నారు. ఉత్తమ మహిళా ఉపాధ్యాయునీలకు సౌత్ ఇండియా అవార్డుల ప్రధానోత్సవంలో గుంటుపల్లి, మోడల్ స్కూల్లో పనిచేయుచున్న చింతల అనంతలక్ష్మి దేవిని ఎంపిక చేసి అవార్డు మరియు ప్రశంసా పత్రం బహూకరించారు.

## కూటమి నేతలకు బీసీల పాలాభిషేకం

**విజయవాడ, జనవరి 3, ప్రభాతవార్త :** బీసీల రక్షణ చట్టం ముసాయిదా రూపకల్పనకు చేయబోతున్న కూటమి ప్రభుత్వానికి, ప్రధాని



నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం ఆధ్వర్యంలో 30 కి పైగా బీసీ కుల సంఘాల నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా ఎన్.మారేష్ మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలుగా అవమానాలకు, దోపిడికి గురవుతున్న బీసీల ఆత్మగౌరవానికి రక్షణ కవచం లాంటి "బీసీల రక్షణ చట్టం చేయబోతున్న సిఎం చంద్రబాబు బీసీల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో ఎల్ల బాబు, ఆకునూరు సుబ్బారావు, తోకల రవి, దేరంగుల నాని, శ్రీనివాసరావు, అనిల్ మఖాన్ సుబ్బారావు, తిరుపతిరావు, నరసింహారావు, చలపతిరావు పాల్గొన్నారు.

## సిటీ స్పెషల్ బ్రాంచ్ ఎసిపిగా సత్యానందం భాధ్యతల స్వీకరణ

**విజయవాడ కార్పొరేషన్,జనవరి 3,ప్రభాతవార్త:** ఎన్టీఆర్ జిల్లా సిటీ స్పెషల్ బ్రాంచ్ (సిఎస్‌బి) సిఐగా విధులు నిర్వహిస్తున్న పి.సత్యానందం అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీసుగా పదోన్నతి పొందారు.ఈ నేపథ్యంలో ఆయనను ఎన్టీఆర్ జిల్లాకు అటాచ్ చేశారు. భాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన పోలీసు కమీషనర్ కార్యాలయంలో సిపి రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్చాన్ని అందించారు.



## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాటన్లు పరిశీలించిన కలెక్టరు

**గుంటూరు వెస్ట్, జనవరి 3, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 5వ తేదీన గుంటూరు రానున్న నేపథ్యంలో పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న మూడవ ప్రపంచ తెలుగు మహాసభల చివరి రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి రానున్న నేపథ్యంలో శ్రీ సత్య సాయి స్పిరిట్యుయల్ ట్రస్ట్ లో పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, అదనపు ఎస్పీ హనుమంతు, డి.ఎస్.పి అబ్దుల్ అజీజ్, తహసిల్దార్ సుభాని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి, ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజనీర్ శ్రీనివాస మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## ఈపీఎఫ్ అధికారులకు రూ. నాలుగున్నర కోట్లు అందించిన ఏఎన్‌యు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జనవరి3, ప్రభాతవార్త:** ఏఎన్యూలో పనిచేస్తున్న దినసరి వేతన ఉద్యోగులకు చెల్లించాల్సిన ఈపీఎఫ్ నిధుల్లో శనివారం రూ.4.70కోట్లు చెల్లించారు. శనివారం వర్సిటీకి వచ్చిన ఈపీఎఫ్ కార్యాలయ అధికారులు వర్సిటీ అధికారంతో పాటు బ్యాంకు అధికారులను కూడా కలిసి ఈపీఎఫ్ నిధులపై చర్చించారు. దీంతో అధికారులు చెల్లించాల్సిన మొత్తంలో శనివారం రూ. 4.70కోట్లు డిడి ల రూపంలో ఈపీఎఫ్ అధికారులకు అందజేసినట్లు తెలిసింది.

వార్త VAARTHA CLASSIFIEDS

SITUATION VACANT

ఇంజెక్షన్ మోల్డింగ్ మెషిన్‌లో 5-8 సంవత్సరాల అనుభవం ఉన్న ఒక సూపర్‌వైజర్ మరియు 4-5 సంవత్సరాల అనుభవం ఉన్న ఒక సీనియర్ హెల్పర్ హైదరాబాద్‌లో కావలెను. ఆకర్షణీయమైన వేతనం అందించబడుతుంది. సంప్రదించండి: 9959553707. (Ro.No.36963)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## సావిత్రిబాయి పూలే సేవలు మరువలేనివి : హెచ్ఎం ప్రసాదరావు

**ఎ కొండూరు, జనవరి 3, ప్రభాతవార్త :** భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయినీ సంఘ సంస్కర్త, రచయిత్రి బాలికా విద్యను ప్రోత్సహించిన మొట్టమొదటి బాలికా పాఠశాలను స్థాపించిన సావిత్రి బాయి పూలే యంతిని ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్లో హెచ్ఎం డిజె.ఎండి ప్రసాదరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చేసిన సేవలను మహిళా బాలిక విద్యకు ఆమె చేసిన కృషిని వక్తలు కొనియాడారు. కె.కరుణ శ్రీ, ఎస్ఎం సుభాన్‌బి, బిజనిర్మల, ఎస్‌కె ఫర్హానా, ఎం దివ్య మహిళా ఉపాధ్యాయినులను ఘనంగా సత్కరించారు. హెచ్ఎం డిజె ఎండి ప్రసాదరావు ఇతర సిబ్బంది సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.



# ఫిబ్రవరి 7,8 తేదీల్లో కొండవీడు ఉత్సవాలు : జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా

యడ్లపాడు, జనవరి 3, ప్రభాతవార్త: జిల్లా ప్రముఖ పర్యాటక కేంద్రం కొండవీడు కోట ఖ్యాతి రాష్ట్రం నలుమూలలా వ్యాపించేలా ఫిబ్రవరి 7,8 తేదీల్లో అట్టహాసంగా కొండవీడు ఉత్సవాలు నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా వెల్లడించారు.



కొండవీడు ఫెస్ట్ నిర్వహణకు త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసి, నోడల్ అధికారిగా జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ ప్రియను నియమించారు. శనివారం మధ్యాహ్నం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సాహపూరిత వాతావరణంలో ఫెస్ట్ నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆహ్లాదకరమైన సాంస్కృతిక కార్యక్రమాలు, పర్యాటకుల సంఖ్యకు తగినవిధంగా ఫుడ్ కోర్ట్ లు, స్టాల్స్, ట్రాన్స్‌పోర్ట్, టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. కొండవీడు కోటకు ఫిరంగిపురం, నాదెండ్ల, వంకాయలపాడుల నుంచి రహదారులకు మరమ్మతులు చేపట్టాలన్నారు. గత ఉత్సవాలలో పర్యాటకులను ఆకర్షించిన హెలి రైడ్, బోటింగ్ వంటి కార్యక్రమాలకు అదనంగా కార్యక్రమాలు రూపొందించాలని ఈవెంట్ మేనేజర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి కృష్ణప్రియ, డీఆర్వో మురళి, ఆర్డీవో మధులత, డీపీఓ నాగేశ్వర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు డ్రోన్‌తో పురుగు మందుల పిచికారీపై అవగాహన

యడ్లపాడు, జనవరి 3, ప్రభాతవార్త : మండలం పరిధిలోని తుర్లపాడు గ్రామ పరిధిలో రైతు ఈదర వీర శంకర్రావు గారి మొక్కజొన్న పొలంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) వారి సౌజన్యంతో రైతులకు డ్రోన్ ద్వారా పురుగుమందు పిచికారి విధానం గురించి ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించి అవగాహన కల్పించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏ హరిప్రసాద్ మాట్లాడుతూ మారుతున్న కాలంతో పాటు శాస్త్ర సాంకేతిక రంగాల్లో కూడా రోజురోజుకీ అభివృద్ధి చెందుతుంది నిత్యం జరుగుతున్న పరిశోధనల ఫలితంగా కొత్త కొత్త ఆవిష్కరణలు, యంత్ర పరికరాలు వినియోగదారులకు అందుబాటులో వస్తున్నాయి.



ఇలాంటి ఆవిష్కరణలలో భాగంగా డ్రోన్ల వినియోగంతో పురుగుమందులు, అలాగే నీటిలో కరిగే ఎరువుల పిచికారి ఎంతో దోహదపడుతుంది. ముఖ్యంగా కొన్ని పంటలలో కొంత ఎత్తు పెరిగిన తర్వాత పురుగు మందులు పిచికారి చాలా కష్టతరం అవుతుంది. ముఖ్యంగా మొక్కజొన్న, కంది వంటి పంటలలో మొక్కలు ఎత్తుగా పెరగటం, వరి దమ్ము చేసిన పొలంలో పిచికారి కష్టతరమవుతుంది. ఇటువంటి సమయంలో డ్రోన్లతో పిచికారి చేయటం వల్ల పురుగులను సమర్థవంతంగా నియంత్రించడంలో దోహదపడుతుంది. అంతేకాకుండా డ్రోన్ తో పిచికారి అనేది తక్కువ ఖర్చుతో కూడుకున్నది మరియు 90 శాతం నీరు మరియు 95 శాతం సమయం ఆదా చేయవచ్చును. డ్రోన్ తో పిచికారి చేయటం వల్ల మొక్క అంతా పూర్తిగా తడుస్తుంది. ప్రస్తుతం మండలంలో మూడు డ్రోన్లను వ్యవసాయ శాఖ సబ్సిడీపై రైతులకు అందజేసింది. డ్రోన్లతో పిచికారి చేయడానికి తప్పనిసరిగా శిక్షణ పొంది ఉండాలి. కావున రైతు సోదరులు డ్రోన్ల వినియోగం అంది పుచ్చుకొని పురుగుమందుల పిచ్చి కారి ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు, సమయాన్ని ఆదా చేసుకొని కష్టతరమైన పిచికారి కూడా సులభతరంగా చేసుకోవచ్చు అని మండల వ్యవసాయ అధికారి గారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతు ఈదర వీర శంకర్ రావు గారు, ప్రగతి కిసాన్ డ్రోన్ గ్రూపు, సొంటు డ్రోన్ పైలెట్ కుంభ వెంకటేశ్వర్లు, గ్రామ వ్యవసాయ సహాయకులు విజయలక్ష్మి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ గ్రామసభ

యడ్లపాడు, జనవరి 3, ప్రభాతవార్త : మండల పరిధిలోని వంకాయలపాడు గ్రామసచివాలయంలో శనివారం గ్రామ సభనునిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు నూతన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ప్రధాన అతిథిగా మండల టిడిపి అధ్యక్షుడు కామినేని సాయిబాబు పాల్గొని, రైతులకు పాసుపుస్తకాలను అందజేశారు. ఉదయం నుండి సర్వర్లు సరిగా పనిచేయక పోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. దీనిపై అధికారులు ఏమిచేయలేక పోయారు. సర్వర్ పనిచేసినప్పుడు పంపిణీ చేస్తూ వచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అనురాధ, వీఆర్ఓ ఆశోక్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొని, రైతులతో పలుసార్లు చర్చలు జరిపారు. అధికారులు రైతులకు పాసుపుస్తకాల ప్రాధాన్యతను వివరించారు.



# షాక్ వస్తున్నా పట్టించుకోరా? ..విద్యుత్ అధికారులపై స్థానికుల ఆగ్రహం



యడ్లపాడు, జనవరి 3, ప్రభాతవార్త : యడ్లపాడు గ్రామ పరిధిలోని కొత్తూరు వర్రి బజారు ఎంట్రెన్స్ లో కరెంటు స్తంభంలో ఇనుప చువ్వలు బయటకు వచ్చి అందరికి షాక్ కొడుతున్నాయని, ఈ మధ్యనే ఈ షాక్ వలన రెండు కోతులు కూడా ప్రాణాలు కోల్పోయినాయని, వెంటనే స్తంభాన్ని మార్చవలసినదిగా ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ వారిని కోరుతున్నామని స్థానికులు కోరుతున్నారు. ప్రజలు ఇబ్బందులను అధికారులు పట్టించుకోరా అని ప్రశ్నిస్తున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

# ఏపీటీఎఫ్ నూతన కార్యాలయం ప్రారంభం

కారంపూడి, జనవరి 3 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ కారంపూడి, బొల్లాపల్లి మండల సంయుక్త కార్యాలయం శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఏపీటీఎఫ్ అధ్యక్షురాలు మంజుల, పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాద్, పల్నాడు జిల్లా అధ్యక్షులు ఉస్మాన్, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వి.రవికుమార్, గుంటూరు జిల్లా అధ్యక్షులు బసవలింగారావు, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఖలీద్, రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, సీనియర్ ఏపీటీఎఫ్ నాయకులు గద్దె రామకృష్ణారావు, కె.కృష్ణారావు, కరిముల్లా, దానులు హాజరయ్యారు. మాచర్ల, దుర్గి, గురజాల, వినుకొండ, శావల్యాపురం, నూజండ్ల, ఈపూరు, సత్తెనపల్లి మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# మండలంలో 5 నుంచి వికసిత భారత్ గ్రామసభలు



కారంపూడి, జనవరి 3 ప్రభాతవార్త: కారంపూడి మండలంలోని 15 గ్రామాల్లో సోమవారం నుంచి ఎంపీడీఓ గంటా శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వికసిత భారత్ – గ్యారంటీ ఫ్ రోజ్ ఆజీ వికా మిషన్ గ్రామసభలు నిర్వహించనున్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో వికసిత భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ ఆజీ వికా మిషన్‌గా మార్చిన ఈ పథకం ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుందన్నారు. గ్రామసభ ప్రజలను చైతన్యం చేయడానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఏపీఓ కట్టా నాగేశ్వరరావులు తెలిపారు.

# స్త్రీ అభ్యుదయ వాది సావిత్రిబాయి పూలే: ఎంఈఓ

కారంపూడి, జనవరి 3 ప్రభాతవార్త: సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆమె చిత్రపటానికి ఎంఈఓ రవికుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ అభ్యుదయ వాది, సంఘ సంస్కర్త, భారతదేశపు మొదటి మహిళా ఉపాధ్యాయురాలు అని సావిత్రిబాయిని కొనియాడారు. ప్రతి విద్యార్థి సావిత్రిబాయిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. హెచ్ఎం శేషిరెడ్డి, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన ఫైనాన్స్ వెల్ఫేర్ అసోసియేషన్

కారంపూడి, జనవరి 3 ప్రభాతవార్త: నూతన సంవత్సరం సందర్భంగా మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిని కారంపూడి ఆటో అండ్ ఎంప్లాయిస్ ఫైనాన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అదేవిధంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ చిరుమామిళ్ల మధుబాబును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పల్నాడు ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డికి, ఛైర్మన్ మధుబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు బొగ్గవరపు శ్రీనివాసరావు, ముచ్చర్ల రామకోటేశ్వరరావు, సూరె కోటేశ్వరరావు, సన్నిధి వెంకట శ్రీనివాసరావు, కూరపాటి బ్రహ్మరాజు, గర్రె రామారావు, కోనేటి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



# పల్నాడు జిల్లా వార్త



## మాచర్లలో 'ఆధార్' ప్రత్యేక శిబిరాలు



మాచర్ల, జనవరి 3 ప్రభాతవార్త: మాచర్ల పురపాలక సంఘ పరిధిలో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వేణుబాబు తెలిపారు. పల్నాడు జూనియర్ కళాశాల, ఆర్సీఎం ఎలిమెంటరీ స్కూల్, అజాగర్ నగర్ ఎంపీపీఎస్ స్కూల్‌లో ఈ స్పెషల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

మాచర్ల, జనవరి 3 ప్రభాతవార్త: సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు హౌసింగ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ మరియదాసు మాట్లాడుతూ భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి, నిమ్న వర్గాల అభివృద్ధికి కృషి చేసిన జ్యోతిరావు పూలే భార్య సావిత్రిబాయి పూలే చేసిన కృషిని కొనియాడారు. ఆమె పూణెలో మొట్టమొదటగా బాలికల పాఠశాల ప్రారంభించారన్నారు. కుల వ్యవస్థకు,



పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, మహిళల హక్కుల కోసం పోరాటం చేయడం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు విశ్వసించారని కొనియాడారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ తేజ, అలీ, ఎలిశమ్మ, అమరయ్య తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ రక్షణతో సురక్షితం: సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీనివాసరావు

గురజాల, జనవరి 3 ప్రభాతవార్తః పర్యావరణ పరిరక్షణతో రేపటి తరాలు సురక్షితంగా ఉంటాయని సీనియర్ సివిల్ న్యాయాధికారి వై శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన మండలంలోని మాడుగులలో గల బాలుర గురుకుల పాఠశాలలో పర్యావరణ పరిరక్షణపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో



గాలి, నీరు తదితరాలు పూర్తిగా కలుషితమయ్యాయన్నారు. నీటి పరిరక్షణకు, స్వచ్ఛమైన గాలి కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం అలవర్చుకోవాలన్నారు. ప్లాస్టిక్ నిర్మూళనకు కృషి చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అలాగే గ్రామంలోని ఎస్టీ కాలనీలో బాల్య వివాహ నిషేద చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్న వయసులో వివాహాలు చేయడం వలన వారి భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. చిన్న వయసులో గర్భం దాల్చితే తల్లి, బిడ్డల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందన్నారు. పెళ్లి కారణంగా బాలికలు చదువుకు దూరం అవుతున్నారన్నారు. బాల్య వివాహాలు జరుగుతుంటే చైల్డ్ లైన్ నెంబరు 1098 లేదా 100 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ షేక్ జానీబాషా, బార్ అసోసియేషన్ సెక్రటరీ కత్తి చలమరాజు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

## 'యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి'

పెదకూరపాడు, జనవరి 3, ప్రభాతవార్త: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల పట్ల మక్కువ చూపాలని మంచి సమాజం ఏర్పడాలంటే ఆరోగ్యం ఎంతో అవసరమని ఆఆరోగ్యం క్రీడల ద్వారానే సాధ్యమని తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ ముంతాజ్ అన్నారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల క్రీడా మంత్రిత్వ శాఖ, మేరా యువభారత్ ల సౌజన్యముతో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో పెదకూరపాడు లోని జి ఆర్ సి ఆర్ కే శ్రీ చైతన్య హై స్కూల్ క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న వాలీబాల్ కబడ్డీ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో యువతను ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని యువతను క్రీడల్లో పాల్గొనేందుకు ప్రోత్సహిస్తుంద న్నారు. జి ఆర్ సి ఆర్ కే శ్రీ చైతన్య స్కూల్ క్రీడా ప్రాంగణం నిర్వాకులు సామాజిక సేవకులు గుత్తా కవిత రాము మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వానికి మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. క్రీడారంగంలో రాణించిన యువతకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. తహసిల్దార్ నీలి ధనలక్ష్మి మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలు ఎంతో ముఖ్యమని యువత క్రీడల పట్ల మక్కువ కలిగి ఉండాలని అన్నారు. ఈకార్యక్రమంలో పెదకూరపాడు ఎస్సై ఏరువా చిన్న అల్లూరి రెడ్డి మాట్లాడుతూ క్రీడలు మానసిక ధైర్యాన్ని పెంపొందిస్తాయని సత్ఫలితంగా ఆత్మవిశ్వాసంతో ఏ రంగాన్ని ఎన్నుకున్నప్పటికీ రంగాలలో ముందుకు వెళ్లొచ్చు అన్నారు. ఈకార్యక్రమంలో జనచైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి విజయ్ బెన్నిబాబు, కార్యదర్శి తుల్లూరి సాంబశివరావు, కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు షేక్ అబూ బకార్, నాగబాబు, తిరుపతి రెడ్డి, భాను, ఆర్ సుజాత, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





## మున్సిపల్ కార్మికులకు, నిరాశ్రయులకు రగ్గుల పంపిణీ

సత్తెనపల్లి టౌన్, జనవరి 3,ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలో శ్రీ వాసవి యువశక్తి కమిటీ ఆధ్వర్యంలో శనివారం మానవత్వాన్ని చాటుకునే సేవా కార్యక్రమం నిర్వహించారు. కమిటీ సభ్యుడు, మున్నలూరి పుల్లారావు మెడికల్ షాప్ కుమార్తె చిరంజీవి మోక్ష జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టారు. శీతాకాలం చలి నుంచి రక్షణగా ప్రస్తుత చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, పుల్లారావు ఆర్థిక సహకారంతో తాలూకా సెంటర్ మరియు దాని పరిసర ప్రాంతాల్లో రోడ్డు పక్కన నివసించే నిరాశ్రయులకు, అలాగే పట్టణాన్ని శుభ్రం చేసే మున్సిపల్ క్లీనింగ్ వర్కర్లకు రగ్గులను పంపిణీ చేశారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు సభ్యులు తెలిపారు. రగ్గుల పంపిణీ అనంతరం శ్రీ వాసవి యువశక్తి సభ్యుల సమక్షంలో చిరంజీవి మోక్ష కేక్ కటింగ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చిన్నారికి పలువురు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి యువశక్తి కమిటీ ప్రతినిధులు, కొల్లిపర నరసింహారావు, జవ్వాజి. సుబ్బారావు, కుకుట్ల. రాధాకృష్ణ, గ్రాంధి. మోహన్, కె .రామకృష్ణ, ఎం. పుల్లారావు, ఎల్. రమేష్, కె .రంజిత్, చి. అనిల్, కె. సుబ్రహ్మణ్యం, చ. రాఘవేంద్ర, ఎం పవన్, కె. శేఖర్, సభ్యులు మరియు పుల్లారావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## సావిత్రిబాయి పూలే 194వ జయంతి ఉత్సవం

అచ్చంపేట, జనవరి 3, ప్రభాతవార్త: అచ్చంపేట మండల కేంద్రంలో సావిత్రిబాయి పూలే 194వ జయంతి ఉత్సవాలను అంబేద్కర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అంబేద్కర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చిలుక చంద్రయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు నందిగామ ఆశీర్వాదం, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ హాజరై సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిరువయిపాటి ఆంజనేయులు, శిఖా నరసింహారావు, సీపీఐ మండల కార్యదర్శి ఎస్.కే. మస్తాన్ బుజ్జి, మీరసబుడే, ప్రవీణ్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## సావిత్రిబాయి పూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి



క్రోసూరు, జనవరి 3, ప్రభాతవార్త: మండలంలోని అనంతవరం గ్రామం ఎంపీపీ స్కూల్ లో మోడల్ బాలల పార్లమెంటు విద్యార్థిని విద్యార్థులు మహిళా టీచర్లకు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.కె బాజిత్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే భారత దేశపు తొలి మహిళ గురువు మహిళ హక్కుల పోరాటానికి మార్గదర్శకరాలు ఆమె జయంతి జరుపుకోవడం మనందరికీ గర్వకారణమని స్త్రీలను గౌరవించడం మన భారతదేశ సాంప్రదాయం అన్నారు. ఈ కార్యక్రమంలో గుడ్ షెఫర్డ్ సంస్థ ప్రతినిధి తండు లక్ష్మణ్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే 1931లో జనవరి 3న మహారాష్ట్ర సతారా జిల్లాలో నాయ గాం గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించారు. సావిత్రిబాయి పూలే ఆమె భర్త జ్యోతిరావు పూలే దగ్గర విద్యాభ్యాసం నేర్చుకొని బాలికలు మరియు మహిళలకు బోధించారు . సమానత్వం కోసం పోరాడిన మహాను భావురాలు 1848లో పూణేలో బాలికల కోసం ఒక పాఠశాల ఏర్పాటు చేసి వారికి విద్యభ్యాసం బోధించారు. ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్లేట్లు,గ్లాసుల పంపిణీ

పెదకూరపాడు, జనవరి 3, ప్రభాతవార్త: కాశిపాడు ఎంపీపీ హెచ్ డబ్ల్యు పాఠశాల నందు ప్లేట్లు, గ్లాసులు, వాటర్ బాటిల్స్ కు విద్యార్థిని విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ చేతుల మీదుగా అందించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 75 తాళ్లూరు ప్రధానోపాధ్యాయులు అన్నపురెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. 30 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ప్లేటు, గ్లాసు, వాటర్ బాటిల్స్ ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత కుమార్తె అల్లుడు (లండన్) నరేష్ మోనిక విద్యార్థులకు ఉచితంగా సమకూర్చారు. మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ నరేష్ మోనిక విద్యార్థులకు అవసరమైన వస్తువులను ఇచ్చినందుకు వారిని అభినందించారు. చిన్న వయస్సులోనే ఇలాంటి సామాజిక పరమైన విషయంలో సహాయం చేయటం అనేది గొప్ప విషయమని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పిస్తుంది, అందరూ చదువుకోవాలని తెలియజేశారు. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో గొప్ప వ్యక్తులు మాత్రమే సమాజ శ్రేయస్సు దానగుణం కలిగి ఉంటారని తెలియజేశారు. విద్యార్థులు వీటిని ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ప్రధానోపాధ్యాయురాలుసుజాత ప్రధానోపాధ్యాయులు సుబ్బారావు ఉపాధ్యాయులు శివప్రసాద్ క్లస్టర్ టీచర్ వి శివ, అంగనవాడి టీచర్, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే 'కన్నా'కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన నేతలు

సత్తెనపల్లి, జనవరి 3, ప్రభాతవార్త: సత్తెనపల్లి ఎపి.ఎన్జీ జీవోస్ అధ్యక్షుడు పెండెం మణిరావు, సెక్రటరీ అంబేద్కర్ మరియు సంఘ సభ్యులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేశారు. తదుపరి ఏపీ.ఎన్జీ జీవోస్ నూతన క్యాలెండర్ 2026 ను ఛ గారు ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి ఎపి.ఎన్జీ జీవోస్ అధ్యక్షులు పి.మణిరావు, సెక్రటరీ ఎస్.అంబేద్కర్ పలనాడు జిల్లా ఏపీ.ఎన్జీ జీవోస్ ఉపాధ్యక్షులు అప్పారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసరావు. ఎపి.ఎన్జీ జీవోస్ మహిళా ఉపాధ్యక్షులు కుసుమకుమారి ,ఉపాధ్యక్షులు చిట్టిబాబు, ఉపాధ్యక్షులు నాగేశ్వరావు ఏపీ ఎన్జీవోస్ మరియు మెంబెర్స్ పాల్గొన్నారు.



## ఎపి ఎన్జీఓస్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

సత్తెనపల్లి, జనవరి 3, ప్రభాతవార్త:ఎపి ఎన్జీఓఎస్ నూతన సంవత్సర 2026 క్యాలెండర్ ను సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవోస్ సత్తెనపల్లి తాలూకా యూనిట్ అధ్యక్షులు పెండం మణిరావు, కార్యదర్శి ఎస్ అంబేద్కర్ , జిల్లా ఉపాధ్యక్షులు అప్పారావు, మహిళా ఉపాధ్యక్షురాలు కుసుమ , ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ఇబ్రహీం, పి. రాంబాబు, కె. రాజేష్, బి. కొండలరావు, ఎం టి నాగేశ్వరరావు, షేక్ కరీముల్లా, గంటా శ్రీనివాసరావు, షేక్ అష్రఫ్, డిసి మెంబర్లు ఈసీ మెంబర్లు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు



## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

సత్తెనపల్లి, జనవరి 3, ప్రభాతవార్త: సావిత్రిబాయి పూలే 195 వ జయంతిని పురస్కరించుకొని ఘన నివాళులు అర్పించిన జర్నలిస్టు జ్యోతి. మహిళల హక్కుల కోసం వందేళ్ళ క్రితమే పోరాడిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు, ఆధునిక స్త్రీవాది, సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే. విద్య, అక్షరాస్యత రంగంలో మహిళల అభ్యున్నతి కోసం విప్లవాత్మకమైన కృషి చేశారు. విద్య తోనే స్త్రీ విముక్తి సాధ్యమవుతుందని నమ్మి అనుభవించి, అనుసరించిన మహనీయురాలు సావిత్రి. ఈ తరంలో విద్యనభ్యసిస్తున్న మహిళలందరికీ ఆమె జన్మదినం ఒక ముఖ్యమైన రోజు. ఈ సందర్భంగా సత్తెనపల్లి పట్టణంలోని తాలూకా సెంటర్ వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సావిత్రిబాయి పూలే ఫోటోకి పూలమాలవేసి నివాళులర్పించిన జర్నలిస్టు జ్యోతి. జర్నలిస్ట్ జ్యోతి తో పాటు పలువురు మహిళలు సావిత్రిబాయి పూలే కి నివాళులర్పించడం జరిగింది.



## బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

సత్తెనపల్లి, జనవరి 3, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలోని శాలివాహన నగర్ లోని ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే 195వ జయంతి సందర్భంగా చిత్ర పటానికి పూల మాల వేసి ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ నిమ్న కులాల కోసం పనిచేసిన సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే అని కొనియాడారు.. భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా పేరు గడించార న్నారు. మహిళా విద్య, బాల్యవివాహాల నిర్మూలన, అనగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన ధీశాలి సావిత్రిబాయి పూలే అన్నారు. సామాజికంగా అణిచివేతకు గురైన తరగతులు, మరియు మహిళలకు విద్యను ప్రోత్సహించడంలో సావిత్రిబాయి పూలే కృషి అభినందనీయమని అన్నారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేయడం జరిగింది తదనంతరం మహిళా ఉపాధ్యాయురాలు నబీరున్నిష ను శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు మంగళ పూరి నాగేశ్వరావు, చింకా అంకమ్మరావు, గుంటూరు తులసి రామ్, కుమ్మరి దస్తగిరి, పులహరి భానోజీ, చావల వెంకటేశ్వర్లు, మోదుగుల బాబ్జి, గుంటూరు గోవింద్ ఉపాధ్యాయ సిబ్బంది ప్రేమ కుమార్, శ్రీనివాస్, అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.





## సజ్జ అజయ్‌కు అభినందన

సత్తెనపల్లి, జనవరి 3, ప్రభాతవార్త: తాడేపల్లి ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో శనివారం ఉదయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమ్మ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ గా ప్రమాణ స్వీకారం చేసిన సజ్జ అజయ్. ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారానికి హాజరై అజయ్ ను శాలువాలతో సన్మానించి అభినందించిన న్యాయవాది, లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్ ) పల్నాడు జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ విజయ్ కుమార్. ఆయన వెంట కారుమంచి గంగరాజు, శ్రీనివాసరావు తదితరులున్నారు.




## వైకాపా కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి

సత్తెనపల్లి, జనవరి 3, ప్రభాతవార్త: సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి రాజారపు శివ నాగేశ్వర రావు ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆఫీసులో సావిత్రి బాయ్ పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచల సాంబశివరావు, పట్టణ కన్వీనర్ షేక్ మోలాలి, పట్టణ బీసీ విభాగం అధ్యక్షులు తుమ్మల వెంకటేశ్వరరావు, అచ్యుత శివప్రసాద్, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ జానీ, జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు షేక్ గోరా, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి పెద్దింటి నాగేశ్వరరావు, గుజ్జర్లపూడి సతీష్, పట్టణ నాయకులు షేక్ జలీల్, పెట్టింటి చిట్టి, బీసీ నాయకులు లోక మాధవ గాత్రం కోటేశ్వరావు, వేముల శ్రీదేవి, పల్లపు అంకమ్మరావు, వేముల ప్రసాదరావు, సెగ్గం ఆంజనేయులు, రాజారపు సాంబశివరావు, పులహరి భానుజీ, ఉల్లంగుల ప్రసాదు, రోహిత్ తదితరులు పాల్గొన్నారు



## సావిత్రిబాయి పూలేకు 'కన్నా' ఘననివాళి

సత్తెనపల్లి, జనవరి 3, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం రఘురామ్ నగర్ ప్రజావేదిక నందు తొలి భారతీయ మహిళా ఉపాధ్యాయురాలు, గొప్ప సంఘసంస్కర్త, రచయిత్రి, స్ఫూర్తి ప్రదాత



సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన శాసన సభ్యులు కన్నా లక్ష్మీ నారాయణ. ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ మండల వార్డు గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు .

## నవ్యాంధ్రప్రదేశ్‌ను పెట్టుబడుల ప్రదేశ్‌గా మార్చిన ఘనులు చంద్రబాబు, లోకేశ్ : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జనవరి 3, ప్రభాతవార్త: నవ్యాంధ్రప్రదేశ్ ను పెట్టుబడుల ప్రదేశ్ గా, సన్ రైజ్ స్టేట్ ను ఇన్వెస్ట్మెంట్స్, ఎంప్లాయ్ మెంట్ కు కేరాఫ్ గా మార్చిన ఘనత చంద్రబాబు, లోకేశ్ లదే. వారు ఇరువురి నిర్విరామ కృషి వల్లే ఏఐ టెక్నాలజీ, క్వాంటమ్ ఆవిష్కరణలతో పాటు, ఐటీ ఇతర రంగాల



దేశీయ పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ దేశంలో మేటిగా నిలిచింది. 9 నెలల్లో (2025 ఏప్రియల్ డిసెంబర్) 25.3శాతం పెట్టుబడుల వాటా..జాతీయ పారిశ్రామిక అధ్యాయానికే గొప్ప మైలురాయని చెప్పొచ్చు. కేవలం 18 నెలల్లో రాష్ట్రానికి 25 లక్షల కోట్ల పెట్టుబడులు, 26 లక్షల ఉద్యోగావకాశాలు రావడం విజనరీ నాయకుడి వినూత్న పాలనా సంస్కరణల ప్రతిఫలమే అనడం అతిశయోక్తి కాదు. కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసిన పారిశ్రామిక విధానాలు, 25 ప్రధాన పాలసీలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, సింగిల్ విండో సిస్టమ్, ఫాస్ట్ ట్రాక్ క్లియరెన్సులు ప్రపంచ పారిశ్రామిక వేత్తల దృష్టిని ఏపీవైపు మళ్లేలా చేశాయి. రాష్ట్రాభివృద్ధికి అడ్డుపడటమే తమ జన్మహక్కుగా భావిస్తూ ప్రతి అభివృద్ధికి కొర్రీలు, కుట్రలు, కోర్టుల్లో కేసులేయిస్తున్న జగన్.. వైసీపీ నేతలు ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించాలి, ఊరందరిదీ ఒకదారి అయితే.. ఉలిపికట్టెది మరోదారి అన్నతీరుగా కాకుండా.. ప్రపంచానికే మార్గదర్శిగా నిలుస్తున్న చంద్రబాబు పాలనా సంస్కరణల్ని జగన్ అండ్ కో మనస్ఫూర్తిగా స్వాగతించాలి. అప్పుడే జగన్ కు, వైసీపీకి రాష్ట్రంలో, రాజకీయాల్లో మనుగడ." అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు.

## బాల్యవివాహాల నిషేధిత చట్టంపై అవగాహన

చిలకలూరిపేట, జనవరి 3, ప్రభాతవార్త: రాష్ట్ర న్యాయ సేవాధికారిక సంస్థ అమరావతి మరియు జిల్లా న్యాయ సేవాధికారిక సంస్థ గుంటూరు ఆదేశాల మేరకు చిలకలూరిపేట మండలం న్యాయ సేవ అధికారిక సంస్థ ఆధ్వర్యంలో హై స్కూల్ పసుమర్రిలో విద్యార్థులకు బాల్య వివాహాల నిషేధ చట్టం




పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది . ఈ సదస్సుకు ఐ స్వాతి అడిషనల్ సివిల్ జడ్జి చిలకలూరిపేట ముఖ్యఅతిథిగా హాజరైనారు ఈ సదస్సులో జడ్జి మాట్లాడుతూ బాలికలకు 18 ఏళ్ళ వయసు నిండకుండా బాలురకు 21 సంవత్సరంలో వయసు నిండకుండా వివాహాలు జరిపిస్తే చట్టప్రకారం నేరంగా పరిగణము పర్యటించ బదుతుందని తెలిపారు ఇలాంటి పరిస్థితులు ఎదురైనప్పుడు దాన్ని వ్యతిరేకించాలని వివరించారు అదేవిధంగా ఫోక్స్ చట్టం గురించి కూడా తెలిపారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంట్ లాయర్ పి వెంకటేశ్వరరావు సీనియర్ న్యాయవాది టి రామాంజనేయులు, మెంబర్ భాను ప్రసాద్ లాయర్లు స్కూల్ హై స్కూల్ హెడ్ మాస్టర్ రూరల్ ఎస్సై అనిల్ కుమార్ స్కూల్ విద్యార్థిని విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నోబుల్ టీచర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

చిలకలూరిపేట, జనవరి 3, ప్రభాతవార్త: నోబుల్ టీచర్స్ అసోసియేషన్ చిలకలూరిపేట నియోజకవర్గం లోని ఎన్‌టిఎ నాయకులు, ఆసిఫ్ దౌల, .సుధాకర్,.సాంబశివరావు, సిహెచ్ .సుబ్బారావు, నాగరాజు,.ఖాసింబుడే,బి. శ్రీనివాస రావు, ఇస్మాయిల్, శ్రీకాంత్ , తీ.శంకరయ్య , కరీముల్లా, భాస్కర్ రావు, షేక్ బాజీ, షేక్



నాగుల్ మీరా, శ్రీనివాసరావు తదితరులు స్థానిక ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావును క్యాంప్ ఆఫీస్‌లో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ విగితి డైరీ , క్యాలెండర్ మరియు పోస్టర్లను అందజేశారు.

## సువార్తను పరామర్శించిన ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జనవరి 3, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు వంజ సువార్త గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తూర్పు మాలపల్లె లోని వారింటికి వెళ్లి వారి ఆరోగ్య



పరిస్థితుల గురించి తెలుసుకొని, వారిని పరామర్శించారు.

## జాతీయ స్కూల్ గేమ్స్ నెట్ బాల్ పోటీలకు ఏఎంజీ విద్యార్థి ఎంపిక



చిలకలూరిపేట, జనవరి 3, ప్రభాతవార్త: ఏఎంజీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న చొప్పరపు శ్రీ మణికంఠ ఈ నెల జనవరి 8వ తేదీ నుండి 12వ తేదీ వరకు రాజస్థాన్ లోని బల్మార్లో జరగబోయే జాతీయ స్కూల్ గేమ్స్ అండర్ 17 నెట్ బాల్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొనబోవుచున్నాడు. ఈ క్రీడాకారుడు ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని పడమట జిల్లా పరిషత్ హై స్కూల్ లో డిసెంబర్ 8వ తేదీ నుండి 10 వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 17 నెట్ బాల్ పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు తరుపున పాల్గొని విశేష క్రీడా ప్రతిభను కనపరిచి జాతీయ స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైనాడు. ఈ క్రీడాకారుడిని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ అరుణ్ కుమార్ కంటి మహంతి గారు, ఏఎంజీ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు కృపాదానం ,పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సురేష్ మరియు పద్మావతి , గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి గోపి మరియు శిరీష , బాపట్ల జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి బుజ్జి , ఉమ్మడి గుంటూరు జిల్లా నెట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్వరరావు , రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షులు కరిముల్లా చౌదరి, పల్నాడు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్ష కార్యదర్శులు ఖాదర్ మస్తాన్ గారు మరియు స్వర్ణ రాజు , గుంటూరు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కొండయ్య మరియు యార్లగడ్డ శ్రీనివాసరావు , చిలకలూరిపేట జోన్ అధ్యక్ష కార్యదర్శులు. ఖాసీం బుడేమియ మరియు మధు, ఏఎంజీ వ్యాయామ ఉపాధ్యాయులు రాజు మరియు రాజేష్ , స్కూల్ టీచర్స్ మరియు విద్యార్థిని విద్యార్థులు మణికంఠ ను అభినందించారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

చిలకలూరిపేట, జనవరి 3, ప్రభాతవార్త: స్థానిక జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ(గార్డ్స్) ఆధ్వర్యంలో శనివారం ఆ సంస్థ కార్యాలయంలో చదువుల తల్లి సావిత్రిబాయి పూలే



జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ బాలిక విద్యా కోసం సావిత్రి బాయి చేసిన కృషి గురించి వివరించారు. జనవిజ్ఞాన వేదిక ప్రచురించిన నేను.. సావిత్రిబాయిని పుస్తకాన్ని ఆవిష్కరించారు. జెవివి ప్రచురణల విభాగం రాష్ట్ర కన్వీనర్ డా. దార్ల బుజ్జిబాబు అధ్యక్షత వహించిన ముఖ్య అతిథిగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ప్రోగ్రాం ఆఫీసర్ పి.విజయ్ కుమార్ పాల్గొన్నారు. అలాగే గార్డ్స్ ఉపాధ్యక్షులు గేరా యోకోబు సాహితీ విమర్శకులు, డా. పి.వి.సుబ్బారావు, రిటైర్డ్ ఎక్సైజ్ సి ఐ గోరంట్ల నారాయణ , మాజీ ఏపిజి దాసరి చిట్టిబాబు, న్యాయవాది ఇనగంటి నాగరాజు, డా.విన్సెంట్ పాల్, బత్తుల విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో చైర్మన్ రఫాని పర్యటన

చిలకలూరిపేట, జనవరి 3, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశాల 12 వ వార్డు తూర్పు మాలపల్లె లో చిన్న పార్క్ నిరుపయోగంగా ఉన్నందున దాన్ని ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా తగు చర్యలు తీసుకోవాలని మరియు చంద్రమౌళి పెద్ద పార్కు నందు వాష్ రూమ్లు ఏర్పాటు చేయుటకు అవార్డులోని డ్రైనేజ్ మరియు రోడ్లను పరిశీలించి సంబంధిత





అధికారులను వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించిన మున్సిపల్ చైర్మన్ షేక్.రఫాని. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి నాయకులు గట్టుపల్లి మాణిక్యరావు,గేరా.రాము, కొప్పుల రాంబాబు, వల్లూరి.యోహోషువ,గట్టుపల్లి. వినయ్, తెలగతోటి.ఆంతోని మరియు వార్డు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం టిడ్కోగృహ సముదాయం నందు సంక్రాంతి సంబరాలు జరుపుకొనుటకు స్థలమును మున్సిపల్ చైర్మన్ షేక్. రఫాని , వార్డ్ కౌన్సిలర్లు పరిశీలించారు.

## చేవూరి ఆంజనేయులు మృతికి ప్రత్తిపాటి సంతాపం

చిలకలూరిపేట, జనవరి 3, ప్రభాతవార్త: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ మాజీ డైరెక్టర్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చేవూరి కృష్ణమూర్తి సోదరుడు చేవూరి ఆంజనేయులు జీవిత మృతిచెందారు. కాగా శనివారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పట్టణంలోని వారి నివాసానికి వెళ్లి, చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.



# పల్నాడు జిల్లా వార్త



## టిడిపి కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

నరసరావుపేట టౌన్, జనవరి 3 ప్రభాతవార్త :: నరసరావుపేట పట్టణంలోని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు గారి ఆదేశాల మేరకు శనివారం సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. యువ నాయకులు డాక్టర్ చదలవాడ ఆదిత్య బాబు ఆధ్వర్యంలో బీసీ సెల్ అధ్యక్షుడు మడకా శివప్రసాద్ అధ్యక్షతన ఉమ్మడి కుటమి నాయకులు మరియు బీసీ సంఘం నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు.వారు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులుర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆదిత్య బాబు



మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలే అన్నారు. ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు మడకా శివప్రసాదరావు మాట్లాడుతూ సావిత్రిబాయి గొప్ప సంఘసంస్కర్త అన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీనివాసరావు , పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గట్టుపల్లి సత్యనారాయణ,మండల పార్టీ అధ్యక్షులు బండారుపల్లి విశ్వేశ్వర రావు ,డాక్టర్ రాంప్రసాద్, తెలుగుదేశం పార్టీ మండల బీసీ సెల్ అధ్యక్షులు నరసింహారావు , మాజీ కౌన్సిలర్స్ చంద్రశేఖర్ , కదం నాగ జ్యోతి , సంజీవరావు దాసరి సంఘం డైరెక్టర్ గిరిబాబు ,బీసీ సంక్షేమ సంఘం నాయకులు, జన జాగృతి మండల అధ్యక్షురాలు విడతల రమాదేవి , నరసరావుపేట రజక సంఘం నాయకులు శ్రీరాములు,బత్తుల రాజశేఖర్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ,ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్సవాలు

నరసరావుపేట,క్రైమ్ జనవరి 3 ప్రభాతవార్త : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శనివారం ఆర్టీసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రతా మాస ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి డిపో మేనేజర్ బి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా ప్రజా రవాణా అధికారి అజిత కుమారి, ట్రాఫిక్ సి.ఐ లోకనాథం పాల్గొని మాట్లాడారు. రోడ్డు భద్రత మాసోత్సవాల ప్రాముఖ్యతను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలన్నారు. ప్రభుత్వం ట్రాఫిక్కు సంబంధించి చేసిన సూచనలు పాటించడం ద్వారా ఎన్నో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. డ్రైవర్లు తమ కుటుంబంతో పాటు ప్రయాణికుల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. అతివేగం వలన



కలిగే నష్టాలను వివరించారు. ప్రస్తుతం ఎక్కువగా మంచు కురుస్తుందని, ప్రమాదాలు జరిగే అవకాశాలను గుర్తించి ముందస్తు చర్యలను తీసుకోవాలన్నారు. రాత్రి వేళల్లో వాహనాలు నడిపేవారు సిగ్నల్స్ ను కచ్చితంగా గమనించాలన్నారు. రోడ్డు భద్రత మాసోవ్సాలు విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.

## కోటప్పకొండలో జనసేన నాయకుల పర్యటన

నరసరావుపేట, జనవరి 3, ప్రభాతవార్త ::మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి దేవస్థానంలో జనసేన పార్టీ నాయకులు శనివారం పర్యటించారు. రాష్ట్ర కార్యదర్శి, నరసరావుపేట నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీ సయ్యద్. జిలాని ఆదేశానుసారం జనసేన పార్టీ నాయకుల ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కోటప్పకొండలోని త్రికోటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు



భక్తులకు అందిస్తున్న అన్ని శాఖల ప్రసాదం, నిత్య అన్నదానం, పారిశుధ్య సౌకర్యాలు (మరుగుదొడ్లు), మంచినీటి వసతులు గురించి ఆరా తీశారు. వాటిపై భక్తుల అభిప్రాయాలను తీసుకున్నారు.ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా, లేవా అనే విషయాన్ని పరిశీలించి, సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. భక్తుల భద్రత, సౌకర్యాలు తమకు అత్యంత ప్రాధాన్యత అని జనసేన పార్టీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నరసరావుపేట జనసేన పార్టీ అధికార ప్రతినిధి షేక్. అద్రూఫ్,జనసేన నాయకులు శిరీ యాదవ్, చెన్నూపల్లి సాంబ,మిరియాల సోము,క్రిష్ణంశెట్టి ఏడుకొండలు,షేక్ ఖాజావలి , వాసు,పసుపులేటి పార్థసారధి, హనుమంత్ రావు,షేక్ బాషా,శ్రీకాంత్,జడా నాని,వీర మహిళలు,అంబటి రేణుక, జడా శ్రావణి మొదలగువారు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డును అందుకున్న బిబిటి సుందరి

రొంపిచర్ల,జనవరి 3 ప్రభాతవార్త :: సౌత్ ఇండియా ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డును పల్నాడు జిల్లాకి చెందిన బిబిటి సుందరి అందుకున్నారు.సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా విజయవాడలో శనివారం తుమ్మపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు అవార్డును స్వీకరించారు. పల్నాడు జిల్లాలోని కారంపూడి జిల్లా పరిషత్ పాఠశాలలో ఇంగ్లీష్ టీచరుగా వారు




విధులు నిర్వహిస్తున్నారు. సావిత్రిబాయి పూలే సౌత్ ఇండియా ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డును స్వీకరించడం సంతోషంగా ఉందని వారు తెలియజేశారు. ఉపాధ్యాయ వృత్తిలో విద్యార్థులను చదువుతోపాటు వివిధ అంశాలలో రాణించేందుకు అవసరమైన శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. విద్యారంగంలో తమ సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును అందించడం సంతోషంగా ఉందని బిబిటి సుందరి తెలియజేశారు. అవార్డు గ్రహీతను నరసరావుపేట, కారంపూడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఉపాధ్యాయులు, ప్రముఖులు, అభినందించారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టుకు 'ఈశ్వర్' విద్యార్థిని ఎంపిక


నకరికల్లు, జనవరి 3 ప్రభాతవార్త : స్థానిక కేసానుపల్లి లోని ఈశ్వర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ నందు బి.టెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని కె. హారిక కబడ్డీ మహిళల జట్టుకు సీనియర్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. నాగమల్లేశ్వర రావు వివరాలు తెలియచేశారు. కృష్ణవేణి డిగ్రీ కళాశాల నందు జరిగిన కబడ్డీ సెలక్షన్స్‌లో అత్యంత ప్రతిభ కనపరిచిన తమ కళాశాల విద్యార్థిని కె. హారిక రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ జట్టుకు సీనియర్



విభాగంలో ఎంపిక కావడం సంతోషమన్నారు. తమ కళాశాలకు ఎంతో గర్వకారణం అని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక అయిన "కె. హారిక" ని కళాశాల చైర్మన్ శ్రీ షేక్ మీరావలి ప్రత్యేకంగా అభినందలు తెలియచేశారు. కబడ్డీ జట్టుకు ఎంపిక అయిన తమ కళాశాల విద్యార్థిని ఈ నెల 4, 5 తారీఖులలో పశ్చిమ గోదావరి జిల్లాలోని వీరవాసరంలో జరుగబోయే రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్ కు మన పల్నాడు జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తారని కళాశాల వ్యాయామ ఉపాద్యాయులు గంగాధర్ రావు మరియు డి. మహేష్ తెలిపారు .ఎంపిక అయిన విద్యార్థిని కె. హారికను కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీం మోహిద్దీన్ , మేనేజింగ్ డైరెక్టర్ డా. షేక్ మస్తాన్ షరీఫ్ తమ అభినందనలు తెలియజేసి, ఇటువంటి ఎంపికలు మరియు ఘనతలు మరెన్నో సాధించాలని ఆకాక్షి ంచారు.

## ఓరియంటల్ హైస్కూల్ లో ముగ్గుల పోటీలు

నరసరావుపేట, జనవరి 3, ప్రభాతవార్త : స్థానిక శ్రీ రామకృష్ణ ఓరియంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం సంక్రాంతి ముగ్గుల పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు శైలజ అధ్యక్షతన జరిగిన పోటీలలో 35మంది విద్యార్థినులు పాల్గొన్నారు. కనుమరుగవుతున్న సంస్కృతి సంప్రదాయాలను విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు వారు కూడా ఈ సంప్రదాయన్ని మరో తరానికి అందించే ఉద్దేశ్యతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని శైలజ అన్నారు. విద్యార్థులలో



ఉన్న సృజనాత్మక శక్తి ఈ పోటీలో కనిపించిందని క్లబ్ కార్యదర్శి కె లక్ష్మీ ్మ కుమారి, కోశాధికారి పి సుజాత అన్నారు. పోటీల్లో టెన్త్ విద్యార్థిని బి సాయి పూజిత (ప్రథమ) బహుమతి, 9వ తరగతి విద్యార్థిని ఎం.శాంతి, (ద్వితీయ), టెన్త్ విద్యార్థిని పి శివలక్ష్మి ్మ, (తృతీయ) బహుమతులను గెలుచుకున్నారు. మరో ముగ్గురు ప్రోత్సాహక బహుమతులు గెలుచుకున్నారు.జూనియర్స్ విభాగంలో ఐదో తరగతి చెందిన ఎం మాధవి ప్రథమ, నాలుగో తరగతికి చెందిన శిరీష ద్వితీయ,మూడో తరగతి చెందిన వర్షిత తృతీయ, మరో ఇద్దరు ప్రోత్సాహక బహుమతులు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం డి విప్లవ జ్యోతి రొటేరియన్స్ డివి పున్నారావు, పి అచ్యుత్, కె ఆంజనేయులు, షేక్ జిలాని మాలిక్, కె రాజేశ్వరి, నాంచారమ్మ, నాగేశ్వరావు,నర్సి రెడ్డి పాల్గొన్నారు.

## సుపరిపాలనలో తొలిఅడుగు: ఉత్తమ కార్యకర్తలకు ప్రతిభా పత్రాలు అందజేత

సత్తెనపల్లి, జనవరి 3, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం రఘురామ్ నగర్ ప్రజావేదిక నందు సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమ నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్ల ( ఉత్తమ కార్యకర్త )సేవలకు గుర్తింపుగా 84మంది కార్యకర్తలకు నాయకులకు ప్రతిభా



పత్రాలు పంపిణి కార్యక్రమం లో పాల్గొన్న శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ ,మరియు నియోజకవర్గ పరిశీలకులు తాతా జయప్రకాశ్ నారాయణ. దేశంలో క్రమశిక్షణ అంకితభావం కలిగిన శ్రేణులు తెలుగుదేశం పార్టీ సొంతం ఐకమత్యంగా పనిచేసి నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలబెడదాం అని అన్నారు. స్థానిక సంస్థాగత ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. అత్యధిక కార్యకర్తలు ఉన్న పార్టీ తెలుగుదేశం పార్టీ 100 రూపాయల సభ్యత్వంతో ఐదు లక్షల బీమా సౌకర్యాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , మంత్రి ,నారా లోకేష్ ,కల్పించారన్నారు. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి అంకితభావంతో కృషి చేస్తున్న కార్యకర్తల కృషిని శాసన సభ్యులు కన్నా గారు ప్రశంసించారు. మీరు ఇదే ఉత్సాహంతో నిరంతరం ప్రజాసేవలో ముందుండి, మరెందరికో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అమరావతి రాజధాని రావటంతో మన భూముల విలువలు పెరిగాయి గత ప్రభుత్వంలో రాజధాని ఎక్కడ అంటే పేరు చెప్పే పరిస్థితి కూడా లేదు దేశంలో ఎక్కడా లేనటువంటి సంక్షేమ పథకాలు కూటమి ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నీ నెరవేరుస్తున్నామని తెలిపారు. వివిధ హోదాలో ఉన్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ, పట్టణ, మండల, వార్డు, గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## చందనం అలంకరణతో వడ్డవల్లి శ్రీవారు



సత్తెనపల్లి, జనవరి 3, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలో కూరగాయల మార్కెట్ వద్ద వున్న శ్రీ రామాలయం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం లో శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ధనుర్మాసంలో భాగంగా ప్రత్యేక శనివారం స్వామి వారికి ఇష్టమైన రోజు 19వ వరోజు చందనంతో అలంకరణ చేశారు.. స్వామివారిని చూసేందుకు భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు సేకరించారు.. ఈ కార్యక్రమంలో ఆలయం కమిటీ సభ్యులు మహిళలు భక్తులు పాల్గొన్నారు

## సత్తెనపల్లి సబ్‌జైలును సందర్శించిన జడ్జి విజయ్ కుమార్ రెడ్డి

సత్తెనపల్లి, జనవరి 3, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా, సత్తెనపల్లి పట్టణంలోని సబ్ జైలు ను సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ మరియు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్ )సత్తెనపల్లి వి.



విజయ్ కుమార్ రెడ్డి శనివారం సాయంత్రం సందర్శించారు. ముందుగా అక్కడ పరిసరాలను పరిశీలించారు. ముద్దాయిలకు అందుతున్న ఆహారం, సౌఖర్యాలు గురించి అడిగి తెలుసుకొన్నారు. ముద్దాల కేసు వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్ జీవితం సత్ ప్రవర్తన తో నేర రహిత జీవితాన్ని గడపాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి తోపాటు లీగల్ ఎయిడ్ కౌన్సిల్ బి. ఎల్. కోటేశ్వరరావు సబ్ జైలు సూపర్నెంట్ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక యజ్ఞ క్రతువులు

వినుకొండ,జనవరి3,ప్రభాతవార్త: వినుకొండ పట్టణ అభివృద్ధి,లోకకళ్యాణార్థం స్థానిక కొండ మెట్ల బజారులోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని విశ్వమాత గోసమ్మరక్షణ ఆశ్రమం నందు ఆలయ ప్రధాన సేవకులు జాజుల మాల్యాద్రి ఆధ్వర్యంలో 11 మంది దంపతులతో సామూహికంగా శ్రీ రాజ్యశ్యామల దేవి అమ్మవారి యజ్ఞమును దిగ్విజయంగా జరిపించారు. ఆయన మాట్లాడుతూ ఆలయ కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందించిన దాతలు,కుటుంబాలకు స్వామివారి



ఆశీస్సులు,అమ్మవారి దీవెనలు ఉండాలని అదేవిధంగా చీఫ్‌విప్ జీ.వీ ఆధ్వర్యంలో వినుకొండ పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి నిరాటకంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ యజ్ఞం చేయడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా సేవకులు ఏటుకూరి కృష్ణవేణి,రాఘవమ్మ,సుజాత,బదిక నరసింహారావు,పిచ్చయ్య,తారక్ రాము,వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## 30ఏళ్ళుగా రాజకీయాలకు అతీతంగా శివశక్తి ఫౌండేషన్ సేవాకార్యక్రమాలు: చీఫ్‌విప్ జీ.వీ

వినుకొండ,జనవరి3,ప్రభాతవార్త: శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లు పంపిణీ కార్యక్రమం పట్టణంలోని ఫౌండేషన్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు.



ముఖ్యఅతిథులుగా ఫౌండేషన్ స్థాపకులు,చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు,డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు పాల్గొని ఆటో డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్సులు అందజేశారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ పేద,బడుగు,బలహీన వర్గాలకు సేవా చేయాలనే సంకల్పంతో శివశక్తి ఫౌండేషన్ స్థాపించి 30ఏళ్ళుగా రాజకీయాలు అతీతంగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. ఆటో డ్రైవర్లకు,కార్మికులకు ఫౌండేషన్ అన్ని వేళలా అండగా ఉంటుందన్నారు. ఇప్పటికే వేలాదిమంది డ్రైవర్లకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు మంజూరు చేయించడం జరిగిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలకు మేలు జరిగేలా ప్రభుత్వ సంక్షేమ పథకాలు,సబ్సిడీలను అందిస్తుందని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో జిడిసిసిబి ఛైర్మన్ మక్కెన,కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ

వినుకొండ,జనవరి3,ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీసర్వే ప్రక్రియలో భాగంగా వినుకొండ మండలం నీలగంగవరం గ్రామంలో పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ప్రభుత్వ చీఫ్‌విప్,స్థానిక ఎమ్మెల్యే



జీ.వీ ఆంజనేయులు,జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా,ఆర్డీవో మధులత,డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు హాజరయ్యారు. రీసర్వే పూర్తయిన రైతులకు,ప్రజల ఆస్తులకు సంబంధించి ప్రభుత్వ రాజముద్రతో కూడిన కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలను లబ్ధిదారులకు వారు స్వయంగా పంపిణీ చేశారు. జీ.వీ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన రీసర్వే ద్వారా భూ వివాదాలు తొలగిపోయి రైతులకు తమ భూములపై పూర్తి హక్కులు లభిస్తాయని తెలిపారు. ప్రభుత్వ రాజముద్రతో జారీ చేసిన ఈ పాస్ పుస్తకాలు రైతులకు కొండంత అండగా ఉంటాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన,జనసేన నాయకులు నాగశ్రీను రాయల్ నిశంకర శ్రీనివాసరావు,రెవెన్యూ అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గంగినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలకు కుర్చీలు అందజేత

వినుకొండ,జనవరి3,ప్రభాతవార్త: గంగినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్నెస్పీ కాలనీలోని జెడ్పి పాఠశాలకు 14వేల రూపాయల విలువ చేసే 20 కుర్చీలను పౌండేషన్ వ్యవస్థాపకులు,త్రిపురాపురం



డీసీ ఛైర్మన్ అయిన గంగినేని రాఘవరావు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా రాఘవరావు మాట్లాడుతూ పాఠశాల నూతనంగా హై స్కూల్ అయినందున మౌళిక వసతుల కొరత ఉందని పాఠశాల ఉపాధ్యాయులు తన దృష్టికి తీసుకురావడంతో తనవంతు సహాయంగా కుర్చీలు అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. స్కూల్ హెచ్‌ఎం వీరప్పయ్య,ప్రైమరీపాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.పద్మజ,పాఠశాల పీడీ రాధాకృష్ణమూర్తి,ఎలీషా, ఎలిజిబెత్ రాణి ,రాంబాబు,చంద్రశేఖర్,శాంతి, మల్లయ్య,గోవిందనాయక్,రామాంజనేయులు, కోటిరత్నం,గాయత్రిలు,ఉర్దూ హై స్కూల్ పీడీ వీరాంజనేయులు పాల్గొన్నారు

## చింతలచెరువులో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల అందజేత

నూజెండ్ల,జనవరి3,ప్రభాతవార్త: మండలంలోని చింతలచెరువు గ్రామంలో మీభూమి,మీహక్కు రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. మండల తహశీల్దార్ రమేష్‌కుమార్ పాల్గొని రైతులకు పాస్‌పుస్తకాలు అంద జేశారు. కార్యక్రమంలో రెవి న్యూ అధికారులు, సిబ్బంది, మండల నాయకులు పాల్గొన్నారు.



## అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవాలి : సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల



**రేపల్లె, జనవరి 3, ప్రభాతవార్త:** ఈ నెల 14వ తేదీ జరిగే నేషనల్ లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవాలని రేపల్లె సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల అన్నారు. శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పోలీసులతో సమావేశం నిర్వహించారు. అదాలతను దృష్టిలో ఉంచుకుని పరిష్కరించాల్సిన కేసులను సిద్ధం చేయాలని ఆమె సూచించారు. కక్షిదారులకు న్యాయాన్ని చేకూర్చాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. లోక్ అదాలతల నిర్వహణ ఉద్దేశ్యాన్ని పరిగణలోకి తీసుకోవాలని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో రేపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గరికపాటి వెంకట గిరిధర్, రేపల్లె ఎస్ఐ రాజశేఖర్, చెరుకుపల్లి ఎస్ఐ అనిల్ కుమార్, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లా వార్త



## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**కర్లపాలెం, జనవరి03, ప్రభాతవార్త:** కర్లపాలెం మండలం పేరలి గ్రామ తీర ప్రాంతంలో గుర్తుతెలియని 35 సంవత్సరాలు వయస్సు కలిగిన మగ వ్యక్తి శవం సముద్రంలో నుండి కొట్టుకొని ఒడ్డుకి వచ్చినట్లు కర్లపాలెం ఎస్సై రవీంద్ర తెలిపారు. మృతుడు తెలుపు రంగు హాఫ్ హాండ్స్ చొక్కా నలుపు రంగు ప్యాంటు బెల్ట్ ధరించి ఉన్నాడు. మృతుడిని ఎవరైనా గుర్తించిన ఎడలా కర్లపాలెం ఎస్ఐ కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. కర్లపాలెం ఎస్ఐ 9440900870 నెంబర్ కి తెలియజేయాలి అని కోరారు



## ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుపై మంత్రి అనగానికి వినతి

రేపల్లె, జనవరి 3, ప్రభాతవార్త: రెవెన్యూ డివిజనల్ కేంద్రమైన రేపల్లెలో మోటారు వాహనాల తనిఖీ అధికారి కార్యాలయం, విద్యుత్ డివిజనల్ కార్యాలయం ఏర్పాటు చేయించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు శనివారం రేపల్లె పట్టణాభివృద్ధి సంఘం కార్యదర్శి సి.వి.మోహనరావు వినతిపత్రం సమర్పించారు. బాపట్ల జిల్లాలోని చీరాల, బాపట్ల రెవెన్యూ డివిజనల్ కేంద్రాలలో మోటారు వాహనాల తనిఖీ, విద్యుత్ డివిజనల్ కార్యాలయాలు ఏర్పడినప్పటికీ రేపల్లె రెవెన్యూ డివిజనల్ కేంద్రంలో ఆ శాఖల కార్యాలయాలు ఏర్పాటు చేయనందున ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మోహనరావు తెలిపారు. జిల్లా కేంద్రమైన బాపట్లకు వెళ్ళాలంటే 70 కి.మీ నుండి 100 కి.మీ దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రేపల్లె మండలంలోని లంకెవానిదిబ్బ నుండి, కొల్లూరు మండలంలోని లంక గ్రామాల నుండి నేరుగా రవాణా సౌకర్యాలు లేనందున వ్యయప్రయాసలకు ప్రజలు గురవుతున్నారని మంత్రి అనగాని దృష్టికి తీసుకువచ్చారు. ఈ ప్రాంతాల నుంచి బస్సు మారుతూ ప్రయాణించాలంటే మూడు, నాలుగు గంటల సమయం పడుతున్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రేపల్లె రెవెన్యూ డివిజనల్ పరిధిలో 10 వేల మోటారు వాహనాలు ఉన్నాయని ఫిట్నెస్, సర్టిఫికెట్, వాహన వెరిఫికేషన్, ఎల్ఎల్ఆర్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం బాపట్లకు వెళ్ళాల్సి వస్తున్నదన్నారు. అదే మోటారు వాహనాల తనిఖీ కార్యాలయం రేపల్లెలో ఏర్పాటు చేస్తే వాహనదారులకు సమస్యలు ఉండవని మోహనరావు వెల్లడించారు. విద్యుత్ డివిజనల్ కార్యాలయం ఏర్పాటు చేస్తే వినియోగదారులకు ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన సూచించారు.



## రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు ప్రతి మండలం, రెవిన్యూ డివిజన్ లలో నిర్వహిస్తున్నాం

### జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

**బావట్ల, జనవరి03, ప్రభాతవార్త:** రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు ప్రతి మండలం, రెవిన్యూ డివిజన్ లలో నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లాలోని రైతులు తమ భూమి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. రైతులు తమ సమస్యలపై సంబంధిత తహసిల్దార్, రెవెన్యూ డివిజన్, కలెక్టర్ కార్యాలయాల వద్ద పరిష్కారం పొందవచ్చన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి మీరు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలన్నింటిని పరిష్కరించుకోవాలన్నారు. తహసిల్దార్ కార్యాలయంలో పొందే సేవలకు ప్రభుత్వం నిర్దేశించిన నామమాత్రపు రుసుము కేవలం రూ.40 నుంచి రూ.100లు చెల్లించి తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. అలాగే రెవిన్యూ డివిజన్ అధికారి కార్యాలయాల్లో పొందే సేవలపై ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి కేవలం రూ.40 నుంచి రూ.100లు రుసుము చెల్లించి తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఇదే పద్ధతిలో రెవెన్యూ క్లినిక్ ద్వారా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పొందే సేవలపై కలెక్టరేట్ కు వెళ్లి కేవలం రూ.40 నుంచి రూ.100లు నామ మాత్రము రుసుము చెల్లించి తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



# షార్ట్‌సర్క్యూట్‌తో బోటు దగ్ధం

**నిజాంపట్నం, జనవరి 3, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన నిజాంపట్నం హార్బర్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా బోటు అగ్నికి ఆహుతైన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే నిజాంపట్నం హార్బర్ నుంచి



సముద్రంలోకి వేటకు వెళ్ళేందుకు బోట్లు సన్నదం అవుతున్నాయి. ఈ నేపద్యంలో బోటు ఓనర్స్ తమ బోట్లకు డీజిల్ ఆయిల్‌ను కొట్టించుకున్నారు. వారిలో ఎస్ గోవిందు తన బోటును సముద్రంలో వేటకు పంపేందుకు డీజిల్ ఆయిల్‌ను నింపుకుని వేటకు బయలుదేరుతున్న క్రమంలో బోటులో పనిచేస్తున్న కళాసి కె కొండలు ఇంజన్ స్టార్ట్ చేయటానికి హ్యాండిల్ వేశాడు. అదే సమయంలో షార్ట్ సర్క్యూట్ కావటంతో మంటలు చెలరేగాయి. బోటులో సుమారు 2వేల లీటర్ల డీజిల్ ఉండటంతో మంటలు వెంటనే వ్యాపించి బోటుకు అంటుకున్నాయి. ఇంజన్ స్టార్ట్ చేసిన కొండల మంటల్లో చిక్కుకున్నాడు. ఇది గమనించిన తోటి కళాసీలు వెంటనే కొండలును బయటకు తీసుకువచ్చి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రక్కనే ఉన్న బోట్లకు నిప్పు వ్యాపించకుండా బోటును కొంచం దూరం నెట్టటమే కాకుండా సమీప బోట్ల యజమానులు తమ బోటులోని ఇంజన్ సాయంతో మంటలలో కాలిపోతున్న బోటులో మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తూ విషయాన్ని అగ్నిమాపక శాఖకు తెలియజేశారు. జరిగిన విషయం తెలుసుకున్న సీనియర్ నాయకుడు మోపిదేవి హరనాధ్, బోటు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోపిదేవి శ్రీనివాసరావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మిడి రామకృష్ణలు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. తహశీల్దార్ ఎం శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని ఎలా జరిగిందో విషయాన్ని బాధితుడిని అడిగి తెలుసుకున్నారు. జడ్పిటిసి సభ్యుడు నర్రా సుబ్బయ్య , మత్స్యశాఖ జెడి శ్రీనివాసనాయక్, డిడి గాలిదేవుడు, నిజాంపట్నం పిఎసిఎస్ అధ్యక్షుడు నరేష్, గంగరాజు తదితరులు నిజాంపట్నం హార్బర్ చేరుకుని బాధితుడిని పరామర్శించారు.

## బ్లాక్ స్పాట్‌లను సరిచేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చు

**బాపట్ల, జనవరి03, ప్రభాతవార్త:** గుర్తించిన బ్లాక్ స్పాట్ లను సరిచెయ్యడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించ వచ్చని జిల్లా రవాణా శాఖ అధికారి టి. కె. పరంధామ రెడ్డి అన్నారు. స్థానిక జిల్లా రవాణా శాఖ కార్యాలయం లో రోడ్డు ఇంజినీరింగ్ అధికారులు, మరియు పోలీస్ శాఖల లతో పరంధామరెడ్డి శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో 50 శాతం గుర్తించిన బ్లాక్ స్పాట్ల వద్ద జరుగుతున్నాయని బ్లాక్ స్పాట్లను సరిచెయ్యడం లో ఇంజనీరింగ్ శాఖలు సహకరించాలన్నారు. బ్లాక్ స్పాట్ల ను సరిచెయ్యడంతో పాటు వాహనాల వేగాన్ని నియంత్రించడానికి తీసికొనవలసిన చర్యలపై చర్చించారు. సమావేశం అనంతరం రవాణా శాఖ అధికారులు, రోడ్డు ఇంజనీరింగ్ అధికారులు మరియు పోలీస్ అధికారులు కలిసి బ్లాక్ స్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు డి.



బి. వి. రంగా రావు , ఎన్.ప్రసన్న కుమారి, ఆర్ అండ్ బి జిల్లా ఇంజనీరింగ్ ఆఫీసర్ ఎం.నళిని, పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.వసంత కుమార్, వేదుళ్లపల్లి ఎస్ఐ భాగ్య రాజు, డి.టి.ఆర్.బి ఎ.ఎస్.ఐ. కె. వివేక్ కుమార్ ఎన్.హెచ్ 216 రెసిడెంట్ ఇంజనీర్ సౌరభ్ సింగ్, ఎన్. హెచ్. 16 రూట్ మేనేజర్ రాకేష్ గౌడ్, మరియు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏ. నరేంద్ర కుమార్ పాల్గొన్నారు.

# కళాశాలలో ర్యాగింగ్ కు పాల్పడితే కఠిన చర్యలు

**పిట్టలవానిపాలెం, జనవరి03, ప్రభాతవార్త:** విద్యార్థులు కళాశాలలో ర్యాగింగ్ కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడంజరుగుతుందని, విద్యార్థులు



డ్రగ్స్ వంటి చేడువ్యాసనాలకు దూరంగా ఉండాలని బాపట్ల రూరల్ సర్కిల్ సిఐ హరికృష్ణ తెలిపారు. మండలపరిధిలోని గోకరాజు నల్లి బోయిన వారిపాలెం లో ఉన్న కేర్ నేచురోపతి కళాశాలలో సర్కిల్ సిఐ హరికృష్ణ , చందోలు ఎస్సై ఎం వెంకట శివకుమార్ లు శనివారం విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్, డ్రగ్స్ మరియు సైబర్ నేరాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా బాపట్ల రూరల్ సర్కిల్ సిఐ హరికృష్ణ మాట్లాడుతూ కళాశాలలో ర్యాగింగ్ కు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విద్యార్థులు డ్రగ్స్ వంటి చేడువ్యాసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. రోజురోజుకు పెరుగుతున్నటువంటి సైబర్ నేరాల నేపథ్యంలో విద్యార్థులకు సోషల్ మీడియా లో ఫేస్‌బుక్, ఇంస్టాగ్రామ్ లలో వచ్చే ఫేక్ న్యూస్ లతో అప్రమత్తంగా ఉండాలన్నారు. నేటి యువత సైబర్ నేరలపట్ల అవగాహనా కలిగి జాగ్రత్తగా మెలగాలన్నారు. శక్తి యాప్ గురించి వివరిస్తూ శక్తి యాప్ అత్యవసర సమయంలో మహిళలకు తక్షణ సహాయం పొందేందుకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈవ్ టీజింగ్, బాల్య వివాహాలును అరికట్టే విధంగా ఈయాప్ ఉపయోగపడుతుందన్నారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి తెలియజేస్తూ ఆవిధంగా మనల్ని ఎవరైనా ఇబ్బంది పెడితే వెంటనే మన తల్లిదండ్రులకు గాని, మీరు చదువుకునే పాఠశాల గురువులకు గాని తెలియచేయాలన్నారు. విద్యార్థులకు సమస్య వచ్చినప్పుడు హెల్ప్ లైన్ నెంబర్లు 100, 112 ఈ నంబర్లకు కాల్ చేసిన ఎడల వెంటనే చట్టపరమైనటువంటి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమం లో పోలీస్ సిబ్బంది మరియు కేర్ నేచురోపతి కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రమాదాలు జరగకుండా బస్సులను నడపాలి : సిఐ మల్లికార్జునరావు

**రేపల్లె, జనవరి 3, ప్రభాతవార్త:** నియమ నిబంధనల ప్రకారం ఆర్టీసీ బస్సులను డ్రైవర్లు నడిపితే ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోవని రేపల్లె



పట్టణ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మల్లికార్జునరావు చెప్పారు. శనివారం రేపల్లె ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రయాణీకుల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సజావుగా బస్సులను నడపాలన్నారు. రహదారి భద్రత నియమాలు పాటించాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రకారం వాహనాలను నడపాలని, వేగ పరిమితికి లోబడి నడపాలని ఆయన సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ బస్సులను నడపరాదని ఆయన చెప్పారు. డ్రైవర్లు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని మల్లికార్జునరావు కోరారు. రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా ప్రజలు అవగాహన కలిగిఉండాలన్నారు. ఈ సమావేశంలో రేపల్లె ఆర్టీసీ డిపో మేనేజరు రమణ, గ్యారేజీ ఇన్‌ఛార్జి శ్రీనివాస్, ట్రాఫిక్ సూపర్ వైజర్ నాగేశ్వరరావు, ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణీకులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి సేవలు చిరస్మరణీయం

**భట్టి ప్రోలు(రేపల్లె), జనవరి 3, ప్రభాతవార్త:** భారత దేశంలో స్త్రీల విద్యా హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు, గొప్ప సంఘ సంస్కర్త సావిత్రిబాయి ఫూలే సేవలు చిరస్మరణీయమని ఎంపిపి డి.వెంకట లలిత కుమారి అన్నారు. శనివారం



భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపిపి లలిత కుమారి మాట్లాడుతూ పురుషులకే పరిమితమైన చదువును మహిళలకు వర్తించే విధంగా సావిత్రిబాయి పూలే పాఠశాలలను ఏర్పాటు చేసిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఎస్.వెంకటరమణ, కార్యాలయ ఎఓ సిహెచ్.జలజ, పంచాయతీ రాజ్ ఎఈ సేతు రామచంద్రరావు, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## గోవాడ శ్రీబాల కోటేశ్వర స్వామివారి ఆలయా నికి రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక స్థానం ఉంది

### ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

**చెరుకుపల్లి, అమర్తలూరు జనవరి 3, ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా పేరుగాంచిన ఆలయాల్లో గోవాడ శ్రీ బాల కోటేశ్వర స్వామి వారి దేవాలయం కూడా ప్రత్యేక స్థానం కలిగి ఉందని వేమూరు నియోజకవర్గం శాసనసభ్యులు నక్కా ఆనందబాబు అన్నారు. శనివారం ఆలయంలో ఆలయ పాలకవర్గం నూతన సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ఆలయ అధికారి ఎంవీఎస్ వర్మ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నాక్కా ఆనందబాబు మాట్లాడుతూ తాను చిన్నప్పటినుండి ఈ ఆలయాన్ని దర్శించుకుంటున్నానని ఆలయం ఆలయ ప్రధాన అర్చకుడు స్వర్ణ వెంకట శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలోదినదినాభివృద్ధి చెందిందన్నారు. ఆలయంలో ప్రస్తుత అర్చకులు నిత్య పూజా కార్యక్రమాలు నిర్విరామంగా చేస్తుండటం మరింత వైభవాన్ని పెంచిందన్నారు. ఈ సందర్భంగా ఆలయ పాలకవర్గ చైర్మన్గా ఎన్నికైన పావులూరి రమేష్, 11



మంది డైరెక్టర్లతో కలిపి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఈవో వర్మతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ అభివృద్ధికి మరింతగా కృషి చేయాలని రాబోవు మహాశివరాత్రి ఏర్పాట్లను ఇప్పటినుండే పూర్తి స్థాయిలో చేపట్టాలని సూచించారు. బాపట్ల పార్లమెంటరీ నియోజకవర్గ ఆర్గనైజరీ సెక్రటరీగా ఎంపికైన మల్లాది రామకృష్ణ, కార్యాలయం సెక్రటరీగా ఎంపికైన ఆరేపల్లి నాగ పార్వతి, డీసీ చైర్మన్ ఎంఆర్కె మూర్తి, రాష్ట్ర నాయకులు దివి రాంబాబు, సొంటి సుబ్బయ్య,, జనసేన నాయకులు మొఖమాటం పృథ్వీ లు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబును మర్యాదపూర్వకంగా కలిసి దుశాలువాలు పూలమాలలతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆలయ పాలకవర్గ సభ్యులు తమ ఎంపికకు కృషి చేసిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కు, మండల ప్రజాప్రతినిధులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షులు రావూరి ఆంజనేయులు, మొఖమాటం శ్రీనివాసరావు , గ్రామ సర్పంచ్ మండవ విజయలక్ష్మి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గొట్టిపాటి పూర్ణకుమారి, మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి రవీంద్ర, ఆలయ అర్చకులు చావలి శ్రీధర్ శర్మ, మల్లెల కృష్ణమూర్తి, రెండు మండలాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు,

## మహిళా సాధికారతకు సావిత్రిబాయి పూలే పునాది వంటిది

**కర్లపాలెం, జనవరి03, ప్రభాతవార్త:** సావిత్రిబాయి పూలే మహిళా సాధికారతకు పునాది వంటిదని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఇనకొల్లు పోలీసు రావు అన్నారు. శనివారం సావిత్రిబాయి పూలే 195వ



జయంతి వేడుకలను కర్లపాలెం మోడల్ ప్రైమరీ స్కూల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసురావు మాట్లాడుతూ సావిత్రి పూలే మొదటి మహిళా ఉపాధ్యాయురాలని, భారతదేశంలో తొలి బాలిక పాఠశాలను స్థాపించిన ఘనత ఆమెది అన్నారు. అలనాటి సమాజంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని నిలబడిన మహిళా మహారాణి సావిత్రిబాయి పూలే అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు కొమ్ము విమలమ్మ, డిఎల్ ప్రసన్నలక్ష్మి, బి రాజేష్, దీన మనోజ్, శారద, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.


## శాస్త్రోక్తంగా శివముక్కోటి పూజలు

**భట్టి ప్రోలు(రేపల్లె), జనవరి 3, ప్రభాతవార్త:** శివ ముక్కోటి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం భట్టిప్రోలులోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నగరాజస్వామి, శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి, శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ హేమ విఠలేశ్వర స్వామి, శ్రీ బాలకోటేశ్వర స్వామి దేవాలయం, అద్దేపల్లిలోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవాలయాలలో శివ ముక్కోటి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూనుగుంట్ల సాయిబాబా, కె.శంకరరావు, కె.లక్ష్మీకాంతారావు, ఎం.రామ్ ప్రకాష్, కరుణ శ్రీనివాసరావు, సువర్ణాచారి, కె.పానకాలరావు తదితరులు పాల్గొన్నారు.



## శివముక్కోటి సందర్భముగా శివాలయంలో ఉత్తర ద్వార దర్శనం

**తెనాలి టౌన్ జనవరి3(ప్రభాతవార్త):** పట్టణంలోని గంగా నమ్మపేటలో వేంచేసిన శ్రీ పర్వత వర్ధిని శ్రీ రామేశ్వర స్వామి దేవాలయంలో శివ ముక్కోటి సందర్భముగా శనివారం శ్రీ స్వామి వారు ఉత్తర ద్వారా దర్శనం గుండా భక్తులకు దర్శన మిచ్చారు. ఉదయం 5 గంటలకు ప్రారంభమైన ఉత్తర ద్వారా దర్శనాన్ని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని స్వామివారికి విశేష పూజలు, ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని పురవీధుల్లో శ్రీ స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. తదుపరి భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రమణకుమారి మాట్లాడుతూ శివ ముక్కోటి సందర్భముగా పెద్ద ఎత్తున విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు మరియు త్వరితగతిన దర్శన ఏర్పాట్లు చేశామని తెలిపారు.



## ఎల్వీ ప్రసాద్ ఉచిత నేత్ర వైద్య సేవలు అభినందనీయం : ఎంఆర్కే మూర్తి

**చెరుకుపల్లి, జనవరి 3 ,ప్రభాతవార్త :** ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఉచితంగా వైద్య సేవలను అందించడం ఎంతో అభినందనీయమని చెరుకుపల్లి




అమర్తలూరు మండలాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఎం ఆర్ కె మూర్తి అన్నారు. స్థానిక ఆశా వర్కర్ హసీనా, కాలనీవాసి ఉప్పల పాటి వెంకట సుబ్బయ్య ఆధ్వర్యం లో నిర్వహించిన ఉచిత సామాజిక నేత్ర పరీక్ష వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఆర్కే మాట్లాడుతూ ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలు సమాజంలోని పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ప్రజలు కూడా ఇటువంటి ఉచిత వైద్య అవకాశాలను సద్వినియోగం చేసుకొని కంటి వైద్య సేవలను పొందాలని సూచించారు. శిబిరంలో 55 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 14 మంది కంటి ఆపరేషన్లకు అర్హులైన వారిగా గుర్తించినట్లు టెక్నీషియన్ ఉల్లంగుంట మాధవి తెలిపారు. వీరికి ఈనెల 5వ తేదీన గూడవల్లి లోని ఎల్వీ ప్రసాద్ వైద్యశాలలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు సిబ్బంది తెలిపారు. శివరంలో సిబ్బంది దామర్ల సరళ ,



కౌతరపు పవన్ కుమార్, లక్ష్మీ చరణ్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## విప్లవాత్మాక మహిళ సావిత్రిబాయిపూలే : మాజీ ఎమ్మెల్యే

**తెనాలి మున్సిపాలిటీ జనవరి3 (ప్రభాతవార్త):** పట్టణంలోని గంగానమ్మపేటలో ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆధునిక సంఘసంస్కర్త, విప్లవాత్మక మహిళగా గుర్తింపు ఉన్న హక్కుల కోసం, మహిళా అభివృద్ధి కోసం, సావిత్రిబాయి పూలే నిరంతరం అలుపెరగకుండా పోరాడారని, ఆమె జీవితం అనాధలు, వితంతువులు, రోగుల సేవలోనే తరించిందని, సమాజంలో అట్టడుగు వర్గాల



సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలతో కలిసి సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం మాజీ శాసన సభ్యులు అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ, అట్టడుగు వర్గాల జీవితాల్లో ప్రత్యక్షంగా సంస్కరణలు తీసుకొచ్చిన తొలి వ్యక్తిగా సావిత్రిబాయి పూలే నిలిచిపోతారని, తీవ్రమైన సామాజిక వ్యతిరేకత అవమానాలు ఎదురైన, బాలికల విద్య కోసం ధైర్యంగా ముందుకు సాగిన దీరవనిత సావిత్రిబాయి పూలే అని పేర్కొన్నారు.

## బాల్య వివాహాలు చేయటం చట్టరీత్యా నేరం

### సూపర్‌వైజర్ రజని


**కొల్లూరు, జనవరి 3 (ప్రభాతవార్త) :** బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని కొల్లూరు 4 అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించనున్నట్లు సూపర్‌వైజర్ సిహెచ్ రజని తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగటం వలన శారీరకంగా మానసికంగా ఎదుగుదల ఉండదన్నారు. చట్ట ప్రకారం బాల్య వివాహం చేయటం నేరమని, చేసుకున్న




వారు దానికి సహకరించిన వారు శిక్ష అర్హులు అవుతారన్నారు. ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగు అన్నారు. ఆడపిల్లల్ని చదివించటం వలన భవిష్యత్తులో తన కాళ్ళ మీద వారు నిలబడతారన్నారు. బాల్య వివాహాలు జరగకుండా ముందు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, రత్నకుమారి, మాధవి, మాలతి, ఏఎన్ఎం పద్మని, ఎమ్ఎల్‌హెచ్‌పి జ్యోతి, ఆశ కార్యకర్త ధనమని, ఎం.సుజాత, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## నేడు ఎరువుల గోడౌన్ ప్రారంభం

**భట్టిప్రోలు(రేపల్లె), జనవరి 3, ప్రభాతవార్త:** భట్టిప్రోలు వ్యవసాయ మార్కెట్ యార్డు గోడౌన్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఎరువుల గోడౌన్ ప్రారంభిస్తారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శితూనుగుంట్ల సాయిబాబా శనివారం తెలిపారు. జిల్లా సహకార మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువుల పంపిణీ డిపో ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ డిపో వలన రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, కూటమి నాయకులు, మండల పరిధిలోని రైతులు పాల్గొనాలని తూనుగుంట్ల సాయిబాబా కోరారు.



# పేలుళ్లతో దద్దరిల్లిన వెనిజులా

## ఎమర్జెన్సీ విధింపు

**కారకాస్, జనవరి 3:** వెనుజులా బాంబు పేలుళ్లతో దద్దరిల్లింది. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కట్టడి పేరిట అగ్రరాజ్యం అమెరికా ఈ దాడులకు దిగింది. రాజధాని కరాకస్‌లో శనివారం తెల్ల వారుజామున ఏడు చోట్ల భారీ పేలుళ్లు సంభవించాయి. దీంతో దేశంలో అత్యయిక పరిస్థితి విధించాల్సిన పరిస్థితి తలెత్తింది. ట్రంప్ ఆదేశాలతోనే తమ సైన్యం ఈ దాడులు చేస్తోం దని అమెరికా ధ్రువీకరించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. సైనిక స్థావరాలు, పౌర నివాసాలే లక్ష్యంగా అమెరికా శనివారం దాడులకు పాల్పడినట్లు వెనుజులా వెల్లడించింది. దీంతో సైనిక స్థావరాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందని తెలిపింది. దాడులు జరిగిన ప్రదేశాల్లో పరిస్థితిని సమీక్షించడానికి చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. ఈ దాడులతో దేశంలో జాతీయ అత్యయిక పరిస్థితి విధిస్తున్నట్లు ఆ దేశాధ్యక్షుడు నికోలస్ మదురో ప్రకటించారు. ఈ దాడులకు వ్యతిరేకంగా వీధుల్లోకి రావాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

**అమెరికన్ ఎయిర్‌లైన్లకు నోటమ్**

ఈ దాడులకు ముందు అమెరికా విమానయాన సంస్థలకు యు ఎస్ ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ నోటమ్ జారీ చేసింది. అమెరికా విమానాలు వెనుజులా గగనతలాన్ని వినియోగించొద్దని హెచ్చరించింది. తాజా పరిణామాలపై కొలం బియా ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వెనుజులా ముఠాల నుంచి మాదక ద్రవ్యాలు అమెరికాను ముంచెత్తుతున్నాయని ట్రంప్ పలుమార్లు పేర్కొన్నారు. ఈ ముఠాలతో వెనుజులా అధ్యక్షుడు నికోలస్ మదురోకు కూడా సంబంధాలున్నాయని ఆరోపిస్తుండడంతో అక్కడి ప్రభుత్వాన్ని కూల్చడానికి ట్రంప్‌కార్యవర్గం ప్రణాళికలు రచిస్తున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. మరోవైపు ఇప్పటికే కరేబియన్ సముద్రంలో అమెరికా భారీగా బలగాలు, యుద్ధ నౌకలు, జలాంతర్గాములు, అత్యాధునిక ఫైటర్‌జెట్‌లను మోహరించింది.





**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నంత పనిచేశాడు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కట్టడి కోసం అవసరమైతే వెనిజులాపై సైనిక చర్యకు దిగుతామని ప్రకటించినట్లుగా దాడికి పాల్పడింది. వెనిజులా రాజధాని కరాకస్‌పై వైమానిక దాడులకు పాల్పడింది. దేశ వ్యాప్తంగా సైనిక స్థావరాలు లక్ష్యంగా విరుచుకుపడింది. అంతేగాక వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను, అతని భార్యను అమెరికా సైన్యం అదుపులోకి తీసుకుని తమ దేశానికి తరలించింది. ఈ విషయాన్ని యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ ధ్రువీకరించారు. మదురో తమ అదుపులో ఉన్నందున ఇక సైనిక దాడులు చేయబోమని స్పష్టం చేశారు. అంతకు ముందు అమెరికా వైమానిక దాడుల నేపథ్యంలో వెనిజులా ప్రభుత్వం దేశంలో అత్యయిక పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించింది. చమురు నిల్వల కోసమే దాడి చేశారని ఆరోపణలు గుప్పించింది. మదురోను అమెరికా సైన్యం బందీగా పట్టుకోవడంపై వెనిజులా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వారి ఆధారాలు ఇవ్వాలని అమెరికాకు విజ్ఞప్తి చేశారు. అటు రష్యా, అమెరికా చర్యను తీవ్రంగా తప్పుపట్టింది. ఇది సైనిక దురాక్రమణేనని ఆరోపించింది.**

**వెనుజులా అధ్యక్షుడు మదురో మా కస్టడీలోనే: ట్రంప్**: అమెరికా-వెనుజులా మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. యుఎస్ సైన్యం శనివారం తెల్లవారుజామున వెనుజులా రాజధాని కరాకస్‌పై భీకరదాడులు జరిపిన సంగతి తెలిసిందే. వాటిని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ధ్రువీకరించారు. అలాగే ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన సతీమణి తమ కస్టడీలో ఉన్నారని వెల్లడించారు. వారిద్దరిని వెనుజులా వెలుపలకు తరలించినట్లు వెల్లడించారు. దీనిపై అమెరికా కాలమానం ప్రకారం ఉదయం 11 గంటలకు మీడియా సమావేశం నిర్వహించనున్నామని తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ట్రంప్ పోస్టు చేశారు. అమెరికా సైన్యానికి చెందిన డెల్టా ఫోర్స్ ఈ ఆపరేషన్‌లో భాగమైంది.

**ఆధారాలు ఇవ్వండి : ఉపాధ్యక్షురాలు**

తమ అధ్యక్షుడిని అమెరికా కస్టడీలోకి తీసుకోవడంపై వెనుజులా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ స్పందించారు. మదురో, ఆయన సతీమణి ఇప్పుడు ఎక్కడున్నారో తమకు తెలియనదని చెప్పారు. వారు సజీవంగా ఉన్నారని తెలియజేసేలా ఆధారాలు ఇవ్వాలని అమెరికాను డిమాండ్ చేశారు. 1989 తర్వాత ఒక లాటిన్ అమెరికన్ దేశంలో అమెరికా నేరుగా జోక్యం చేసుకోవడం ఇదే తొలిసారి. ఈ పరిణామాల వేళ వెనుజులా పక్క దేశమైన కొలంబియా అప్రమత్తమైంది. ఆ దేశ సరిహద్దుల్లో బలగాలను మోహరించింది.

**ఇక సైనిక దాడులు చేయబోం: అమెరికా**

మదురో అమెరికా కస్టడీకి చిక్కడంతో వెనుజులాలో తమ సైనిక చర్య పూర్తయిందని యుఎస్ సెనెటర్ మైక్ లీ వెల్లడించారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోను ఉటంకిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కట్టడి పేరిట అమెరికా ఈ దాడులు చేసిన సంగతి తెలిసిందే. అయితే తమ చమురు కోసమే అమెరికా దాడులు చేయనుందని గతంలో వెనుజులా ఆరోపించిన విషయం తెలిసిందే. కాగా గతంలోనే తాను దేశాన్ని వీడేందుకు సిద్ధమని మదురో చెప్పినట్లు వార్తా కథనాలు వెలువడ్డాయి. తాను, తనకుటుంబంతో సహా దేశాన్ని వీడేందుకు సిద్ధంగా ఉన్నానని ఆయన పేర్కొన్నట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. అయితే తనకు, తన కుటుంబానికి ఆంక్షల నుంచి పూర్తి ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారని వారి సారాంశం. యుఎస్ విధించిన అన్ని ఆంక్షలను ఎత్తివేయడంతో పాటు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు నుంచి తాను ఎదుర్కొంటున్న కేసులను మూసివేయడం వంటి వాటి గురించి వాషింగ్టన్ వద్ద ప్రస్తావించినట్లు వెల్లడించాయి.




## బంగ్లాదేశ్‌లో మరో హిందూ వ్యాపారి హత్య

**ఢాకా,జనవరి 3:** బంగ్లాదేశ్‌లోని షరియత్‌పూర్ జిల్లా, క్యూర్‌బంగా బజార్‌లో మరో హిందూ వ్యక్తిపై దాడిచేసి హత్యచేసారు. రానురాను బంగ్లాదేశ్‌లో హిందూ మైనార్టీలపై దాడులు పెచ్చుమీరుతున్నాయి. సజీవదహనం చేయాలనిచూస్తే నిప్పంటుకున్న ఈ వ్యాపారి తప్పించుకుని చెరువులో దూకాడు. ఫార్మసీ నిర్వహిస్తున్న హిందూ వ్యాపారి ఖోకన్ చంద్ర దాస్, ఢాకాలోని నేషనల్ బర్న్ ఇన్‌స్టిట్యూట్‌లో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మరణించారు. ఖోకన్ చంద్ర దాస్‌పై కొందరు దుండగులు దాడి చేసి నిప్పంటించగా, వారి నుంచి తప్పించుకునేందుకు ఆయన చెరువులో దూకారు. పోలీసులు, స్థానికులు ఆయనను ఆసుపత్రిలో చేర్పించారు. చంద్రదాస్ క్యూర్‌బంగా బజార్‌లో ఔషధాలు, మొబైల్ బ్యాంకింగ్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. దుకాణం మూసి ఆటోలో ఇంటికి వెళుతుండగా, మార్గ మధ్యంలో కొందరు దుండగులు ఆటోను ఆపి, పదునైన ఆయుధాలతో ఆయనపై దాడి చేశారు. అనంతరం ఆయన తలపై పెట్రోల్ పోసి నిప్పంటించగా, వారి నుంచి తప్పించుకునేందుకు ఖోకన్ రోడ్డు పక్కనే ఉన్న చెరువులోకి దూకారు. స్థానికులు ఆయనను కాపాడి ఆసుపత్రికి తరలించారు. విద్యార్థి నాయకుడు ఉస్మాన్ హాదీ హత్యతో దేశంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో హిందువులపై హత్యాకాండా సాగుతోంది. ఇటీవల దీపూ చంద్ర దాస్ హత్య జరిగింది. ఆ తర్వాత సామ్రాట్ అనే వ్యక్తి గ్రామస్థుల మూకదాడిలో మృతి చెందాడు. అనంతరం బజేంద్ర బిశ్వాస్ అనే మరో వ్యక్తిని సహోద్యోగి కాల్చి చంపాడు. ఆ తర్వాత ఖోకన్‌పై దాడి జరిగింది.

## కెనడాలో వలసదారులకు 'వర్క్ పర్మిట్ల' ముప్పు
### సగం మంది భారతీయులే



**ఒట్టావా, జనవరి 3:** కెనడాలో లక్షల మంది వలసదారులు 'వర్క్ పర్మిట్ల' ముప్పును ఎదుర్కొంటున్నారు. 2025 డిసెంబరుతో దాదాపు 10లక్షల మంది పర్మిట్ల కాలపరిమితి తీరిపోగా 2026లో మరో 9లక్షల మందికి ఆ గడువు ముగియనుంది. దీంతో చట్టబద్ధత కలిగిన పత్రాలులేకుండా ఆ దేశంలో నివసించే వారి సంఖ్య అమాంతం పెరిగిపోయింది. వీరిలో సగం మంది భారతీయులే ఉన్నా రని తెలుస్తోంది. ఇమ్మిగ్రేషన్, రిఫ్యూజీస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా (ఐఆర్‌సిసి) డేటా ఆధారంగా ఈ మేరకు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. దీని వల్ల వలసదారులు మరో వీసా పొందలేరు లేదా, శాశ్వత నివాసం పొందేవరకైనా చట్టబద్ధంగా నివాసం ఉండే హోదానైనా పొందలేరు లేదా, శాశ్వత నివాసం పొందేవరకైనా చట్టబద్ధంగా నివాసం ఉండే హోదానైనా కోల్పోతారు. వలసలకు సంబంధించిన నిబంధనలను కెనడా కఠినతరం చేస్తూనే ఉంది. ఈ నేపథ్యంలో వీసా గానీ, శాశ్వత నివాసం పొందడం గానీ అంత సులభమేమీ కాదని తెలుస్తోంది.

## మెక్సికోలో భారీ భూకంపం: రెక్టార్ స్కేల్‌పై 6.5గా నమోదు

**మెక్సికో సిటీ, జనవరి 3:** మెక్సికోను భూకంపం వణికించింది. దక్షిణ-మధ్య మెక్సికో ప్రాంతాల్లో 6.5 తీవ్రతతో భారీ భూకంపం సంభవించింది. గెరెరో రాష్ట్రంలోని శాన్‌మార్కోస్‌కు సమీపంలోని అకాపుల్కో నగరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. దాదాపు 35 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. దీని వల్ల ఏకంగా 33 సెకండ్లపాటు భూమి కంపించింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. 50వరకు ఇళ్ల వరకు ధ్వంసమయ్యాయి. అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకారం.. ఉదయం 8 గంటల సమయంలో అకాపుల్కో సమీపంలో భూకంపం సంభవించింది. ఈ భూప్రకంపనలు ఉత్తర దిశగా సుమారు 400 కిమీ దూరంలో ఉన్న మెక్సికో సిటీ వరకు వ్యాపించింది. భూకంపం హెచ్చరికల సైరన్లు మోగడంతో లక్షలాది మంది ప్రజలు ఇళ్లు, ఆఫీసులనుంచి రోడ్లపైకి పరుగులు తీశారు. మెక్సికో సిటీలో జనాలు బయటకు పరుగులు తీస్తున్న క్రమంలో ఓ అపార్టుమెంట్‌లోని రెండో అంతస్తు నుంచి పడి 60 యేళ్ల వృద్ధుడు ప్రాణాలు కోల్పోయాడు. మరో 12 మంది గాయపడ్డారని నగర మేయర్ క్లారా బ్రుగాడా తెలిపారు. అలాగే భూకంప కేంద్రానికి సమీపంలోని ఓ గ్రామంలో ఇల్లు కూలడంతో 50 యేళ్ల మహిళ మృతి చెందిందని గెరెరో గరవ్నర్ ఎవలిన్ సాల్గోడో పేర్కొన్నారు.



## బీహార్‌లో రూ.20వేలకే అమ్మాయిలు పెళ్లికి రెడీ
### ఉత్తరాఖండ్ మంత్రి భర్త వివాదాస్పద వ్యాఖ్యలు

**డెహ్రాడూన్:** బీహార్‌లో రూ.20,000కే అమ్మాయిలు పెళ్లికి అందుబాటులో ఉన్నారని ఉత్తరాఖండ్‌కు చెందిన మహిళా మంత్రి భర్తచేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. ఆయన చేసిన వ్యాఖ్యల విడియో క్లిప్ వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో విమర్శలు వెల్లువెత్తాయి. ఉత్తరాఖండ్‌కు చెందిన బీజేపీ మంత్రి రేఖా ఆర్య ఆ రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రి. ఆమె భర్త గిరిధారి లాల్ సాహు, అల్మోరాలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. మీరు వృద్ధాప్యంలో పెళ్లి చేసుకుంటారా మీరు పెళ్లి చేసుకోలేకపోతే మీ కోసం బీహార్ నుంచి అమ్మాయిని తీసుకువస్తాం. రూ.20,000 నుంచి రూ.25,000కే అక్కడి నుంచి అమ్మాయిలను తెచ్చుకోవచ్చు అని అన్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో మహిళా, శిశు సంక్షేమ మంత్రి రేఖా ఆర్య భర్త గిరిధారి లాల్ సాహు వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తాయి. దేశంలోని మహిళలను ఆయన అవమానించారని ఉత్తరాఖండ్ కాంగ్రెస్ విమర్శించింది. అధికార బీజేపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. మరో వైపు బీహార్ మహిళా కమిషన్ కూడా దీనిపై స్పందించింది. ఆ రాష్ట్ర అమ్మాయిలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన గిరిధారి లాల్ సాహుకు నోటీస్ జారీ చేస్తామని పేర్కొంది. అయితే ఆయన వ్యాఖ్యలతో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని బీజేపీ తెలిపింది.

## బిజెపిని చూసి ఆర్‌ఎస్‌ఎస్‌ను అర్థంచేసుకోవాలనుకోడం పొరపాటే
### ఆర్‌ఎస్‌ఎస్‌-చీఫ్ మోహన్ భగవత్



**భోపాల్,జనవరి 3:**యూనిఫాం, శారీరక వ్యాయామాలు ఉన్నప్పటికీ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) పారామిలటరీ సంస్థ కాదని, బీజేపీని చూసి ఆర్‌ఎస్‌ఎస్‌ను అర్థం చేసుకోవాలనుకుంటే అది పెద్ద పొరపాటని ఆ సంస్థ చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. సమాజాన్ని ఏకం చేయడం, భారతదేశం మరోసారి విదేశీ శక్తుల గుప్పిట్లోకి వెళ్లకుండా అవసరమైన లక్షణాలు, సద్గుణాలను నింపడానికి ఆర్‌ఎస్‌ఎస్ పని చేస్తుందని భోపాల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన తెలిపారు. మేము యూనిఫాం ధరిస్తాం. కవాతులు, కర్రలతో ఎక్సర్‌సైజ్‌లు చేస్తాం. ఇది చూసి మమ్మల్ని ఎవరైనా పారామిలటరీ సంస్థ అనుకుంటే పొరపడినట్టే. సంఘ్ ఒక విలక్షణ సంస్థ. సంఘ్‌ను అర్థం చేసుకోవడం కష్టం అని భగవత్ అన్నారు. జన్‌సంఘ్, దాని నుంచి వచ్చిన బీజేపీకి ఆర్‌ఎస్‌ఎస్ మాతృసంస్థనే విస్తృతాభిప్రాయం ఉందని, అయితే అవి సంఘ్ కు వ్యతిరేకంగా అల్లుకున్న కథనాలేనని అన్నారు. ఇవాళ ప్రజలు సరైన సమాచారం కోసం లోతుగా వెళ్లడం లేదని, మూలాలకు వెళ్లరని, వికీపీడియాకు వెళ్తుంటారని, అయితే అక్కడి సమచారం అంతా నిజం కాదని పేర్కొన్నారు. ఎవరైతే సంఘ్ గురించి విశ్వసనీయ వనరుల నుంచి సమాచారం తెలుసుకునే ప్రయత్నం చేస్తారో వారికే సంఘ్ గురించి తెలుస్తుందని అన్నారు. ఇలాంటి అపోహల రీత్యా ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర, మిషన్ గురించి వివరించాల్సిన అవసరం ఏర్పడిందని సంఘ్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా దేశవ్యాప్తంగా పర్యటిస్తున్న భగవత్ తెలిపారు. స్వయం సేవకులకు సంఘ్ తీర్దిదిద్దుతుందని, భారతదేశ పరమ వైభవం కోసం పనిచేసేందుకు విలువలు, ఆలోచన, లక్ష్యాలను పెంపొందిస్తుందని, రిమోట్ ద్వారా నియంత్రించదని భగవత్ వివరించారు. దేశభక్తి వాతావరణాన్ని నిర్మించే కార్మికులను సృష్టించడానికి సంఘ్ తన శాఖల ద్వారా పనిచేస్తుందన్నారు. సంఘ్ అనేది ఒక ప్రతిచర్యగా పుట్టిందనే సాధారణ భావన ఉందని, అయితే అది నిజం కాదని చెప్పారు. సంఘ్ దేనికీ ప్రతిచర్య, వ్యతిరేకం కాదని, సంఘ్ ఎవరితోనూ పోటీ పడటం లేదని అన్నారు. దేశంపై మొదటగా దండెత్తిన వాళ్లు బ్రిటిషర్లు కాదని, భారతీయుల కంటే తక్కువ స్థాయిలో ఉన్న కొందరు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి మనలను ఓడించారని చెప్పారు. ఇది ఏడుసార్లు జరిగిందని, ఎనిమిదవ ఆక్రమణదారులు ఆంగ్లేయులని వివరించారు. అలాంటప్పుడు స్వాతంత్ర్యానికి హామీ ఏమిటి ఇది పదే పదే ఎందుకు జరుగుతోందో మనం ఆలోచించాలని భగవత్ సూచించారు. మనను మనం అర్థం చేసుకుని స్వార్థానికి అతీతంగా ఎదగాలని, సద్గుణాలతో సమాజం ఏకతాటిపై నిలిస్తే దేశానికి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. రాజకీయ బానిసత్వానికి తెరపడినా, మానసిక బానిసత్వం కొంతవరకూ కొనసాగుతోందన్నారు. దానికి చరమగీతం పాడాలన్నారు. స్వదేశీ అంటే ప్రపంచంతో వాణిజ్యాన్ని తగ్గించుకోవడం కాదని, భారతదేశంలో తయారుకాని మందులు వంటి ముఖ్యమైన వస్తువులను మాత్రమే దిగుమతి చేసుకోవాలని అన్నారు. వాణిజ్యం అనేది ఒత్తిడి, సుంకాల భయంతో జరక్కూడదని, సొంత నిబంధనల ప్రకారమే జరగాలని సూచించారు. సంఘ్ ఆర్థిక పరిస్థితి బాగానే ఉందని, సంఘ్ ఎప్పుడూ బయట నుంచి వచ్చే నిధులు, విరాళాలపై ఆధారపడదని భగవత్ చెప్పారు. సంఘ్‌ను బాగా అర్థం చేసుకోవాలకుంటే సంఘ్ శాఖలకు రావాలని కోరారు. చక్కెర రుచి గురించి తాను రెండు గంటల పాటు వివరించినా ఒక టీ స్పూన్ చక్కర తాగితేనే అర్థమవుతుందని, అదేవిధంగా శాఖలకు వస్తేనే సంఘ్ గురించి అర్థమవుతుందని చెప్పారు.



## విజయ్ స్నేహ 'హస్తం'

**చెన్నై, జనవరి 3:** తమిళ స్టార్ హీరో విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ ఈ ఏడాది జరగబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపై జోరుగా అంచనాలున్నాయి. పొత్తులతోవెలుతుందా లేక ఒంటరిగా పోటీచేస్తుందా లేక మరో పార్టీతో పొత్తు పెట్టుకుంటుందా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం టీవీకే కాంగ్రెస్ పార్టీతో పొత్తు కోసం ప్రయత్నిస్తున్నట్లు ప్రచారంలోకి వచ్చింది. దీనిపై టీవీకే జాతీయ ప్రతినిధి గెరాల్డ్ కీలక వ్యాఖ్యలు చేశారు. టీవీకే, కాంగ్రెస్ సహజ భాగస్వాములు అని చెప్పారు. రెండు పార్టీలు లౌకిక వాదానికి కట్టుబడి ఉన్నాయని,మత తత్వానికి వ్యతిరేకమని తెలిపారు. అందుకే రెండు పార్టీలు సహజ భాగస్వాములని, తమ అధినేత విజయ్, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంచి మిత్రులని కూడా గెరాల్డ్ అన్నారు. అయితే, రెండు పార్టీలు కలిసి పనిచేసే విషయంలో కొన్ని సమస్యలున్నాయని, ముఖ్యంగా తమిళనాడు కాంగ్రెస్ విభాగంతో ఉన్న సమస్యల్ని పరిష్కరించుకోవాల్సి ఉందన్నారు. భవిష్యత్ లో టీవీకే, కాంగ్రెస్ కలిసి పనిచేయొచ్చు. అయితే, రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఈ అంశంపై టీవీకేతో చర్చించేందుకు అడ్డు పడుతుండొచ్చు అని గెరాల్డ్ అభిప్రాయపడ్డారు. కాగా, రెండు పార్టీల పొత్తు గురించి ఇటీవల ప్రచారం జరుగుతోంది. గత నెలలో జరిగిన టీవీకే సమావేశానికి కొందరు కాంగ్రెస్ నేతలు కూడా హాజరవ్వడం ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చినట్లైంది. ఒకవేళ టీవీకే, కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తే బీజేపీ వ్యతిరేక ఓటు బ్యాంకు చీలకుండా ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు టీవీకేతో పొత్తు కోసం తమిళనాడులోని ఏఐఏడీఎంకే పార్టీ కూడా ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.



## రాజస్థాన్ స్కూళ్లలో దినపత్రికల పఠనం తప్పనిసరి

**జైపూర్, జనవరి 3:** ఉత్తరప్రదేశ్ దారిలోనే రాజస్థాన్ ప్రభుత్వంకూడా పాఠశాల విద్యార్థులకు దినపత్రికల పఠనం తప్పనిసరిచేసింది. అన్ని ప్రభుత్వ పాఠశాల్లలో రోజూ వార్తా పత్రిక చదవడం తప్పనిసరి చేసింది. ప్రభుత్వ సెకండరీ పాఠశాలలు, ఇంగ్లీష్ మీడియం పాఠశాలలు కనీసం రెండు వార్తాపత్రికలు తీసుకోవాలని తెలిపింది. అందులో ఒక హిందీ, ఒక ఇంగ్లీష్ పేపర్ల తప్పనిసరిగా సభ్యత్వం ఉండాలని తెలిపింది. విద్యార్థులలో పఠన అలవాట్లను ప్రోత్సహించడానికి, పదజాలాన్ని మెరుగుపరచడానికి, సాధారణ అంశాలపై అవగాహనను పెంపొందించడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. రాజస్థాన్ విద్యాశాఖ విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం విద్యార్థులు ఉదయం అసెంబ్లీలో కనీసం 10 నిమిషాలు వార్తాపత్రికలు చదవాలి.

## యెమెన్‌పై సౌదీ వైమానిక దాడులు
### తీవ్రంగా ప్రతిఘటించిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్
### దాడుల్లో 20 మంది వేర్పాటు వాదుల మృతి



**సనా,జనవరి 3:**గల్ఫ్‌లోని రెండు బలమైన దేశాల మధ్య ఇపుడు అంతర్గత పోరు ముదిరిపోయింది. గల్ఫ్‌సభ్యదేశం యెమెన్‌లోని కొన్ని ప్రత్యేకప్రాంతాలపై సౌదీ అరేబియా దాడులుచేయడంతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తీవ్రంగా ప్రతిఘటించింది. యెమెన్‌లో చాలా కాలంగా కొనసాగుతున్న వివాదం మరోసారి హింసాత్మక మలుపు తిరిగింది. సౌదీ అరేబియా నేతృత్వంలోని సైనిక సంకీర్ణం సేనలు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మద్దతు ఉన్న సదరన్ ట్రాన్సిషనల్ కౌన్సిల్ (ఎస్టీసీ)స్థానాలను లక్ష్యంగా చేసుకుని వైమానిక దాడులు ప్రారంభించాయి. ఈ దాడుల్లో కనీసం 20మంది వేర్పాటువాద యోధులు మరణించినట్లు నిర్ధారించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఇటీవల యెమెన్‌లో తన సైనిక ఉనికిని ముగించినట్లు ప్రకటించిన సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. వైమానిక దాడులు హద్రామోత్ ప్రావిన్స్‌లోని సెయున్, అల్‌ఖాషా ప్రాంతాలలోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ దాడులు ఒక సైనిక స్థావరం, విమానాశ్రయాన్ని కూడా లక్ష్యంగా జరిగాయి. దీంతో ఆ ప్రాంతంలో వైమానిక రాకపోకలు స్తంభించిపోయాయి. అనేక గంటల పాటు ఏ విమానమూ ఎగురలేకపోయింది. దీని వల్ల పౌరులలో భయాందోళనలు నెలకొన్నాయి. మరణించిన వారందరూ ఈ సైనిక స్థావరాలలో ఉన్న తమ యోధులని సదరన్ ట్రాన్సిషనల్ కౌన్సిల్ అధికారులు తెలిపారు. ఈ వైమానిక దాడులకు ముందు, యుఎఇ యెమెన్ నుండి తన చివరి సైనిక దళాలను ఉపసంహరించుకున్నట్లు ప్రకటించింది. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలను తగ్గించాలని అబుదాబి స్పష్టం చేసింది. ముకల్లా ఓడరేవుపై దాడికి సంబంధించి కూడా వివాదం తలెత్తింది. అక్కడ ఆయుధాల రవాణా లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. యుఎఇ ఈ ఆరోపణలను ఖండించింది. ఇది కేవలం వాహనాల రవాణా మాత్రమే అని పేర్కొంది. సౌదీ మద్దతుగల దళాలు నమ్మక ద్రోహం చేశాయని సదరన్ ట్రాన్సిషనల్ కౌన్సిల్ నాయకులు ఆరోపించారు. సైనిక స్థావరాలను శాంతియుతంగా తమ ఆధీనంలోకి తీసుకుంటామని తాము హామీ ఇచ్చామని, కానీ వెంటనే వైమానిక దాడులు జరిగాయని వారు చెబుతున్నారు. సదరన్ ట్రాన్సిషనల్‌కౌన్సిల్ ఎస్టీసీ ప్రతినిధి ఈ పరిస్థితిని మనుగడ కోసం పోరాటంగా అభివర్ణించారు.


## సంక్షిప్తంగా..

### సైబర్‌నేరాల్లో అగ్రస్థానం మహారాష్ట్రదే..



**న్యూఢిల్లీ, జనవరి 3:** దేశంలో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు ప్రమాదకర స్థాయిలో కొనసాగుతున్నాయి.గడచిన ఆరేళ్లలో వివిధ రకాల మోసాల బారిన పడి భారతీయులు ఏకంగా రూ.52,976 కోట్లకు పైగా నష్టపోయినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ నివేదిక ప్రకారం, ఒక్క 2025లోనే దేశవ్యాప్తంగా రూ.19,813 కోట్ల నష్టం వాటిల్లగా, 21.77 లక్షలకు పైగా ఫిర్యాదులు నమోదయ్యాయి. గతేడాది అత్యధికంగా నష్టపోయిన రాష్ట్రాల జాబితాలో మహారాష్ట్ర రూ.3,203 కోట్లు అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో కర్ణాటక రూ.2,413 కోట్లు, తమిళనాడు రూ.1,897 కోట్లు, ఉత్తరప్రదేశ్ రూ.1,443 కోట్లు నిలిచాయి. ఈ జాబితాలో తెలంగాణ ఐదో స్థానంలో ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

### దేశంలో పెరిగిపోతున్న వైట్‌కాలర్ ఉగ్రవాదం: రాజ్‌నాథ్‌సింగ్



**భోపాల్, జనవరి 3:** దేశంలో వైట్ కాలర్ ఉగ్రవాదం ఆందోళనకరంగా పెరుగుతోందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. విలువలు లేని ఉన్నత విద్య సమాజానికి ప్రమాదకరంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య అనేది వృత్తిపరమైన విజయం మాత్రమేకాదని వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్ భోపాల్‌లోని నోబుల్స్ విశ్వవిద్యాలయం 104వ వ్యవస్థాపక దినోత్సవంలో రాజ్‌నాథ్ సింగ్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గతేడాది ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటనను ప్రస్తావించారు.

### అద్దె ఇంట్లో ఉన్న బాలికపై ఇద్దరు లైంగిక దాడి



**లక్నో, జనవరి 3:** అద్దె ఇంట్లో నివసిస్తున్న ఇద్దరు వ్యక్తులు బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్ప డ్డారు. ఆ తర్వాత ఆమెను టెర్రస్ పైనుంచి కిందకు తోసేశారు. ఆ బాలిక ప్రమాదవశాత్తు కిందపడి మరణించినట్లుగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారు. ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సికంద్రాబాద్ ఇండస్ట్రియల్ ఏరియాలోని అద్దె ఇంట్లో రాజు, వీరు కశ్యప్ అనే ఇద్దరు వ్యక్తులు నివసిస్తున్నారు.ఈనెల 2న అదే బిల్డింగ్‌లోని వేరే పోర్షన్‌లో నివసించే ఆరేళ్ల బాలిక టెర్రస్‌పై ఆడుకుంటున్నది. ఇది గమనించిన ఆ వ్యక్తులు ఆ చిన్నారిపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ తర్వాత టెర్రస్ పైనుంచి ఆమెను కిందకు తోసేశారు. తీవ్రంగా గాయపడిన ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాలికను ఆమె తల్లింద్రులు గుర్తించారు. ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆ చిన్నారి మరణించినట్లు డాక్టర్లు తెలిపారు.

### ప్రసవంకోసం ఆరు కిలోమీటర్లు నడిచివెళ్లిన గర్భిణి మృతి



**ముంబై, జనవరి 3:** మారుమూల గ్రామంలో ఎలాంటి వైద్య సదుపాలు లేకపోవడంతో నిండు గర్భిణీ పెద్ద సాహసం చేసింది. ప్రసవం కోసం భర్తతో కలిసి ఆరు కిలోమీటర్ల దూరం నడిచింది. అయితే ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆమె మరణించింది. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో ఈ విషాద సంఘటన జరిగింది. ఆల్దండి తోలా గ్రామానికి చెందిన 24 ఏళ్ల ఆషా సంతోష్ కిరంగ తొమ్మిది నెలల గర్భవతి. ఆ గ్రామంలో డెలివరీ సౌకర్యాలు లేవు. ఆ గ్రామం నుంచి ప్రధాన రహదారికి ఎలాంటి రోడ్డు మార్గం కూడా లేదు. ఈ పరిస్థితుల్లో నిండు గర్భిణీ అయిన ఆషా పెద్ద సాహసం చేసింది. ప్రసవం కోసం పెథాలోని తన సోదరి ఇంటికి బయలుదేరింది. ఈనెల 1న భర్తతో కలిసి అటవీ దారిలో ఆరు కిలోమీటర్ల దూరం నడిచింది. పెథాలోని సోదరి ఇంటికి చేరేసరికి ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించింది.

### నిజమే.. మా అబ్బాయి వివాహనిశ్చితార్థం జరిగింది: ప్రియాంక గాంధీ



**న్యూఢిల్లీ, జనవరి 3:** కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ ఇంట త్వరలో పెళ్లి బాజాలు మోగనున్నట్లు గత కొన్ని రోజులుగా జోరుగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. ప్రియాంక, ప్రముఖ వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా కుమారుడు రేహాన్ వాద్రా త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ వార్తలపై ప్రియాంక గాంధీ స్పందించారు. మీడియాలో వస్తున్న వార్తలను ధృవీకరించారు. ఈ మేరకు కీలక ప్రకటన చేశారు. రేహాన్‌కు తన చిన్ననాటి స్నేహితురాలు అవీవా బేగ్ తో ఎంగేజ్మెంట్ జరిగినట్లు ప్రకటించారు.

# గుంటూరులో కార్డన్ సెర్చ్



**గుంటూరు క్రైమ్,జనవరి3,ప్రభాతవార్త:** గుంటూరు జిల్లా వ్యాప్తంగా గంజాయి ఇతర మాదక ద్రవ్యాల అక్రమ కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో



విస్తృత కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించబడుతున్నాయి.జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు అనుమానితులు, గంజాయి కేసుల్లో పాత నేరస్తులు, రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్లు కలిగిన వ్యక్తుల నివాసాలను పరిశీలించడంతో పాటు, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరిస్తామని పోలీసులు హెచ్చరిస్తున్నారు.గంజాయి కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని పాత నేరస్తులకు స్పష్టమైన హెచ్చరిక జారీ చేయబడింది.రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని పోలీస్ అధికారులు హెచ్చరించారు.గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్: వెస్ట్ డీఎస్పీ కె. అరవింద్ నేతృత్వంలో శనివారం అరండల్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సంజీవయ్య నగర్లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించబడింది.గుంటూరు నార్త్ సబ్ డివిజన్:మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాజా గ్రామంలోని పుల్లయ్యనగర్‌లో తెల్లవారుజాము నుంచి కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి, గంజాయి విక్రయ అనుమానితుల ఇళ్లలో సోదాలు చేపట్టారు. రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి, భవిష్యత్తులో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు స్పష్టం చేశారు.స్థానికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, గంజాయి సహా మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. మత్తు పదార్థాల వలన యువత భవిష్యత్తు నాశనం అవుతోందని, కుటుంబాల్లో కలహాలు పెరుగుతున్నాయని, సమాజంలో నేరాలు పెరుగుతున్నాయని ప్రజలకు అవగాహన కల్పించారు.యువతను సరైన మార్గంలో నడిపించడం పోలీసుల ప్రధాన లక్ష్యమని డీఎస్పీలు స్పష్టం చేశారు. గంజాయి నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకం అని పేర్కొన్నారు.గంజాయి కార్యకలాపాల నిర్మూలన దిశగా ఇలాంటి ఆపరేషన్లు నిరంతరం కొనసాగుతాయని, గంజాయి వ్యాపారంలో పాల్గొనే వారిపై కఠిన,చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.గంజాయి రహిత జిల్లాగా గుంటూరును తీర్చిదిద్దడమే జిల్లా పోలీసుల లక్ష్యం అని పేర్కొంటూ, ప్రజలు కూడా తమ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో నార్త్ డీఎస్పీ మురళీ కృష్ణ, వెస్ట్ డీఎస్పీ అరవింద్, అలాగే నార్త్, వెస్ట్ సబ్ డివిజన్లకు చెందిన పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# సావిత్రిబాయి పూలే ఆశయాల సాధనకు పునరంకితమోదాం

**మంగళగిరి, జనవరి 3, ప్రభాతవార్త:** సంఘసంస్కర్తతొలి మహిళా ఉపాధ్యాయినిరచయిత్రి అణగారినవర్గాల ముఖ్యంగా స్త్రీల విద్యా వ్యాప్తికి కృషి చేసిన "చదువుల తల్లి"సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె ఆశయాల



సాధనకు పునరంకిత మోదామంటూ ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు పారేపల్లి మహేష్ అన్నారు. స్థానిక మంగళగిరి రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలలో పలువురు బీసీ నాయకులతో కలిసి, సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు దోకిపర్తి శ్రీనివాసరావుమాట్లాడుతూ 1897 లో పూణేలో ప్లేగు వ్యాధి ప్రబలినప్పుడు రోగుల్ని భుజాలపై ఎత్తుకెళ్లి ఆసుపత్రుల్లో వైద్యం చేయించిన మానవతా మూర్తి సావిత్రిబాయి పూలే అన్నారు.అట్టి మహనీయురాలి జీవిత ఆశయాల సాధనకు నేటితరం పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమములో జిల్లా ఉపాధ్యక్షులు జంజనం వరప్రసాద్, మంగళగిరి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మంగళగిరి ప్రసాద్, ఉపాధ్యక్షులు తోట గౌరీ శంకర్, జొన్నాదుల వెంకటకృష్ణ, పట్టణ మహిళా అధ్యక్షురాలు జి జయలక్ష్మి, నియోజకవర్గ యువజన అధ్యక్షులు ఆలా శివాజీ, జిల్లా నాయకులు ఉడతా శ్రీనివాసరావు,మర్రివాడ రాజశేఖర్ పలువురు బీసీ నాయకులు పాల్గొని ప్రసంగించారు.

# ఉప్పుటూరి సేవలు మరువలేనివి

**వట్టిచెరుకూరు రూరల్, జనవరి 3, ప్రభాతవార్త:** మండలంలోని పుల్లడుగుంట గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ఉప్పుటూరి రామ్ చౌదరి ఉప్పుటూరి చారిటబుల్ ట్రస్ట్ ను స్థాపించి సమాజంతో పాటు ఎంతోమంది పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించడం చాలా గొప్ప విషయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ కొర్నెపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్, పదోవ తరగతి



విద్యార్థులకు ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమయంలో 93మంది విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ఉప్పుటూరి చిన రాములు కుమారుడు ఉప్పుటూరి రామ్ చౌదరి ముందుకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. పౌష్టికాహారం కింద న్యూట్రిషన్ ఫుడ్, శనగ గుగ్గిళ్ళు, వేరుశనగ గింజలు మూడు క్వింటాళ్ళు అందివ్వటం చాలా గర్వంగా ఉందన్నారు. గత మూడు సంవత్సరాల నుండి మా పాఠశాల పది, ఇంటర్ విద్యార్థులకు న్యూట్రిషన్ ఫుడ్ సరఫరా చేస్తున్నారని తెలిపారు. చిన్న రాములు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. గత రెండు సంవత్సరాల క్రితం ఇదే పాఠశాలకు టాటా మ్యాజిక్ వ్యాన్ ను ఉచితంగా కొనివ్వటం జరిగిందని దీని ద్వారా పుల్లడి గుంట నుండి 40 మంది విద్యార్థులు ప్రతిరోజు కొర్నెపాడు పాఠశాలకు వస్తున్నట్లు వివరించారు. అనంతరం ఉప్పుటూసూరి ఉప్పుటూరి సేవా ట్రస్ట్ అధినేత చినరాములను పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో ఉప్పుటూరి చినరాములు మరియు గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కూతురే కొడుకై తండ్రికి తలకొరివి

**తాడేపల్లి,జనవరి 3,ప్రభాతవార్త :** స్థానిక తాడేపల్లి పట్టణంలోని కొత్తూరు సెంటర్లో నివశిస్తున్న బుర్రముక్కు పోతురాజు రెడ్డి(53) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు.ఆయన అంతిమ క్రియల్లో పాల్గొన్న మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి.బుర్రముక్కు పోతురాజు



రెడ్డి ఒక్క కూతురు మాత్రమే ఉండడంతో కొడుకు లేకపోవడంతో తండ్రికి తలకొరివి పెట్టేవారు లేరని చెప్పడంతో కూతరు తలకొరివి పెట్టడంట తప్పేమిటి కన్నతండ్రికి తలకొరివి పెట్ట రుణం తీర్చుకుంటుందని వారి బంధువులతో మాట్లాడి కూతురుతో తండ్రి పార్థివదేహానికి తలకొరివి పెట్టించి తండ్రి చివరి కోరికను నెరవేర్చిన మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి కూతరు దు:ఖాన్ని దిగమింగుకొని తండ్రికి అంత్యక్రియలు నిర్వహించి తలకొరివి పెట్టింది.

# బాలికలకు ఉచిత హెచ్‌పీవీ టీకాలు

**మంగళగిరి, జనవరి 3, ప్రభాతవార్త :** బాలికలను గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి రక్షించాలనే ఉద్దేశంతో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో ఉచిత హెచ్‌పీవీ టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షుడు ప్రెగడ రాజశేఖర్ తెలిపారు. శనివారం వి.జె. జూనియర్ కాలేజీ ఆవరణలో మీడియా తో ఆయన మాట్లాడుతూ 9 నుంచి 14 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన మంగళగిరి నియోజకవర్గంలోని సుమారు వెయ్యి మందికి పైగా




బాలికలకు ఈ టీకాలను ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించి తల్లిదండ్రులు 7207403150 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తమ పిల్లల పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వే ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రతి రెండు నిమిషాలకు ఒక మహిళ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఈ ప్రమాదకర వ్యాధి నుంచి మహిళలు సురక్షితంగా ఉండాలంటే ముందస్తు చర్యగా క్వాడ్రివాలెంట్ హెచ్‌పీవీ టీకాను రెండు మోతాదుల్లో తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సుమారు రూ.50 లక్షల వ్యయంతో, తల్లిదండ్రుల అనుమతితో 1000 మందికి పైగా బాలికలకు ఈ టీకాలను పూర్తిగా ఉచితంగా అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రముఖ ఆంకాలజిస్టులు, వైద్యులు, నర్సుల పర్యవేక్షణలో సురక్షితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.భవిష్యత్తులో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరించి మంగళగిరి నియోజకవర్గంలోని అర్హత కలిగిన ప్రతి బాలికకు హెచ్‌పీవీ టీకాలు అందించాలనే లక్ష్యంతో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి పనిచేస్తుందని ఆయన అన్నారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ తీవ్రతను తల్లిదండ్రులు గుర్తించి ఈ కార్యక్రమానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి పారేపల్లి నిరంజన్ గుప్తా, ప్రాజెక్ట్ శక్తి చైర్మన్ ఇసునూరు అనిల్ చక్రవర్తి, ప్రాజెక్ట్ కార్యదర్శి గాజుల శ్రీనివాస్, సర్వీస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ చనుమోలు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

**వట్టిచెరుకూరు రూరల్, జనవరి 3, ప్రభాతవార్త:** ఓ విద్యార్థి రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తి బలంగా ఢీ కొట్టిన సంఘటన మండలంలోని వింజనంపాడు గ్రామంలో శనివారం జరిగింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని వింజనంపాడు దళితవాడకు చెందిన మంద సురేష్, మంద సునీత అనే దంపతులు స్థానిక పంచాయతీలో గ్రీన్ అంబాసిడర్ గా పనిచేస్తున్నారు .వీరికి ఒక బాబు, ఒక పాప సంతానం ఉన్నారు. కుమారుడు రుషివర్ధన్



స్థానికంగా ఉన్న పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నాడు. రోజు పాఠశాలకు వెళ్లే సమయంలో శనివారం ఉదయం కూడా బడికి వెళ్లేందుకు సిద్ధమై ఉండగా తమ బంధువులు బాన్డెడ్ కొనేందుకు దగ్గరలో ఉన్న దుకాణానికి పంపించారు. ఇంతలో అటుగా వేగంగా ద్విచక్ర వాహనంపై వస్తున్న నంబూరు మురళి అనే వ్యక్తి బాలుడిని బలంగా ఢీకొట్టడంతో అప్పటికక్కడే కుప్పకూలిపోయాడు. అపస్మారక స్థితిలో ఉన్న బాలుడిని దగ్గరలో ఉన్న ఆర్ఎంపీ డాక్టర్ వద్దకు తీసుకుని వెళ్లి చికిత్స చేయించారు. ఆ వైద్యుడు మెరుగైన చికిత్స కోసం గుంటూరు తీసుకుని వెళ్ళమని సలహా ఇచ్చాడు. బాలుడిని మెరుగైన చికిత్స కోసం గుంటూరు జిజిహెచ్ కు తరలించగా వైద్యులు వైద్య సేవలు అందించారు. బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

# తొలిరౌండ్‌లో విజయం సాధించిన 60జట్లు

**తాడేపల్లి,జనవరి 3,ప్రభాతవార్త :** కె.ఎల్.విశ్వవిద్యాలయంలో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పురుషుల టోర్నమెంట్-2026 శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి.తొలిరోజు మొదటి రౌండ్‌లో మొత్తం 128జట్లు పోటీ పడ్డాయి.వాటిలో 60జట్లు గెలుపొందగా 4జట్లు ఫలితాలు డ్రాగా ముగిసింది.తొలిరౌండ్‌లో గెలుపొందిన జట్లు ఆదివారం రెండవ రౌండ్‌లో తలపడనున్నాయి .శనివారం గెలుపొందిన జట్లలో తమిళనాడు కు చెందిన భారతీయార్ యూనివర్సిటీ, ఏపికి చెందిన శ్రీకృష్ణదేవరాయలు యూనివర్సిటీ పైన విజయం



సాధించింది.ఇంకా పలు యూనివర్సిటీలకు చెందిన జట్లు తొలిరౌండ్‌లో విజయం సాధించిన నేపథ్యంలో ఆదివారం రెండవ రౌండ్‌లో పోటీ పడుతున్నట్లు సౌత్ జోన్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె.హరికిషోర్ తెలిపారు.

# రేపు మలినేని ఇంజనీరింగ్ కళాశాలకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు రాక

## దివంగత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహ ఆవిష్కరణకు ఏర్పాట్లు పూర్తి : మలినేని విద్యాసంస్థల చైర్మన్ పెరుమాళ్ళు

**వట్టిచెరుకూరు రూరల్, జనవరి 3, ప్రభాతవార్త :** మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన వసతి గృహం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు హాజరవుతున్నారని మలినేని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు తెలిపారు. గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు నియోజకవర్గం, వట్టిచెరుకూరు మండలం, పుల్లడిగుంట గ్రామ పరిధిలో ఉన్న మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ప్రారంభించే కార్యక్రమాలతో పాటు, కళాశాలలో జరిగే ముందస్తు సంక్రాంతి సంబరాలు కార్యక్రమాలకు హాజరయ్యే ప్రముఖుల వివరాలను చైర్మన్ వెల్లడించారు. మలినేని లక్ష్మయ్య ఇంజనీరింగ్ మహిళ కళాశాలలో విద్యార్థినుల కోసం నిర్మించిన వసతి గృహం ప్రారంభోత్సవం చేసేందుకు ఈనెల 5వ తేదీ ఉదయం 10 గంటలకు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు వస్తున్నారని, అదేవిధంగా



ఆయన చేతుల మీదుగానే కళాశాల ప్రాంగణంలో నిర్మించిన భారత మాజీ రాష్ట్రపతి దివంగత ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా వెంకయ్య నాయుడుతో పాటు గౌరవ అతిథులుగా ప్రత్తిపాడు శాసనసభ్యులు, జిల్లా మాజీ కలెక్టర్, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు గంటా శ్రీనివాసరావు, విశ్రాంత ఐఏఎస్ అధికారి, హైయర్ ఎడ్యుకేషన్ మాజీ కమిషనర్ డాక్టర్ కె. లక్ష్మీనారాయణ, ఏఐసీఈఓ అనువాది, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ సీఈఓ బుద్ధా చంద్రశేఖర్, ఈనాడు ఎడిటర్ ఎం. నాగేశ్వరరావులతో పాటు అనేకమంది జాతీయ, రాష్ట్ర, జిల్లాస్థాయికి చెందిన రాజకీయ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని వివరించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ముందస్తుగా మలినేని విద్యాసంస్థల యాజమాన్యం, ప్రొఫెసర్లు, అధ్యాపకుల నుంచి ముందస్తుగా సంక్రాంతి సంబరాలకు ప్రతి ఒక్కరికి స్వాగతం.. సుస్వాగతం తెలుపనున్నట్టు వెల్లడించారు. ప్రతి సంవత్సరం మా కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. విలేకరుల సమావేశంలో మలినేని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పెరుమాళ్ళుతో పాటు మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జెట్టి అప్పారావు, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ పోపూరి రమేష్ బాబు, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏవో) సుబ్బారావు, హెచ్ఓడి, తదితరులు పాల్గొన్నారు.

# సిఐటియు జాతీయ మహాసభల సందర్భంగా విశాఖలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయండి : సిఐటియు విస్తృత ఆటో ప్రచారం

**పెదనందిపాడు జనవరి 3 (ప్రభాతవార్త) :** సిఐటియు అఖిలభారత మహాసభలు గత నెల 31 వ తారీకు నుంచి విశాఖపట్నంలో నిర్వహిస్తున్న సందర్భంగా, జనవరి 4వ తేదీ విశాఖపట్నం మున్సిపల్ స్టేడియం వద్ద సాయంత్రం 4 గంటలకు జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు మండల నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు పిలుపునిచ్చారు. శనివారం సిఐటియు పెదనందిపాడు, కాకుమాను మండల కమిటీల ఆధ్వర్యంలో ఆటో ప్రచార జాతా, కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ విశాఖలో జరిగే అఖిలభారత సిఐటియు మహాసభలు కార్పొరేట్ విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలను రూపొందించబోతున్నాయని తెలిపారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేయాలని, కార్మిక హక్కులను పునరుద్ధరించాలని కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్ తో సహా అన్ని ప్రభుత్వ రంగ పరిశ్రమలను కారు చౌకగా కార్పొరేట్లకు అప్పచెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘాలు పెట్టకూడదని, సమ్మెలు చేయకూడదని కార్మిక హక్కులను కాలరాస్తున్నారని అన్నారు. ఉపాధి చట్టాన్ని పూర్తిగా ధ్వంసం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వ దుర్మార్గపు విధానాలు ఉన్నాయన్నారు. కార్మిక, కర్షక ఐక్యతతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టడమే అఖిల భారత మహాసభల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలు అమలు చేయాలని, బిల్డింగ్ వర్కర్ల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, హమాలి, ఆటో, ప్రైవేట్ ట్రాన్స్ పోర్ట్. తదితర అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, విద్యా ,వైద్యం ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, కనీస పెన్షన్ నెలకు 9,000 రూపాయలు ఇవ్వాలని, సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ ను అమలు చేయాలని, రైతుల పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని తదితర డిమాండ్లతో మహాసభలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆటో ప్రచార జాతాలో భాగంగా పెదనందిపాడు మండలంలో పెదనందిపాడు, నాగులపాడు, పమిడివారిపాలెం, పుసులూరు, కత్రపాడు, గోగులమూడి, రావిపాడు, జి జి పాలెం, ఏబీ పాలెం, వరగాని, పాలపర్రు, అన్నవరం,



ఉప్పలపాడు, జరుగులవారి పాలెం, రాజుపాలెం కాకుమాను మండలంలోని కొమ్మూరు, గార్లపాడు, పెద్దివారిపాలెం, కొండపాటూరు, కాకుమాను, బి కే పాలెం తదితర గ్రామాలలో కరపత్రాలు పంచుతూ మైక్ ప్రచారం నిర్వహించారు. జాతీయ సిఐటియు మహాసభల సందర్భంగా జనవరి 4 వ తారీఖు జరిగే బహిరంగ సభలో సిఐటియు అఖిలభారత అధ్యక్షురాలు కామ్రేడ్ కే హేమలత, సిఐటియు ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ తపన్ సేన్, సిఐటియు అఖిలభారత మాజీ ఉపాధ్యక్షులు కామ్రేడ్ ఏం.ఎ గఫూర్, సిఐటియు అఖిలభారత కోశాధికారి కామ్రేడ్ ఎం సాయిబాబు, సిఐటియు అఖిలభారత కార్యదర్శి సిహెచ్ నరసింహారావు, సిఐటియు ఏపీ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ ఏవి నాగేశ్వరరావు తదితర అగ్ర నాయకులు పాల్గొని ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఈ బహిరంగ సభ లో కార్మికులు, ఉద్యోగులు, రైతు సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు నాయకులు కొత్త వెంకటశివరావు, జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, నల్లమోతు రాజేంద్ర, కర్లపూడి ప్రసాదు, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

# గొప్ప సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే

**గుంటూరు వెస్ట్, జనవరి 3,ప్రభాతవార్త:** భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే అందరికీ



ఆదర్శమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శనివారం స్థానిక తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ అణగారిన వర్గాలు, బాలికల విద్య కోసం అలుపెరగని కృషి చేసి సావిత్రిబాయి పూలే మార్గంలో పయనించాలని సూచించారు. భారతదేశంలో మొదటి బాలికల పాఠశాలను ప్రారంభించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కంకణం కట్టుకున్నారనిత తెలిపారు. కుల వివక్ష, స్త్రీల హక్కుల కోసం సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించారన్నారు. భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా ఎందరో జీవితాలను తీర్చిదిద్దారని చెప్పారు. కులతత్వం, పురుషాధిక్యతకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తున్నామని చెప్పారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ చేపట్టిన విద్యా సంస్కరణలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు. తల్లికి వందనం, మెగా టీచర్స్, పేరెంట్స్ మీటింగ్ ద్వారా విద్యార్థుల సామర్థ్యాల మదింపు చేపట్టి వారి భవితకు బంగారు బాటలు వేస్తున్నామని చెప్పారు.

# నిర్మల ఫార్మసీ కళాశాల్లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

**తాడేపల్లి,జనవరి 3,ప్రభాతవార్త :** మంగళగిరిలోని నిర్మల ఫార్మసీ కళాశాల్లో జాతీయ సేవా పదకం,సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తాధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.కార్యక్రమ ప్రారంభంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించి ప్రార్ధనా గీతంతో వేడుకలు ప్రారంభించారు.అనంతరం విద్యార్థులు సావిత్రబాయి పూలే జీవిత చరిత్రను,ఆమె చేసిన విద్యాసేవలు,మహిళా విద్యకు అందించిన ప్రాధాన్యతను ప్రతిబింబించేలా నాటక రూపంలో ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.పూలే గొప్పతనాన్ని వివరిస్తూ ఉత్తమంగా ప్రదర్శన చేసిన విద్యార్థులకు సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రశంసా పత్రాలు అందజేశారు.కళాశాల కరస్పాండెంట్ రెవ.సిస్టర్ జి.నిర్మలజ్యోతి విద్యార్థుల నుద్దేశించి ప్రసంగిస్తూ,సావిత్రిబాయి పూలే బాలికా విద్య కోసం పోరాటం నేటి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని,విద్య ద్వారానే సమానత్వం,సామాజికాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పాములరెడ్డి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే వేసిన మహిళా విద్యా పునాదులే నేటి సమాజ పురోగతికి మార్గదర్శకమన్నారు.సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్



ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.ట్రస్ట్ సేవలపై జాతీయసేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రేఖా నరేష్‌బాబు మాట్లాడుతూ డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి ఆధ్వర్యంలో ట్రస్ట్ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు, ముఖ్యంగా తల్లిదండ్రులను కోల్పోయిన వారికి లేదా ఒకే తల్లిదండ్రితో జీవనం సాగిస్తున్న విద్యార్థులకు విద్య కొనసాగించేందుకు ఆర్థిక సాయం అందిస్తూ ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు.కార్యక్రమానికి విద్యార్థి కార్యక్రమ సమన్వయకర్తలుగా పి.నివేదిత స్ఫూర్తి,సిహెచ్ నాగేశ్వరరావు, ఎం.రవి సమర్థవంతంగా వ్యవహరించారు.అధ్యాపకులు,విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొని సావిత్రిబాయి పూలే సేవలను స్మరించుకున్నారు.

# కేఎల్‌యులో ప్రారంభమైన సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పురుషుల టోర్నమెంట్-2026

**తాడేపల్లి,జనవరి 3,ప్రభాతవార్త :** కెఎల్ విశ్వవిద్యాలయంలో జనవరి 3నుంచి 6వ తేది వరకు నిర్వహిస్తున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పురుషుల టోర్నమెంట్ -2026 కు శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు ముఖ్యఅతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ యువ క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించడానికి,అలాగే జాతీయస్థాయి ఇంటర్ యూనివర్సిటీ ఛాంపియన్ షిప్‌కు అర్హత సాధించడానికి ఈ టోర్నమెంట్ ఒక గొప్పవేదికగా నిలవనుందన్నారు.ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్,తెలంగాణా,తమిళనాడు, కర్నాటక,కేరళ రాష్ట్రాలకు చెందిన 128 అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాలు పాల్గొంటుండగా సుమారు 896మంది ప్రతిభావంతులైన బ్యాడ్మింటన్ క్రీడాకారులు తమ విశ్వవిద్యాలయాలకు ప్రాతినిధ్యం వహిస్తూ పోటీల్లో పాల్గొనడం విశేషమన్నారు.ఇటివలే విజయవాడలో 10ఏళ్ళ తర్వాత నిర్వహించిన 87వ జాతీయ స్థాయి సీనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ గురించి ప్రస్తావిస్తూ,సీనియర్ మహిళల సింగిల్స్ విభాగంలో సూర్య చరిష్మా స్వర్ణ పతకం సాదించడం రాష్ట్రానికి గర్వకారమణమన్నారు.కూటమి ప్రభుత్వం క్రీడల ప్రోత్సాహనికి ఎల్లప్పుడూ ముందుంటుందని పేర్కొన్న శాప్ చైర్మన్,దేశంలోనే తొలిసారిగా రాత పరీక్ష లేకుండా,హారజంటల్ రిజర్వేషన్ విధానం ప్రకారం నిర్వహించిన మెగా స్పోర్ట్స్ డీఎస్సీ ద్వారా 421మంది అర్హత కలిగిన క్రీడాకారులకు ఉద్యోగాలు కల్పించామన్నారు.ప్రపంచ స్థాయిలో అద్భుత ప్రదర్శనలతో దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చిన ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారులు పి.వి.సింధుకు విశాఖపట్నంలో 3ఎకరాలు,పుల్లేల గోపిచంద్‌కు అమరావతిలో 12ఎకరాలు,కిడాంబి శ్రీకాంత్‌కు తిరుపతిలో 5ఎకరాలు బ్యాడ్మింటన్ అకాడమీల నిర్మాణం కోసం భూమి కేటాయించడం జరిగిందన్నారు. ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లను నిర్వహిస్తున్నందుకు కెఎల్ యూనివర్సిటీ యాజమాన్యానికి ప్రభుత్వం,శాప్ తరపున శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.వర్సిటీ విసి డాక్టర్ జి.పార్ధసారధి వర్మ మాట్లాడుతూ యువతకు క్రీడల




ద్వారా శారీరక ఆరోగ్యం,మానసిక శక్తిని పెంపొందించుకోవడం ఎంతో ముఖ్యమన్నారు.వర్సిటీ క్రీడల డైరెక్టర్ డాక్టర్ హరికిషోర్ మాట్లాడుతూ తమ వర్సిటీలో ఉన్న క్రీడాకారులకు ఫీజు రాయితీతో పాటు పలు రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఎక్స్‌జాయింట్ సెక్రటరీ పున్నయ్య చౌదరి,ఎన్టీఆర్ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.కోటేశ్వరరావు,వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధి వర్మ,ప్రొ విసి లు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్,డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్,డాక్టర్ కే.రాజశేఖరరావు,రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు,కెఎల్ క్రీడల డైరెక్టర్,సౌత్ జోన్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె.హరికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# క్రాంతిజ్యోతి సావిత్రి బాయి పూలే

**గుంటూరు విద్య జనవరి 3 (ప్రభాతవార్త):** సావిత్రి బాయి పూలే జీవితం ఒక చరిత్ర కాదు, అది ఒక ఉద్యమ పాఠం. భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా, సామాజిక సంస్కర్తగా ఆమె చేసిన కృషి మరువలేనిదని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ అన్నారు. స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యాలయంలో జరిగిన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల సందర్భంగా ఏసుబాబు మాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఏసుబాబు మాదిగ మాట్లాడుతూసావిత్రి బాయి 1831వ సంవత్సరం, జనవరి 3న మహారాష్ట్రలోని సతారా జిల్లా ఖండాలా తాలూకాలోని నయాగావ్ అనే చిన్న గ్రామంలో జన్మించారని పేర్కొన్నారు.అప్పటి ఆచారాల ప్రకారం, అతి చిన్న వయసులోనే సావిత్రి బాయికి వివాహం జరిగింది.1840లో, సావిత్రి బాయికి 9 ఏళ్ల ఉన్నప్పుడు, 13 ఏళ్ల వయసున్న జ్యోతిరావు పూలేతో వివాహం జరిగింది.ఈ వివాహమే ఆమె జీవితాన్ని, తద్వారా భారతీయ మహిళల తలరాతను మార్చేసింది. జ్యోతిరావు పూలే అప్పటికే సామాజిక అన్యాయాలపై ఒక అవగాహన కలిగి ఉన్నారు. తన భార్యకు విద్య నేర్పితేనే సమాజ మార్పు సాధ్యమని ఆయన నమ్మారు.1848లో భారతదేశ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం లిఖించబడింది.1848, జనవరి 1న పూణేలోని భిడే వాడలో జ్యోతిరావు మరియు సావిత్రి బాయి కలిసి బాలికల కోసం దేశంలోనే మొట్టమొదటి పాఠశాలను ప్రారంభించారు.పూలే దంపతులు వేసిన పునాదిపైనే అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాణం మరియు సామాజిక న్యాయ పోరాటాన్ని నిర్మించారు. సావిత్రి బాయి స్త్రీలకు విద్యను అందించడమేకాకపోతే, అంబేద్కర్ కోరుకున్న ఖిళిసమానత్వంఖిళి అసంపూర్ణంగా ఉండేది.ఆమె ఆధునిక భారతీయ మహిళకు స్ఫూర్తి అని కొనియాడారు.సావిత్రి బాయి పూలే కేవలం ఒక వ్యక్తి కాదు, ఆమె ఒక శక్తి.ఆమె విద్య ద్వారా అజ్ఞానాన్ని పారద్రోలారు. ప్రేమ ద్వారా ద్వేషాన్ని జయించారు. ధైర్యం ద్వారా ఆచారాలను ధిక్కరించారు.ఈ రోజు భారతీయ మహిళలు, దళిత, బహుజన బిడ్డలు చదువుకుని, ఉన్నత పదవుల్లో ఉన్నారంటే దానికి మూల కారణం సావిత్రి బాయి పూలే వేసిన ఆ మొదటి అడుగు. ఆమె జీవితం ప్రతి తరానికి ఒక పాఠం అని ఏసుబాబు మాదిగ గుర్తు చేశారు

## 12 వ వేతన సవరణ కమీషన్ ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ చూపాలి



**గుంటూరు విద్య జనవరి 3 (ప్రభాతవార్త):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వినుకొండ రాజారావు అధ్యక్షతన జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు వినుకొండ రాజారావు మాట్లాడుతూ 11 వ వేతన సవరణ కాలం పరిమితి ఇప్పటి 30 నెలలు గడిచిన ఉద్యోగుల, ఉపాధ్యాయుల, విశ్రాంతి ఉద్యోగుల విషయంలో ఎవరూ స్పందించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ ఉద్యోగులకు 30 నెలలు పి ఆర్ సి గురించి నష్టం వాటిల్లుతుందని ఉద్యోగుల సంక్షేమం దృష్ట్యా పి.ఆర్ సి కమిషన్ ఏర్పాటు కు ప్రభుత్వం వెంటనే చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాంద్ బాషా మాట్లాడుతూ 12 వ వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేయడంవలన ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక పరమైన భారం ఉండదని , ఉద్యోగులకు సమయం కలిసి వస్తుందని, లేకపోతే ఉద్యోగులకు ఒక పి ఆర్ సి నష్ట పోవాల్సి వస్తుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పిఆర్సి కమిషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు అసోసియేషన్ గుంటూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రెహమాన్, జి.శ్రీనివాసరావు , డి.రాజు, పెద కోటయ్య గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు భరత్ కుమార్ , హిదయాతుల్లా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# భారతదేశంలో డిజిటల్ అరెస్ట్ అనే వ్యవస్థ లేదు

## - సుప్రీం కోర్టు అడ్వకేట్ నర్రా శ్రీనివాసరావు

**గుంటూరు విద్య జనవరి 3 ప్రభాతవార్త:** సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యార్థులదేనని, భారతదేశంలో "డిజిటల్ అరెస్ట్ అనే వ్యవస్థ లేదని, సైబర్ నేరగాళ్లు ప్రజలను భయపెట్టి మోసాలకు పాల్పడుతున్నారని సుప్రీం కోర్ట్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ తెలంగాణ హైకోర్టుల అడ్వకేట్ నర్రా శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక చౌడవరంలోని ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల సోషల్ మీడియా కమిటీ మరియు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ సంయుక్త సహకారంతో నిర్వహించిన "డిజిటల్ సేఫ్టీ 101: గార్డింగ్ ఎగైనెస్ట్ ఆన్లైన్ స్కామ్స్" అనే అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాల స్వరూపం, డిజిటల్ లావాదేవీల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చట్టపరమైన రక్షణలు వంటి అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. 2025 సంవత్సరంలో దేశవ్యాప్తంగా 71,500 కు పైగా ఆన్‌లైన్ మోసాల కేసులు నమోదయ్యాయని, డిజిటల్ లావాదేవీల్లో వ్యక్తిగత సమాచారం గోప్యత అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి భారత రాజ్యాంగం, చట్టాలపై ప్రాథమిక అవగాహన అవసరమని, రోజువారీ డిజిటల్ కార్యకలాపాల్లో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సైబర్ నేర సమస్యలు ఎదురైతే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 లేదా పోలీస్ ఎమర్జెన్సీ నెంబర్ 100ను సంప్రదించాలని తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణ దిశగా విద్యార్థులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సామాన్యులకు ఉపయోగపడే వినూత్న ఆలోచనలు చేయాలని కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి మురళీమోహన్, డా. జగదీష్ కె. మద్దినేని సూచించారు. విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు అడ్వకేట్ నర్రా శ్రీనివాసరావు ముందుకు రావడం సామాజిక బాధ్యతకు నిదర్శనమని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ శ్రీ రాయపాటి గోపాల కృష్ణ, ట్రెజరర్ డా. కొండబోలు కృష్ణ ప్రసాద్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్ డి డైరెక్టర్ డా. కె. రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డా. ఎన్.వి. శ్రీనివాస రావు, ఆంధ్రప్రదేశ్ చాప్టర్ చైర్‌వుమన్, అవేరా ఎలక్ట్రిక్ స్కూటర్ సహవ్యవస్థాపకురాలు చందిని చందన, ప్రోగ్రాం కన్వీనర్ డా. కె.స్వర్ణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## కాసు శాయమ్మ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలు




**గుంటూరు విద్య జనవరి 3 ప్రభాతవార్త :** కాసు సాయమ్మ నగరపాలక ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయిఈ సందర్భంగా స్త్రీ విద్యకు వ్యతిరేక ఛాందస వాదులను దీటుగా ఎదురొడ్డి పోరాడి మహిళల అభ్యున్నతికి ఎంతగానో కృషిచేసిన సావిత్రిబాయి పూలేని స్మరించుకున్నారు.శ్రద్ధగా చదవండి శ్రమించి పనిచేయండి మంచి మార్గంలో నడవండి అన్న సావిత్రిబాయి పూలే సందేశాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో రాణించాలని ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు సందేశం ఇచ్చారు.కార్యక్రమంలో పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులందరిని ఘనంగా సత్కరించి వారి సేవలను ఎంతగానో కొనియాడారు.

# సావిత్రిబాయీ పూలేకు భారతరత్న ప్రకటించాలి

## ప్రధాని మోడీకి ఓబిసి నాయకుల విజ్ఞప్తి

**గుంటూరు విద్య జనవరి 3 ప్రభాతవార్త :** భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జీవితం దేశంలోని మహిళలకు స్ఫూర్తి దాయకమని ఆమె సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం భారత రత్న ప్రకటించాలని అఖిల భారతఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు



అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ ప్రధాని నరేంద్ర మోడీ కి విజ్ఞప్తి చేశారు. అఖిల భారత ఓబీసీ సంఘం రాష్ట్ర గౌరవ సలహా దారులు రాజపుత్ర సత్యం సింగ్ ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే 195 వ జయంతి సందర్భంగా స్థానిక బ్రాడీపేట లో ని షిర్డీ సాయి అంధుల పాఠశాలలో విద్యార్థి విద్యార్థినులకు పండ్లు పంపిణీ చేశారు.అనంతరం జరిగిన జయంతి సభలో వరప్రసాద్ యాదవ్ మాట్లాడుతూవిద్య ద్వారానే సామాజిక అసమానతలు అదిగ మించ వచ్చునని మహాత్మా జ్యోతిభా పూలే భావించి తన సతీమణి సావిత్రి బాయి ఫులే ని విద్యా వంతురాలి గా తీర్చిదిద్దారని, తన భర్త పూలే చూపిన మార్గంలో నడుస్తూ అనేక క్లిష్ట పరిస్థితుల ను అధిగమించి బాలికల విద్య అభ్యున్నతి కి సావిత్రి బాయి పూలే జీవితాంతము కృషి చేశారని వరప్రసాద్ యాదవ్ శ్లాఘించారు. మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ జీకే శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే ఆశయాల సాధన దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజపుత్ర సత్యం సింగ్ ,ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ సంఘం గౌరవ అధ్యక్షుడు దాసరి జాన్ బాబు, కుమ్మరి,శాలివాహన సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పారేళ్ళ బసవేశ్వర రావు, భట్రాజు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సరస్వతి కృష్ణంరాజు, ఓబీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొనిదె గోపీకృష్ణ, ఓబీసీ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తులసి, శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షులు ఇందుర్తి శివన్నారాయణ, పాఠశాల నిర్వహాకులు పూర్ణ చంద్ర రావు, గోపీ పాల్గొన్నారు

## హార్బర్ కాలవలో గల్లంతైన మత్స్యకారుని మృతదేహం లభ్యం

**నిజాంపట్నం, జనవరి 3, ప్రభాతవార్త:** సముద్రంలో చేపల వేటకు వెళ్ళేందుకు సిద్దమైన బోటు ఫ్యాన్ పరిశీలించటానికి నీటిలోకి దిగి గల్లంతైన మత్స్యకారుని మృతదేహం లభించిందని నిజాంపట్నం ఎస్ఐ కందుల తిరుపతిరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పి పానకాలు ఈనెల 2న నిజాంపట్నం హార్బర్‌వద్ద బోటు ఫ్యాన్ పరిశీలించటానికి నీటిలోకి దిగి మునిగిపోయాడన్నారు. పానకాలు (49) మృతి చెంది నీటిలో తేలియాడుతూ కనిపించాడని ఆయన తెలిపారు. మృతుని భార్య నాగలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

**పెదనందిపాడు జనవరి 3 (ప్రభాతవార్త) :** పెదనందిపాడు మండలం వరగానిలోని మండల పరిషత్ మోడల్ ప్రైమరీ స్కూల్లో శనివారం మండల విద్యాశాఖ అధికారులు దాతలు సహకారంతో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు లోవిందురామారావు ఆధ్వర్యంలో భారతదేశ సంఘసంస్కర్త తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని 14 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి ప్రధమ ద్వితీయ తృతీయ విభాగాలలో



గెలుపొందిన 18 మంది విద్యార్థులకు షీల్డ్ సర్టిఫికెట్స్ తో పాటు పాల్గొన్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్స్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంఈఓ 1 సిహెచ్ రమేష్ కుమార్ ఎం ఈ ఓ 2 పోపూరి జాకబ్ లు మాట్లాడుతూ ఇంత చిన్న పాఠశాలలో దాతల సహకారంతో పెద్ద కార్యక్రమం నిర్వహించడం హర్షినియమని ఇదే విధంగా పాఠశాల అభివృద్ధికి కూడా దాతల సహకారం తీసుకోవాలని సూచించారు. మహిళా ఉపాధ్యాయునీయులు గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి సావిత్రిబాయి పూలే అన్నారు వారి ఆశయ సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పెదనందిపాడు రోటరీ క్లబ్. జిల్లా సీనియర్ సభ్యులు పోపూరి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామారావు అభ్యర్థన మేరకు రోటరీ క్లబ్ తరఫున బాలికలకు పాఠశాల ఆవరణలో నాలుగు లక్షల రూపాయలతో టాయిలెట్ బ్లాక్ నిర్మించేందుకు ప్రపోజల్స్ పంపామని హై కమాండ్ నుంచి అనుమతి రాగానే కొద్ది నెలలలోనే నిర్మాణం చేపడతామన్నారు. సావిత్రిబాయి పూలేను . ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.అనంతరం మండలంలోని పలు పాఠశాలలో పనిచేస్తున్న పదిమంది మహిళా ఉపాధ్యాయులు. డి అరుణ కుమారి .ఎంబి రాజేశ్వరి. ఎల్ శ్రీ గౌతమి. జె అనిత. ఏ శ్రీలక్ష్మి. ఎం రేఖ. ఎం అనూష. డి సుధారాణి. కె అరుణ కుమారి. ఆర్ ధనలక్ష్మి లకు ఈ పాఠశాల పూర్వ విద్యార్థి ఆంధ్ర బ్యాంక్ విశ్రాంత మేనేజర్ కట్టా జనార్దన్ రావు సహకారంతో షీల్డ్ దుశ్యాలవులతో మండల విద్యాశాఖ అధికారులు మరో దాత కూరేటిభూషయ్య. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కే సంతోషం. బండారు రాంబాబు. పలు పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఏబీ పాలెం పాఠశాల స్కౌట్ విద్యార్థులు నిర్వహించిన దేశభక్తి గీతం నాటిక కంటతడి పెట్టించి ఆకట్టుకున్నది. విద్యార్థులకు నిర్వహించిన పోటీలకు న్యాయా నిర్ణయతలగా ఉపాధ్యాయులు పాణి రెడ్డి. సుభాసుందరం. విజయ్ కుమార్ లు వ్యవహరించారు.

## ఉద్యోగి సర్వీసులో నగదు పాక్షిక ఉపసంహరణ

**భట్టిప్రోలు(రేపల్లె), జనవరి 3, ప్రభాతవార్త:** చందాదారుల పెన్షన్ పథకం,జాతీయ పెన్షన్ పథకం చందాదారులు ఉద్యోగ విరమణ చేసే లోపు నాలుగు విడతల వరకు వారి ఖాతా నుంచి సొమ్ము వెనక్కి తీసుకోవచ్చని ఎపి సిపిఎసిసిఎ జిల్లా అధ్యక్షుడు గుర్రం మురళీమోహన్ శనివారం తెలిపారు.ఒక పాక్షిక ఉప సంహరణకు మరొక పాక్షిక ఉప



సంహకరణకు మధ్య నాలుగు సంవత్సరాల వ్యవధి ఉండాలని ఆయన చెప్పారు.స్వీయ ధృవీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.60 సంవత్సరాల లోపు లేదా సూపర్యాన్యుయేషన్ లోపు సిపిఎస్,ఎస్పీఎస్ ఖాతా నుంచి సొమ్ము వెనక్కి తీసుకోవచ్చని మురళీమోహన్ చెప్పారు.

# రూ.4.25 లక్షల విలువైన విద్యాసామాగ్రి అందజేత



**గంపలగూడెం జనవరి 3, ప్రభాతవార్త:** గంపలగూడెం మండలం కనుమూరు జిల్లా పరిషత్ హై స్కూల్ కు రూ. 4.25 లక్షల విలువైన వివిధ రకాల విద్యాసామాగ్రి వితరణ ఇచ్చినట్లు ఆ పాఠశాల హెచ్.ఎం నాగలక్ష్మి తెలిపారు. రోటరీ క్లబ్ జూబ్లీహిల్స్ హైదరాబాద్ కు చెందిన వీ బాలకోటరెడ్డి, చక్రవర్తి రెడ్డి, లక్ష్మీ వీ సీ రెడ్డి, కళ్యాణ్ పంగులూరి లు తమ పాఠశాలకు అవసరమైన కంప్యూటర్, ప్రింటర్, 4 ఇనుప బీరువాలు, సౌండ్ సిస్టం, ల్యాబ్ పరికరాలు, వివిధ రకాల ఆట వస్తువులు తోపాటు కుర్చీలు కూడా అందజేసినట్లు వివరించారు. ఎన్టీఆర్ జిల్లా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చెరుకూరి రాజేశ్వరరావు, పార్టీ నాయకులు రేగళ్ల వీరారెడ్డి, చెరుకు వీరారెడ్డి చేతుల మీదగా అందజేశారని పేర్కొన్నారు. కనుమూరు గ్రామానికి చెందిన వారి సమీప బంధువు ద్వారా విలువైన వస్తువులను అందజేసినట్లు హెచ్ఎం నాగలక్ష్మి పేర్కొన్నారు. పాఠశాలకు విద్యాసామాగ్రి అందజేసిన దాతలకు పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి. సాంబశివరావు, ఎంఈఓ పివిడిఎల్ నరసింహారావు, ఎస్ఎంసి చైర్మన్ కొమ్ము వెంకమ్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య రహిత గ్రామంగా తీర్చిదిద్దుదాం

## సర్పంచ్ వెంపాటి రజని,సెక్రటరీ కంభంపాటి సుదాకర్

**ఎ కొండూరు, జనవరి 3, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం మండల కేంద్రమైన ఎ కొండూరు గ్రామ పంచాయతీలో గ్రామ సర్పంచ్ వెంపాటి రజని సెక్రటరీ కంభంపాటి సుధాకర్‌లు పారిశుధ్య కార్మికుల ద్వారా జెసిబి, ట్రాక్టర్లతోముమ్మరంగా శానిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. క్రిస్మస్ నూతన సంవత్సరం సంక్రాంతి పర్వదినాలను దృష్టిలో ఉంచుకొని ముఖ్యంగా ఈ సంక్రాంతి పండుగకు స్వగ్రామాలకు స్వగృహాలకు ముఖ్యంగా పుట్టింటికి వచ్చే ఆడపిల్లలు బంధుగణాన్ని దృష్టిలో పెట్టుకుని ఎ కొండూరు పాత కొండూరు విజయవాడ తిరువూరు జాతీయ రహదారి-30 జంగిల్ క్లియరెన్స్‌తో పాటు కొండూరు పాత కొండూరు గ్రామాల్లో చెత్త కుప్పలు పెంట పేడ దిబ్బల తొలగింపు కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. సోమవారం కొండూరు, పాతకొండూరు గ్రామాల్లో మురుగు కాల్వల వద్ద బ్లీచింగ్ చల్లిస్తున్నట్లు సర్పంచ్ వెంపాటి రజని కార్యదర్శి కంభంపాటి సుధాకర్ శనివారం ప్రభాతవార్తకు తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించే గ్రామసభలో ఈ గ్రామాన్ని పారిశుధ్య రహిత గ్రామంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు సర్పంచ్ వెంపాటి రజని గ్రామ పంచాయతీ సెక్రటరీ కంభంపాటి సుధాకర్ శనివారం ప్రభాతవార్తకు తెలిపారు.

# ఒక ప్రయత్నం.. ఒక తరానికి మేలుకొలుపు




**విజయవాడ, జనవరి 3, ప్రభాతవార్త :** స్త్రీల విద్యాభివృద్ధికి విశేషంగా కృషిచేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి, మహిళా ఉపాధ్యాయునురాలు సావిత్రీబాయి పూలే ఒక గ్రామాన్ని మేలుకొలుపుతూ చేసిన ప్రయత్నం ఒక తరాన్ని మార్చేసిందని, ఒక దేశాన్ని అత్యున్నత స్థానంలో నిలబడుతుందని గురు చైతన్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు పాలేలా రామాంజనేయులు అన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సంఘం ఆధ్వర్యంలో శనివారం అట్టహాసంగా నిర్వహించిన సౌత్ ఇండియా సావిత్రిబాయి పూలే బెస్ట్ టీచర్ అవార్డ్స్ వేడుకలో ఏపి, తెలంగాణ, కర్ణాటకలకు చెందిన ఉత్తమ మహిళా ఉపాధ్యాయునులకు బహుమతి ప్రధానం చేశారు. కార్యక్రమ అధ్యక్షులు పాలేలా రామాంజనేయులు మాట్లాడుతూ, సావిత్రిబాయి తెరిచిన బడి నాడు నాటిన మొక్క మహావృక్షమై నేడు దేశవ్యాప్తంగా ఫలాలు ఇస్తుందన్నారు. సావిత్రిబాయి పూలే ఆదేశాలను ప్రతిఒక్కరూ గుర్తు చేసుకోవాలనే కాంక్షతోనే మహిళా ఉపాధ్యాయులకు అత్యున్నత గౌరవాన్ని ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో బోడె రామచంద్ర యాదవ్, తెలంగాణకు చెందిన శ్రీకాంత్ కాల్, కర్ణాటక నుంచి ప్రొఫెసర్ శైలజ పాల్గొని ప్రసంగించారు.

# వివిఐటి యు లో ఘనంగా ప్రారంభమైన " ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ " సమావేశాలు

గుంటూరు విద్య జనవరి 3 ప్రభాతవార్తక జాతి గొప్పతనం ఆ జాతి చరిత్రపై ఆధారపడి ఉంటుందని, చరిత్ర సాక్ష్యాలైన శాసనాలు,శిల్పాలు,పత్రాలను రక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని అవనిగడ్డ శాసనసభ సభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ విశ్వవిద్యాలయం నందు రెండురోజులపాటు జరగనున్న ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ 48వ వార్షిక సమావేశాలని మండలి బుద్ధ ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ చరిత్ర పాత్రను మనం ఎప్పటికీ విస్మరించకూడదని చరిత్ర తెలుసుకోవడం ద్వారా గతంలో జరిగిన తప్పులను మనం చేయకూడదన్న ఆలోచన వస్తుందని అన్నారు. హిస్టరీ కాంగ్రెస్ మహోత్తర చరిత్ర గల సంస్థ అని ఈ సమావేశాలు కొత్త ఆలోచనకు, కొత్త దృష్టికి నాంది అవుతుందని తెలిపారు. రాష్ట్రవిభజనల ద్వారా మన చరిత్ర చాలా నష్టపోయిందనీ ఆంధ్రప్రదేశ్ చరిత్రకు సంబంధించి తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలలో ఉన్న పురావస్తు వస్తువులు, శిల్పాలు , శాసనాలు, నాణేలు, తాళపత్ర గ్రంథాలు, రాత ప్రతులను మనం ఇప్పటికీ పూర్తి స్థాయిలో తెచ్చుకోలేకపోయామన్న అనేదన వ్యక్తం చేశారు. చరిత్ర పట్ల జాతిలో చైతన్యం వస్తే అభివృద్ధి దానంతట అదే జరుగుతుందని అన్నారు. నేను తెలుగువాడిని నా జాతి తెలుగు జాతి అనే విధంగా ప్రజలలో చరిత్రకారులు చైతన్యం తేవాలని. సాంకేతిక, వైద్య విద్యాలయాలలో కూడా హిస్టరీ సబ్జెక్ట్ ఉండాలని అన్నారు. గూడూరులో నిర్వహించిన 47వ వార్షిక సమావేశాల లో సమర్పించిన పరిశోధనా పత్రాల సంపుటిని హిస్టరీ కాంగ్రెస్ వ్యవస్థాపక సభ్యులు ఆచార్య వకుళాభరణం రామకృష్ణ, అధ్యక్షులు బి. కేశవనారాయణ, ప్రధాన కార్యదర్శి డా॥ మొవ్వా శ్రీనివాసరెడ్డిలతో కలసి మండలి బుద్ధ ప్రసాద్ ఆవిష్కరించారు. అనంతరం ఈ సమావేశాలకు హాజరైన 150 మంది చరిత్రపరిశోధకులు ప్రాచీన, మధ్య, ఆధునిక యుగాల చరిత్ర విభాగాల కీలక ఉపన్యాసాలు మరియు చారిత్రక రచనా విధానం స్థానిక చరిత్ర విభాగాలపై పరిశోధనా పత్రాలను ఆచార్య పిసి వెంకటసుబ్బయ్య, ఈ.ఎస్. ఎమ్ ప్రసాద్. కె. గంగయ్య, బెల్లంకొండ రమేష్ చంద్రబాబు అధ్యక్షతన అందించారు. కేంద్ర విశ్వవిద్యాలయం హైదరాబాద్ హిస్టరీ అధ్యాపకురాలు ప్రొ॥ అలోకా పరాశర్ శేన్ 6 నుండి 14వ శతాబ్దంలో జరిగిన గ్రామీణ సామాజిక, ఆర్థిక పరిణామాల గురించి మామిడిపూడి వెంకట రంగయ్య 22వ స్మారక ఉపన్యాసంతో తొలిరోజు సమావేశాలు ముగించారు. ఈ సందర్భంగా ఈశ్వర వరప్రసాద పరిషత్తు సహకారంతో కోకా విజయలక్ష్మి నృత్య దర్శకత్వంలో ప్రదర్శించిన తెలుగు ప్రశస్తి నృత్య రూపకం ఆహుతులను విశేషంగా అలరించింది.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా॥వై. మల్లికార్జున రెడ్డి, హిస్టరీ కాంగ్రెస్ పూర్వ అధ్యక్షులు ఆచార్య ఏ.ఆర్,.రెడ్డి, వివిఐటియూ పబ్లికేషన్ డివిజన్ సంధానకర్త మోదుగుల రవికృష్ణ హాజరయ్యారు.

# జనసేన పార్టీ వీరమహిళ పై దాడి

**వట్టిచెరుకూరు రూరల్, జనవరి 3, ప్రభాతవార్త:** జనసేన పార్టీకి చెందిన వీర మహిళపై దాడి చేసిన దుండగులను చట్టప్రకారం చర్యలు తీసుకొని, కఠినంగా శిక్షించాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పు వెంకటరత్తయ్య, కార్యదర్శి దేగల లక్ష్మీనారాయణ, కొట్టు రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రత్తిపాడు నియోజకవర్గం, గుంటూరు రూరల్ మండలం, దాసరిపాలెం ప్లాట్స్ వద్దఉన్న సిఆర్ నగర్ లో జనసేన పార్టీ వీరమహిళ ఏపూరి శ్రీదేవి(వజ్రం), మరియు వారి కుటుంబ సభ్యులపై అదే ప్రాంతానికి చెందిన వారు అకారణంగా చేసిన దాడి హేయమైన చర్యఅని, దీనిని పూర్తిగా ఖండిస్తున్నట్లు చెప్పారు. జరిగిన విషయమై బాధితురాలు ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు.

# ఆర్.ఈ.ఐ" సేవాసంస్థ 55వ వార్షికోత్సవ వేడుకలు

**తెనాలి టౌన్ జనవరి3(ప్రభాతవార్త):** పట్టణంలోని పాడిసన్ పేటలో గల దివంగత బిషప్ డాక్టర్ గడ్డం థామస్ కాంపౌండ్ లో "ఆర్.ఇ.ఐ"సేవా సంస్థ 55వ వార్షికోత్సవ వేడుకలను సంస్థ నిర్వాహకులు ఇంటర్నేషనల్ బిషప్ గడ్డం




థామస్ జూనియర్ తేజ దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.శనివారం నిర్వహించిన ఆ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ హాజరయ్యారు. ఆ సభకు ఐ టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మల్లవరపు విజయ్ కుమార్ అధ్యక్షత వహించారు. క్రీస్తు గీతాలాపనలు బైబిల్ వాక్య పరిచర్య పూర్వకంగా జరిగిన ఆ కార్యక్రమంలో పాస్టర్ గడ్డం డేవిడ్ వాక్యోపదేశం చేశారు. ఆ సభలో "ఆర్.ఈ.ఐ" సంస్థ నిర్వాహకులు ఇంటర్నేషనల్ బిషప్ గడ్డం సాధుతామస్ జూనియర్ మాట్లాడుతూ, సమస్థ 55సంవత్సరాలుగా సమాజ సేవలు ఆధ్యాత్మిక సేవలు కొనసాగిస్తుందని తెలిపారు.సంస్థ వ్యవస్థాపకులు దివంగత బిషప్ గడ్డం థామస్ ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఆ సభలో ముఖ్య అతిథి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ, దేవుని ఆశీర్వాదాలు అందరిపై ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించుము అన్న సూక్తిని ప్రతి ఒక్కరూ విడువక నడుచుకుంటే ఎంతో మేలులు జరుగుతాయని తెలిపారు.నమ్మి విశ్వాసముంచి దేవుని మార్గంలో నడిచే వారిని దేవుడు ఎల్లవేళలా అభివృద్ధి చెందేలా చేస్తారని చెప్పారు. "ఆర్.ఇ.ఐ" సంస్థ సేవలు మరింత విస్తరించే విధంగా సంస్థ అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.నిర్వాహకులు ఇంటర్నేషనల్ బిషప్ గడ్డం సాదు తామస్ జూనియర్ తేజ దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సభ వేదికపై అతిథులు నూతన సంవత్సర కేకును కట్ చేసి, నూతన సంవత్సర క్యాలెండర్, దేవుని వాగ్దాన సందేశాలను ఆవిష్కరించారు.

## ఏపిబార్ కౌన్సిల్ మెంబర్‌గా బలపరచండి : కృష్ణారెడ్డి పిలుపు

తెనాలి టౌన్ జనవరి3(ప్రభాతవార్త): ఫిబ్రవరి 13న జరగబోయే ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ అసోసియేషన్ ఎన్నికలలో కౌన్సిల్ మెంబర్ గా పోటీ చేస్తున్న పీవీ.కృష్ణారెడ్డి శనివారం తెనాలి లోని న్యాయస్థానముల ప్రాంగణమునందు, తెనాలి బార్ అసోసియేషన్ సభ్యులు మరియు సహచర న్యాయవాదులను కలిశారు. ఈ సందర్భంగా బివ. కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ఫిబ్రవరి 13న జరగబోయే రాష్ట్ర



బార్ కౌన్సిల్ అసోసియేషన్ ఎన్నికల్లో కౌన్సిల్ మెంబర్ గా పోటీ చేస్తున్నానని కావున మీ అందరి మద్దతు కావాలని, కావున మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించవలసిందిగా న్యాయవాది మిత్రులను కోరుతున్నానన్నారు.ఈ కార్యక్రమంలో, తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి. ప్రభాకరరావు, కార్యదర్శిగౌరీ,శంకర్,మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి. మల్లిఖార్జునరెడ్డి, మరియు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా శివ ముక్కోటి ఉత్తర ద్వార దర్శనం

**పెదనందిపాడు జనవరి 3 (ప్రభాతవార్త)** పెదనందిపాడు లోని శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఆరుద్ర నక్షత్రం శివ ముక్కోటి సందర్భంగా. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వార్లను ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ఆలయ ప్రధాన



అర్చకులు వడ్లమూడి చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం. అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి దర్శనం చేసుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ వారు భక్తులకు ఇబ్బందులు కలగకుండా పలు రకాల సౌకర్యాలు అందజేశారు.

## రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్

**తెనాలి మున్సిపాలిటీ జనవరి3(ప్రభాతవార్త):** పట్టణంలో రోడ్లు విస్తరణ మరియు డ్రైనేజీ పనుల ఆధునీకరణ వంటి పలు అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక శనివారం ప్రారంభించారు.పట్టణం లోని పాత నవయుగ హోటల్ దగ్గర నుండి చిట్టి ఆంజనేయ స్వామి గుడి వరకు రోడ్డు వైండింగ్ మరియు సాయిబాబు గుడి దగ్గర నుండి చిన్నరావూరు పార్క్ వరకు తూర్పు పడమర ఇరువైపులా డ్రైనేజి మరియు రోడ్డు వైండింగ్ పనులకు శంకుస్థాపన చేసిన మున్సిపల్



చైర్మన్ మరియు కమీషనర్ రామ అప్పలనాయుడు. రెండు కోట్ల అంచనా తో రూపొందించబడిన ఈ అభివృద్ధి కార్యక్రమాలు పూర్తయితే పట్టణంలో ప్రధాన రహదారి అయిన బోస్ రోడ్డు మరింత విశాలంగా ప్రజలకు అందుబాటులో ఉంటుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు,28వ వార్డు కౌన్సిలర్ యాతాటి అనిల్, మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, మున్సిపల్ ఇంజనీర్ పి.శ్రీకాంత్, అసిస్టెంట్ ఇంజనీర్ సూరిబాబు, మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తెదేపా బిసిసెల్ ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలు

**తెనాలి మున్సిపాలిటీ జనవరి3 (ప్రభాతవార్త):** సామాజిక సంఘసంస్కర్త, సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని, ఉమ్మడి గుంటూరు కృష్ణా జిల్లాల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆదేశానుసారం,తెనాలి పట్టణ తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు ఫణిదపు దుర్గ ఆధ్వర్యంలో, సావిత్రిబాయిపూలే చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పట్టణ తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు పణిదపు దుర్గ మాట్లాడుతూ,సామాజిక ఆంక్షలు ఉన్న కాలంలో వాటన్నిటిని ఛేదించి విద్య మాత్రమే విముక్తికి మార్గమని నిరూపించిన ధైర్యశాలి సావిత్రిబాయి పూలే అని, అణచివేత,అవమానం, అపహాస్యము వంటి ఎన్నో అవరోధాలను ఎదుర్కొంటూ కూడా సమానత్వం, మానవత్వం,న్యాయం అనే



విలువల కోసం అలుపెరగ కుండా పోరాడిన ధీరవనిత సావిత్రిబాయి పూలే అని అంతే కాకుండా ఆమె దృష్టిలో చదువు అనేది కుల, లింగ వివక్ష నుండి విముక్తి పొందటానికి ఒక ఆయుధం లాంటిదని,ఇలాంటి పోరాటాల ఫలితం గానే బాలికల విద్య, దళితుల చదువు, వితంతువుల జీవితాల్లో వెలుగులు మొదలయ్యాయని నిరూపించిన తొలి వ్యక్తి సావిత్రిబాయి పూలే అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ తెదేపా అధ్యక్షులు మహమ్మద్ ఖుద్దుస్, జొన్నాదులు మహేష్, అశోక్ వర్ధన్, అక్కిశెట్టి వెంకటేశ్వరరావు, చాట్రగడ్డ ఆంజనేయులు,అన్నం పిన్నారావు, దివి సత్యం,షేక్ సుభాని,కొడాలి సుబ్రహ్మణ్యం, నాని, రాజా రమేష్, చైతన్య పవన్ ,శ్రావణ్, పెసర్లంక శ్రీను, వెంకటరత్నం, జస్వంత్,దేశబోయిన పోతురాజు,బొంత నారాయణ, కృవేన,శివ, పాల్గొన్నారు.

## షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల ఫైనల్లో
# అమీరా ఉత్కంఠ గెలుపు



**న్యూఢిల్లీ:** జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల ఫైనల్‌లో అమీరా అర్షద్ ఉత్కంఠభరితంగా గెలవగా, పురుషుల ట్రాప్‌లో జుహైర్ ఖాన్ స్వర్ణం సాధించాడు. మధ్యప్రదేశ్ షూటింగ్ అకాడమీలో జరిగిన 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మహిళల ఫైనల్‌లో అమీరా అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఆమె రైల్వేస్‌కు చెందిన రాజశ్రీ అనిల్‌కుమార్ సాంచెటిని 0.1 పాయింట్ల తేడాతో ఓడించి 251.9 స్కోరుతో ముగించింది. సంచేటి 251.8తో రజతం, ప్రాంజు శ్రీ సోమాని 230.5తో కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. తర్వాత న్యూఢిల్లీలోని డాక్టర్ కర్ణి సింగ్ షూటింగ్ రేంజ్‌లో జరిగిన పురుషుల ట్రాప్‌లో జుహైర్ ఖాన్ 43 హిట్‌లతో స్వర్ణం సాధించాడు. షాట్‌గన్ రేంజ్‌లో జూనియర్ పురుషుల ట్రాప్ కాంస్య పతక విజేత జుహైర్ పురుషుల ట్రాప్ ఫైనల్‌లో 43 హిట్‌లతో అగ్రస్థానంలో నిలిచాడు. ఇక శపత్ భరద్వాజ్ 40 హిట్‌లతో రజతం, ఒలింపియన్ కైనన్ చెనాయ్ 33 హిట్‌లతో కాంస్య పతకాన్ని సాధించారు. పురుషుల ట్రాప్ టీమ్ ఈవెంట్‌లో అహ్వార్ రిజ్వి, మొహమ్మద్ అసద్ సుల్తాన్ (118), రయాన్ రిజ్వి (107) సంయుక్తంగా 345 పాయింట్లతో స్వర్ణం గెలుచుకుంది. అలాగే 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ జూనియర్ మహిళల ఫైనల్లో తిలోత్తమ సేన్ ఫైనల్లో 253.1 పాయింట్లతో స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. సమీక్ష సుభాష్ పాటిల్ 250.0 స్కోరుతో రజతం, రమిత 230.0 స్కోరుతో కాంస్యాన్ని సాధించింది. యూత్ ఉమెన్స్ 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో తిలోత్తమ 251.6 పాయింట్లతో తన రెండో స్వర్ణాన్ని సాధించింది.

# టాటా స్టీల్ చెస్‌లో గుకేష్ ఔట్
## అతని స్థానంలో నిహాల్



**న్యూఢిల్లీ:** కోల్‌కతాలో జరుగుతున్న ప్రతిష్టాత్మక 2026 టాటా స్టీల్ రాపిడ్ మరియు బ్లిట్జ్ టోర్నమెంట్ నుండి ప్రస్తుత ప్రపంచ చెస్ ఛాంపియన్ దొమ్మరాజు గుకేష్ వైదొలిగాడు. వ్యక్తిగత కారణాల వల్ల, గుకేష్ ఈ సంవత్సరం టాటా స్టీల్ చెస్ ఇండియాలో పాల్గొవడం లేదు. దీంతో ఈ టోర్నమెంట్‌లో గుకేష్ స్థానంలో కోల్‌కతాలో జరిగిన రాపిడ్ ఈవెంట్ మాజీ విజేత నిహాల్ సరిన్ బరిలోకి దిగనున్నారు. క్లాసికల్ ఫార్మాట్‌లో ప్రపంచ ఛాంపియన్ అయిన ఈ ప్రతిష్టాత్మక ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ ఈవెంట్‌లో జనవరి 7 నుండి 11 తేదీ వరకు కోల్‌కతాలో జరిగే ఈ ప్రతిష్టాత్మక ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ ఈవెంట్‌లో విశ్వనాథన్ ఆనంద్‌తో తలపడాల్సి ఉంది. ప్రమోషనల్ ప్రచారాలలో గుకేష్ విస్తృతంగా పాల్గొన్నాడు. అంతేకాకుండా డిసెంబర్ 18న విడుదల చేసిన ఒక ప్రకటనలో ఈ టోర్నీలో పాల్గొనేవారి జాబితాలో గుకేష్ పేరు ఉంది. అయితే ఈ సంవత్సరం మొదటి టాప్ ఈవెంట్ అయిన టాటా స్టీల్ రాపిడ్, బ్లిట్జ్ టోర్నీ ఏడవ ఎడిషన్‌లో ఆడటం లేదని తాజాగా వెల్లడైంది. గుకేష్ స్థానంలో నిహాల్ సరిన్ ఎంపికయ్యాడు. కాగా ఈ ఏడాది ప్రధాన ఆకర్షణగా ప్రముఖ సీనియర్ గ్రాండ్ మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాడు. ఈ నేపథ్యంలో గుకేష్ టోర్నీ నుండి వైదొలగడానికి అధికారికంగా ఎటువంటి కారణం పేర్కొనబడనప్పటికీ, డిసెంబర్ 30న దోహాలో ముగిసిన వరల్డ్ రాపిడ్, బ్లిట్జ్‌లో టోర్నీలో ఆనంద్ చేతిలో గుకేష్ ఓటమిపాలయ్యాడు. ఈ సంవత్సరం మొట్టమొదటి ఎలైట్ క్లాసికల్ టోర్నమెంట్ టాటా స్టీల్ మాస్టర్స్‌లో ఆనంద్ పాల్గొంటుండటంతో దీని నుండి గుకేష్ వైదొలగినట్లు తెలుస్తోంది.






# పాక్‌తో భారత్ ఢీ
## మళ్లీ హై ఓల్టేజ్ మ్యాచ్‌లు
## ఉత్కంఠగా మూడు టోర్నీలు

**న్యూఢిల్లీ:** భారత్,పాక్ మ్యాచ్‌అనగానే మైదానంలో ఇరు దేశాల మధ్య జరిగే యుద్ధంలా భావిస్తారు. ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్‌పాక్ పోరుకు మరింత క్రేజ్ పెరిగింది. ఇరు దేశాలే కాకుండా యావత్ క్రికెట్ ప్రపంచం ఈ దాయాదుల పోరుపై ఆసక్తికనబరుస్తోంది. కొత్త ఏడాదిలోనూ పాకిస్థాన్‌తో భారత్ ఢీ కొట్టనుంది. ఈ దాయాది దేశాల మధ్య మూడు టోర్నమెంట్లలో హై ఓల్టేజ్ మ్యాచ్‌లు జరగనున్నాయి. అండర్ 19 ప్రపంచ కప్‌తో పాటు, పురుషుల, మహిళల టీ20 ప్రపంచ కప్‌లు దాయాదీ మ్యాచ్‌లకు వేదికగా నిలవనున్నాయి. గతేడాది భారత్, పాకిస్థాన్ జట్లు పలుమార్లు తలపడ్డాయి. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో ఒక సారి తలపడగా, ఆసియా కప్‌లో మూడు సార్లు ఢీకొన్నాయి. మహిళల వన్డే ప్రపంచకప్‌లో ఒకసారి ఆడగా, అండర్ 19 ఆసియాకప్‌లో రెండు సార్లు తలపడ్డాయి. అండర్ 19 ఆసియా కప్ ఫైనల్ మినహా ప్రతీ మ్యాచ్‌లోనూ భారత్‌నే విజయం వరించింది. ఇక 2026లో ఈ నెల 15 నుంచి ప్రారంభమయ్యే అండర్ 19 ఐసీసీ పురుషుల ప్రపంచ కప్‌లోనూ భారత్, పాకిస్థాన్ జట్లు తలపడనున్నాయి.అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఇరు జట్లు లీగ్‌దశలో తలపడటం లేదు. తొలిసారి భారత్, పాకిస్థాన్ జట్లు వేర్వేరు గ్రూపుల్లో ఉన్నాయి. భారత్ గ్రూప్ బీలో బంగ్లాదేశ్, న్యూజిలాండ్, యూఎస్ఏతో ఉండగా, పాకిస్థాన్ గ్రూప్ సీలో ఇంగ్లండ్,స్కాట్లాండ్, జింబాబ్వేలు ఉన్నాయి. వేర్వేరు గ్రూప్‌లో ఉన్నందున లీగ్ స్టేజితో పాటు సూపర్6లో తలపడే ఛాన్స్ లేదు. కానీ ఇరు జట్లు మెరుగైన ప్రదర్శన కనబర్చితే సెమీఫైనల్ లేదా ఫైనల్లో తలపడే ఛాన్స్ ఉంది.అలాగే ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్‌లో భాగంగా శ్రీలంక, కొలంబోలోని ప్రేమదాస స్టేడియం వేదికగా ఫిబ్రవరి 15 భారత్, పాకిస్థాన్ జట్లు తలపడనున్నాయి. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరు దేశాలు తటస్థ వేదికగా మ్యాచ్‌లు ఆడాలనే ముందస్తు ఒప్పందంలో భాగంగా ఈ మ్యాచ్ శ్రీలంకలో జరగనుంది. ఇరు జట్లు మెరుగైన ప్రదర్శన చేస్తే సెమీఫైనల్, ఫైనల్లో మరోసారి తలపడనున్నాయి. ఇక మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో మాత్రం భారత్, పాకిస్థాన్ జట్లు ఒకే గ్రూప్‌లో ఉన్నాయి. ఇంగ్లండ్ వేదికగా జరిగే ఈ టోర్నీ భారత్, పాకిస్థాన్ మ్యాచ్ ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జూన్ 14న జరగనుంది. మెరుగైన ప్రదర్శన కనబర్చితే సెమీఫైనల్ లేదా ఫైనల్లో మరోసారి తలపడవచ్చు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు జరగడం లేదన్న సంగతి తెలిసిందే. కేవలం ఐసీసీ టోర్నీల్లో మాత్రమే భారత్, పాకిస్థాన్ జట్లు తలపడుతున్నాయి.

## యూత్ కంటెండర్ టోర్నీలో
## దివ్యాంశి, సిండ్రెలా
# శుభారంభం

**న్యూఢిల్లీ:** డబ్ల్యూటీటీ యూత్ కంటెండర్ టోర్నీలో భారత యువ ప్లేయర్లు దివ్యాంశి భౌమిక్, సిండ్రెలా దాస్ శుభారంభం చేశారు. ఈ టోర్నీలో బాలికల అండర్ 17 సింగిల్స్ లీగ్ పోరులో డిఫెండింగ్ చాంపియన్ దివ్యాంశి 11-4, 11-1, 11-2తో నిజా కామత్‌పై అలవోక విజయం సాధించింది. గత ఏడాది ఇదే టోర్నీలో అండర్15 తో పాటు, అండర్17 టైటిళ్లు దక్కించుకున్న దివ్యాంశి ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచింది. ఇందులో భాగంగా ఈ టోర్నమెంట్‌లో వరుసగా మూడు గేముల్లో ప్రత్యర్థిని చిత్తుచేసింది.మరో సింగిల్స్ లో సిండ్రెలా 11-6, 11-6, 11-2తో తానియా కర్మాకర్‌పై ఘనవిజయంసాధించింది. జపాన్ టీటీ ప్లేయర్ మికు మత్సుషిమా 11-6, 11-3, 11-8తో అన్వి గుప్తాపై గెలిచి నాకౌట్‌లోకి ప్రవేశించింది. ఇక బాలుర అండర్17 విభాగంలో టాప్‌సీడ్ రిత్విక్ గుప్తా 11-9, 11-5, 11-5తో ధృవా మల్లిఖార్జున్‌పై గెలిచాడు. లోకల్ ప్యాడ్లర్ వేద్ పంచల్ వరుసగా రెండు గేముల్లో గెలిచి గ్రూపులో అగ్రస్థానంలో నిలిచాడు. ఇదే సమయంలో బాలుర అండర్ 13 విభాగంలో శౌర్య గోయల్ 10-12, 11-9, 13-11, 7-11, 11-6తో సుచేత్ ధర్నెవార్‌పై గెలిచి ముందంజ వేశాడు.





ఆట



# ఉమెన్స్ హాకీ లీగ్‌లో రాంచీ రాయల్స్ విక్టరీ

**న్యూఢిల్లీ:** మహిళల హాకీ ఇండియా లీగ్ 2025-26లో రాంచీ రాయల్స్ 2-0 తేడాతో సూర్మా హాకీ క్లబ్‌ను ఓడించింది. రుతుజా దాదాసో పిసల్ (30వ నిముషం), సాక్షి రాణా (54) రెండు గోల్స్ చేశారు. రాంచీ రాయల్స్ ప్రారంభంలో ఆధిక్యంలో ఉన్నా, సూర్మా దాడిని ప్రదర్శించి మొదటి 15 నిమిషాల్లోనే 10 సర్కిల్ చొచ్చుకుపోయింది. 12వ నిమిషంలో సూర్మా మొదటి పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది. కానీ పెన్నీ స్క్విబ్ కొట్టిన షాట్‌ను మొదటి రషర్ ఆపాడు. 18వ నిమిషంలో, రుతుజా దాదాసో పిసల్ తీసిన షాట్‌ను సవిత సేవ్ చేసింది, హన్నా కాటర్ రీబౌండ్‌లో బంతిని నియంత్రించలేకపోయింది మరియు ఆ అవకాశాన్ని రాయల్స్ వృధా చేసుకుంది. 25వ నిమిషంలో, రాంచీ రాయల్స్‌కు చెందిన ఇషిక సర్కిల్ లోపల ఫౌల్ చేసి, సూర్మా హాకీ క్లబ్‌కు పెనాల్టీ స్ట్రోక్ ఇచ్చింది, అయితే, మాధురి కిండో చేసిన అద్భుతమైన సేవ్ కారణంగా స్క్విబ్ తిరస్కరించబడింది. మరుసటి నిమిషంలో, సూర్మా పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది, వారు ఒత్తిడిని పెంచుతూనే ఉన్నారు, కానీ స్క్విబ్ స్ట్రైక్‌ను మళ్ళీ మొదటి రషర్ ఆపాడు. ఇది కూడా చదవండి 202526 పురుషుల హాకీ ఇండియా లీగ్ గురించి మీరు తెలుసుకోవలసినవన్నీ మొదటి అర్ధభాగం ముగియడానికి కొన్ని సెకన్లు మిగిలి ఉండగా, రాంచీ రాయల్స్ జట్టు తొలి గోల్ సాధించింది. అగోస్టినా అలోన్సో మిడ్‌ఫీల్డ్ నుండి సర్కిల్‌లోకి శక్తివంతమైన పాస్‌ను అందించాడు, రుతుజా దాదాసో పిసల్ బంతిని పరిపూర్ణంగా పట్టుకుని, నెట్‌లోకి మళ్లించి గోల్ చేయడంలో అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. మూడవ క్వార్టర్ ప్రారంభ నిమిషాల్లో, సూర్మాకు చెందిన ఒలివియా షానన్ అద్భుతమైన వ్యక్తిగత ప్రయత్నం చేసింది, ప్రమాదకరమైన స్థితిలో ఆమె బ్యాక్ హ్యాండ్ షాట్ కొట్టి బంతిని గెలుచుకుంది, దీనిని రాంచీ రాయల్స్‌కు చెందిన బిచు దేవి ఖరీబమ్ తిరస్కరించింది. 34వ నిమిషంలో, మరియా ఓర్టిజ్ ఆటపట్టించే విధంగా రాయల్స్‌కు ఆధిక్యాన్ని పెంచింది, ఆమె తన మార్కర్‌ను అధిగమించి గోల్ వైపు తక్కువ దూరం నుండి షాట్ వేయడంలో బాగా రాణించింది, కానీ బంతి పోస్ట్‌ను తాకింది. ఆట ముగియడానికి కేవలం రెండు సెకన్లు మిగిలి ఉండగా, రాంచీ రాయల్స్ మరో పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది, కానీ బంతిని సమర్థవంతంగా ట్రాప్ చేయకపోవడంతో అవకాశం చేజారిపోయింది. 54వ నిమిషంలో, రాంచీ రాయల్స్ మరో అద్భుతమైన ఫీల్డ్ గోల్‌తో తమ ఆధిక్యాన్ని పెంచుకుంది. రాయల్స్ తమ ఆధిక్యంలో కొనసాగుతుండగా, సాక్షిరాణా (54ఖి) గోల్‌పోస్ట్ యొక్క కుడి ఎగువ మూలలోకి గట్టి కోణం నుండి శక్తివంతమైన స్ట్రైక్‌ను విడుదల చేసింది. మ్యాచ్ చివరి నిమిషంలో సూర్మా హాకీ క్లబ్ కీలకమైన పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది, స్క్విబ్ డ్రాగ్‌ఫ్లిక్‌ను బిచు దేవి ఖరీబమ్ తిరస్కరించడంతో ఆమె ఆట క్లీన్ షీట్‌తో ముగిసింది.






Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14